గురువారం 27-4-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 35

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'




కోల్‌కతా గెలుపు బాట...

రాణించిన వరుణ్, రాయ్. బెంగళూరుపై 21 పరుగులతో విజయం - 12లో



లోన్ యాప్స్‌తో జాగ్రత్త!

విద్యార్థులను, గృహిణులను టార్గెట్ చేస్తున్న నకిలీ లోన్ యాప్‌లు - 11లో



నక్షత్రాలు పేలితే భూమికి ముప్పు!

సూపర్‌నోవా పేలుడుతో ఓజోన్ పొర తుడిచిపెట్టుకుపోతుందని, ఫలితంగా జీవులు అంతరించిపోతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

- వివరాలు 6లో



మళ్లీ ఢిల్లీ మేయర్‌గా షెల్లీ

ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా నేత, ప్రస్తుత ఢిల్లీ మున్సిపాలిటీ(ఎంసీడీ) మేయర్ షెల్లీ ఒబెరాయ్ మరోమారు మేయర్‌గా ఎంపికయ్యారు.

- వివరాలు 6లో



కేజ్రీవాల్ 'ఇంటి' ఖర్చు 45 కోట్లు

కేజ్రీవాల్ తన అధికార నివాస సుందరీకరణ కోసం రూ.45 కోట్లకుపైగా ఖర్చుచేశారని బీజేపీ, కాంగ్రెస్ దుమ్మెత్తిపోశాయి.

- వివరాలు 6లో



భారత సంతతి వ్యక్తికి ఉరి

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యవహారంలో సింగపూర్‌లో భారత సంతతికి చెందిన తంగరాజు సుప్పయ్యకు ఉరిశిక్ష వేశారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్


కాంగ్రెస్‌లో 'ఆస్తుల గణన'



కాంగ్రెస్ పార్టీ తన ఆస్తుల లెక్క తేల్చుకునే పనిలో పడింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఆ పార్టీకి ఉన్న ఆస్తుల వివరాలను సేకరించడంపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా తెలంగాణలోనూ ఉన్న ఆస్తుల లెక్క తేల్చేందుకు టీపీసీసీ సిద్ధమవుతోంది.

- వివరాలు 3లో


ప్రపంచ దేశాలకు దీటుగా అంతరిక్ష పరిశోధనలు



అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ప్రపంచ దేశాలకు పోటీగా మారిందని, సొంతంగా ఎన్నో విజయవంతమైన ప్రాజెక్టులను చేపట్టిందని భారత తొలి వ్యోమగామి రాకేష్‌శర్మ అన్నారు. ఓయూలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

- వివరాలు 7లో

జేఈఈ అడ్వాన్స్‌డ్‌నూ అధిగమించొచ్చు!



జేఈఈ మెయిన్స్‌కు పడే కష్టం, అడ్వాన్స్‌డ్‌కు సైతం కలిసి వస్తుందని సబ్జెక్టు నిపుణులు అంటున్నారు. మెయిన్స్‌లో ఓ మోస్తరు ర్యాంకు సాధించిన ప్రతి వ్యక్తీ కాస్త శ్రద్ధ పెడితే అడ్వాన్స్‌డ్‌లో రాణించడం తేలికే అని చెబుతున్నారు.

- వివరాలు 2లో



రాష్ట్రంలో ఈదురుగాలులు, వడగళ్ల వానలు చేసిన నష్టానికి చిన్న ఉదాహరణ ఇది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని భువనగిరి మార్కెట్ యార్డుకు తెస్తే.. అకాల వర్షానికి కొట్టుకుపోయింది. తమకీ కష్టం ఏమిటని రోదిస్తూ కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు లచ్చమ్మ.

కల్లాల్లో కన్నీళ్లు..

రాష్ట్రంలో అకాల వర్షాలతో భారీగా దెబ్బతిన్న పంటలు

- కోతకు వచ్చిన వరి అంతా నేల పాలు
- పలుచోట్ల ఎకరానికి క్వింటాల్ ధాన్యం కూడా రాని పరిస్థితి
- కోసి పెట్టిన వరి నీట మునిగింది.. కొనుగోలు కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి
- ఐదు లక్షల టన్నుల మేరకు ధాన్యం తడిసిపోయిన వైనం
- భారీగా పంట నష్టంతో లబోదిబోమంటున్న రైతులు
- కొనుగోలు కేంద్రాలకు వడ్లు వచ్చే పరిస్థితి లేదంటున్న పౌర సరఫరాల శాఖ
- కోటి టన్నుల అంచనాలో సగమైనా రావడం అనుమానమేనని వెల్లడి

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు కన్నీళ్లు మిగులుస్తున్నాయి. ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షాలతో కోతకు వచ్చిన వరి పొలంలోనే నేలరాలింది. కోసి పెట్టిన ధాన్యం నీట మునిగింది. కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు వరదకు కొట్టుకుపోయాయి. 4.5 లక్షల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసినా.. ఒక్క వరి పంటే ఐదు లక్షల ఎకరాలకుపైగా దెబ్బతిన్నట్టు క్షేత్రస్థాయి పరిశీలనలో తెలుస్తోంది. కొన్నిచోట్ల ఎకరా పొలంలో కనీసం

మిగతా 5వ పేజీలో ▶

5 రోజులు.. 4.5 లక్షల ఎకరాల్లో నష్టం

అకాల వర్షాల నష్టంపై వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

- నెల రోజుల్లో రెండు సార్లు భారీ వర్షాలు..
- మొత్తం 9.5 లక్షల ఎకరాల్లో నష్టం
- భారీగా దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు
- మళ్లీ వర్షాల హెచ్చరికతో రైతుల్లో ఆందోళన
- క్షేత్రస్థాయిలో పర్యటించని వ్యవసాయ ఉన్నతాధికారులు

- వివరాలు 5లో

అండగా ఉంటాం

పంట నష్టంపై మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి కేటీ రామారావు ప్రకటించారు. రైతాంగానికి నష్టం జరగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించాలని.. రైతులకు భరోసా కల్పించాలని సూచించారు. ఇటీవలి అకాల వర్షాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం పట్ల సీఎం కేసీఆర్ అత్యంత సానుకూలంగా ఉంటారని, ప్రస్తుత పరిస్థితుల్లోనూ సీఎం అండగా ఉంటారని పేర్కొన్నారు.

రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్!

నేడు కూడా వానలు.. పలుచోట్ల భారీ వర్షాలకు చాన్స్

- హైదరాబాద్ పరిసర జిల్లాల్లో కుండపోత కురవొచ్చన్న వాతావరణ శాఖ
- బుధవారం సగటున 2.32 సెం.మీ. వర్షపాతం నమోదు
- రాష్ట్రమంతటా నాలుగైదురోజులుగా వర్షాకాలాన్ని తలపించిన తీరు
- కొన్నిరోజులు 40 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడి - 5లో

రక్తసిక్తమైన రెడ్ కారిడార్ 11 మంది మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఘాతుకం

- భద్రతా దళాల బస్సును పేల్చేసిన మావోయిస్టులు
- ఐఈడీ పేలుడు తీవ్రతకు తునాతునకలైన వాహనం
- మృత్యువాతపడిన 10 మంది పోలీసులు, మరో డ్రైవర్





పేలుడు తీవ్రతకు రహదారిపై ఏర్పడిన భారీ గొయ్యి. (ఇన్‌సెట్)లో తునాతునకలైన వాహనం

నడి వేసవిలో రెడ్ కారిడార్ రక్తసిక్తమైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల బాంబు దాడిలో 11 మంది మరణించారు. మృతుల్లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) దళానికి చెందిన 10 మంది పోలీసులు, ఒక డ్రైవరు ఉన్నారు. రాజధాని రాయ్‌పూర్‌కు 450 కిలోమీటర్ల దూరంలో దంతెవాడ జిల్లా అరన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం ఈ ఘాతుకం చోటుచేసుకుంది. రాష్ట్రంలో గత రెండేళ్లలో ఇదే అతిపెద్ద దాడి కావడం గమనార్హం.

- వివరాలు 6లో

భారత్ పరివర్తన్ మిషన్‌గా బీఆర్‌ఎస్



దేశంలో గుణాత్మక మార్పు కోసం కృషి: సీఎం కేసీఆర్

- మహారాష్ట్రలోని ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ కమిటీలు... జూన్‌లో 12 లక్షల మందితో కిసాన్ ర్యాలీ
- అధికారంలోకి వస్తే రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా మహారాష్ట్ర
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరాలని పిలుపు
- బీఆర్‌ఎస్‌లో చేరిన చంద్రాపూర్, యావత్మాల్, గడ్చిరోలి నేతలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో గుణాత్మక మార్పు కోసం భారత్ రాష్ట్ర సమితి 'భారత్ పరివర్తన్ మిషన్'గా పని చేస్తుందని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. మే 7 నుంచి జూన్ 7 వరకు నెల రోజుల్లో మహారాష్ట్రలోని ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ కమిటీలు వేస్తామని, జూన్‌లో 10 లక్షల నుంచి 12 లక్షల మంది రైతులతో భారీ కిసాన్ ర్యాలీ నిర్వహిస్తామని ప్రకటించారు. నాగపూర్, ఔరంగాబాద్‌లో బీఆర్‌ఎస్ శాశ్వత కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అధికారంలోకి వస్తే రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా మహారాష్ట్రను తీర్చిదిద్దుతామని, ఓట్లు వేస్తేనే ఎవరైనా సహాయం చేయగలరు అంటూ వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్, యావత్మాల్, గడ్చిరోలి ప్రాంతాలకు చెందిన వివిధ పార్టీల నేతలు బుధవారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

దేశ సంస్కరణ లక్ష్యంతో ముందుకు..

'దేశంలో ఎన్నో పార్టీలు, ఎందరో రాజకీయ నాయకులు, ఎన్నో ప్రాంతీయ, జాతీయ పార్టీలున్నా.. దేశ పరిస్థితులపై అవగాహన ఉన్నా సరైన రీతిలో స్పందించడం లేదు. మనది వింత దేశం, ప్రజలు కూడా వింతైన వారు. మనం కుట్రలో ఇరుక్కుపోవడానికి గల కారణాలను చర్చించాలి. ఎన్నికల కోసమో, ఎవరినో నాయకుడిని చేయాలనే లక్ష్యంతోనో బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించలేదు. భారతదేశాన్ని సంస్కరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. దేశంలో అపూర్వ సంపద ఉన్నా నీరు, విద్యుత్తు వంటి సమస్యలను తెలంగాణ మినహా మహారాష్ట్ర సహా యావత్ దేశం ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఆనకట్టల ద్వారా నీటిని బంధించి, తాగునీరు, సాగు నీరు ఇవ్వడం ద్వారా రైతులు సిరి సంపదలతో తులతూగేలా చేసే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ఆవిర్భవించింది..' అని కేసీఆర్ అన్నారు.

మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యలు ఎందుకు?

'మహారాష్ట్ర పుణ్యభూమిలో గోదావరి, కృష్ణా, వెన్‌గంగ, పెన్‌గంగ, వార్ధా, మూల, ప్రవర,

మిగతా 3వ పేజీలో ▶

సర్వసభ్య సమావేశానికి సర్వం సిద్ధం

నేడు తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం 3లో

రామోజీ డబుల్ రోల్

హెచ్‌యూఎఫ్ కర్తగా మార్గదర్శి డిపాజిట్ల స్వీకరణ

- ప్రొప్రయిటర్‌గా డిపాజిట్‌దారులకు చెల్లింపులు.. రామోజీ రెండు పాత్రలనూ బట్టబయలు చేసిన ఉండవల్లి
- అదనపు డాక్యుమెంట్‌లో సుప్రీంకోర్టుకు వివరాలు
- మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ది పూర్తిగా చట్ట విరుద్ధ వ్యాపారం
- ఆర్‌బీఐలో, ఏపీ ప్రభుత్వంలో, దేశంలో ఎక్కడా రిజిస్టర్ కాలేదు



- డిపాజిట్లు స్వీకరించకుండా 1997 నుంచి నిషేధం కూడా ఉంది
- దానిని ఉల్లంఘించి డిపాజిట్లు స్వీకరించారు.. - 10లో

మార్గదర్శి అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధం

టీడీపీ నేత జీవీ రెడ్డి సవాల్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



- రామోజీ ఫిలింసిటీలో రామోజీ సమక్షంలో చర్చ జరగాలి
- లేదంటే టీడీపీ ప్రధాన కార్యాలయంలోనైనా చర్చ నిర్వహించాలి
- టీడీపీ ముసుగు తొలిగింది.. జనసేన పార్టీ కూడా మార్గదర్శికే మద్దతిస్తోంది


- వివరాలు 10లో



ఆర్టిజన్ల సమ్మె విరమణ

ఫలించిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ మధ్యవర్తిత్వం

- సీఎండీలతో ఎమ్మెల్యే బలాల చర్చలు
- బేషరతుగా సమ్మెను విరమిస్తున్నట్టు యూనియన్ల ప్రకటన



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్ల సమ్మె ముగిసింది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అహ్మద్ బలాల మధ్యవర్తిత్వం వహించడంతో సమ్మెను బేషరతుగా విరమించుకున్నట్టు .. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్(హెచ్ 82), ఎంఐఎం అనుబంధ ఇతెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్లు ప్రకటించాయి. తమ డిమాండ్ల సాధనకు ఈ రెండు యూనియన్లు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సమ్మెకు పిలుపునివ్వగా, విద్యుత్ సంస్థలపై పాక్షిక ప్రభావం కనబడింది. సమ్మెలో పాల్గొన్న యూనియన్ల ముఖ్య నేతలతో సహా 200 మంది ఆర్టిజన్లను ఉద్యోగాల నుంచి తొలగించినట్టు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు ప్రకటించిన

మిగతా 2వ పేజీలో ▶



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరుద్యోగ ర్యాలీలో రేవంత్ తదితరులు

మొదటి ఏడాదే 2 లక్షల ఉద్యోగాల భర్తీ

- రాష్ట్రంలో 90 సీట్లతో అధికారంలోకి వస్తున్నాం
- నిరుద్యోగ నిరసన ర్యాలీలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్

సాక్షి, ఆదిలాబాద్/కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కొత్త సంవత్సరంలో 90 సీట్లతో అధికారంలోకి వస్తున్నామని జోస్యం చెప్పారు. బుధవారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీ అనంతరం కార్నర్ సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష పత్రాల లీకేజీకి

మిగతా 3వ పేజీలో ▶

'చీజ్' బడీపై మస్త్ మస్త్!

- పాలమూరులో అమెరికా, దక్షిణాఫ్రికా మేకలు
- సానెన్, బోయర్ జాతి రకాలు పెంచుతున్న సాలార్‌నగర్ వాసి
- కూలీగా జీవితాన్ని మొదలుపెట్టి వ్యాపారవేత్తగా ఎదిగిన తీరు..
- చీజ్, ఔషధాల తయారీలో ఈ పాల వినియోగం..
- చీజ్ యూనిట్ కోసం 1,000 లీటర్ల పాలు ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు..
- ప్లాంట్ ఏర్పాటుపై ఇజ్రాయిల్ కంపెనీ ఆసక్తి
- ఈ తరహా ప్రత్యేక మేకల షెడ్డు తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిది

14లో

క్లుప్తంగా...

రాష్ట్రంలో మరో నాలుగు ఎఫ్‌ఎం ట్రాన్స్‌మీటర్లు

28న ప్రారంభించనున్న ప్రధాని

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఎఫ్‌ఎం ట్రాన్స్‌మీటర్లను ఈనెల 28న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. 91 ఆకాశవాణి ట్రాన్స్‌మీటర్లను ప్రధాని వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారు. ఈ ట్రాన్స్‌మీటర్లన్నీ 100 వాట్లవే. వీటిలో 4 ట్రాన్స్‌మీటర్లు రాష్ట్రంలోని నల్లగొండ, దేవరకొండ, రామగుండం, సిర్పూర్‌లలో ప్రారంభం అవుతున్నాయి. ప్రతి ట్రాన్స్‌మీటర్‌కు 20 కిలోమీటర్ల పరిధి వరకు ప్రసారాలు చేసే సామర్థ్యం ఉంటుంది. ఆకాశవాణి ఎఫ్‌ఎం సేవలను ఈ ట్రాన్స్‌మీటర్లను మరింత విస్తరించి, సమాచారాన్ని, వినోదాన్ని ప్రజలకు అందించటానికి దోహదపడతాయి. వీటి ఫ్రీక్వెన్సీ 100.1 మెగా హెర్ట్జ్.



జీనోమ్ వ్యాలీలో జీవ వైద్య పరిశోధనల కోసం 'నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ' ఏర్పాటుకు సహకరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్యను బుధవారం సత్కరిస్తున్న ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్) ప్రతినిధులు.

పర్యాటకానికి మరింత ఊపు తేవాలి: శ్రీనివాస్‌గౌడ్

పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.100 కోట్లను మించి ఆదాయం



సాక్షి, హైదరాబాద్: వంద కోట్ల రూపాయల ఆదాయం సముపార్జించిన పర్యాటకాభివృద్ధి సంస్థ ఆ ఊపును ముున్ముందు కూడా కొనసాగించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ రూ.118 కోట్ల ఆదాయం సాధించిందని, అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. నిరుపయోగంగా ఉన్న పర్యాటక కేంద్రాలను మెరుగుపరిచి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విదేశీ పర్యాటకుల సంఖ్య పెరిగేందుకు టూరిజం ప్రమోషన్ కార్యక్రమాలను విస్తృతం చేయాల్సి ఉందన్నారు. కాగా, రాష్ట్రం ఉమ్మడిగా ఉండగా ఈ మొత్తం రూ.120 కోట్లుగా ఉండేది. రాష్ట్రం విడిపోయిన తొలిసంవత్సరంలో తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ రూ.68 కోట్ల ఆదాయాన్ని పొందింది.

నూజివీడు సీడ్స్ చైర్మన్‌కు లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: నూజివీడు సీడ్స్ లిమిటెడ్ గ్రూప్ చైర్మన్ మండవ ప్రభాకర్‌రావుకు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో చేసిన సేవలకు అగ్రి బిజినెస్ సమ్మిట్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. బుధవారం పార్క్ హయత్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ఈ అవార్డు అందజేశారు. అగ్రి బిజినెస్ సమ్మిట్‌ను దేశ వ్యవసాయ రంగానికి సంబంధించిన ఒక ముఖ్యమైన కార్యక్రమంగా భావిస్తారు. ఇది పరిశ్రమలోని ప్రముఖులను గుర్తించి అవార్డులను అందజేస్తుంది. ప్రభుత్వ సంస్థ ఆగ్రోస్‌కు బిజినెస్ సమ్మిట్ పురస్కారం దక్కింది. సంస్థ ఎండీ రాములు, చైర్మన్ విజయసింహారెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

1న మేడే అవార్డుల ప్రదానం

సాక్షి, హైదరాబాద్: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మే1వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్మికుల కోసం శ్రమించిన ట్రేడ్ యూనియన్ నాయకులు, యాజమాన్యాలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవార్డులకు ఎంపికైన వారికి ఇప్పటికే వ్యక్తిగతంగా సమాచారం పంపించినట్లు తెలిపారు. ఈ ప్రదానోత్సవంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డితో పాటు పలువురు మంత్రులు, ప్రముఖులు పాల్గొంటారన్నారు.

రాష్ట్రంలో కొత్తగా 50 కరోనా కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 5,813 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 50 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.43 లక్షలకు చేరింది. ప్రస్తుతం 363 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతుండగా..50 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు అధికారులు తెలిపారు.

కనుచూపు మేర కనువిందుచేసే పచ్చిక..
ఆహ్లాదాన్ని పంచే పూలతో పాటు ఇతర మొక్కలు..
నీటిలో ఈదులాడే చేపలు, బాతులు..
చెట్టు కింద ధ్యానముద్రలో బుద్ధుడు..
పక్కనే తెలంగాణ పల్లె వాతావరణాన్ని కళ్లకు కట్టేలా ఎడ్లబండి.. అక్కడే సాగుపనిలో నిమగ్నమైన రైతు దంపతులు.. భవనం గోడలపై అల్లిబిల్లిగా అల్లుకున్న లతలు.. పచ్చికపై ఆడుకుంటున్న చిన్నారులు..
కుందేళ్ల పరుగులు.. పక్షుల కిలకిలారావాలు..
వేపచెట్టుకు కట్టిన ఊయల.. ఓపెన్ జిమ్..
ఇదీ అక్కడ అడుగుపెడితే కనిపించే అందమైన 'పల్లె దృశ్యం'. ఇంతకీ ఇదెక్కడో చెప్పలేదు కదూ..
యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ బంగ్లాలో..



తీరొక్క మొక్క.. పల్లె లెక్క

- ఉద్యానవనాన్ని తలపిస్తున్న 'యాదాద్రి' కలెక్టర్ బంగ్లా
- పలు రకాల మొక్కలతో సుందరీకరణ
- కళ్లకు కడుతున్న పల్లె వాతావరణం
- సేంద్రియ పద్ధతిలో మొక్కల పెంపకం, సంరక్షణ
- వ్యక్తిగత గార్డెనింగ్ విభాగంలో మొదటి బహుమతి



పర్యావరణహితంగా..

యాదాద్రి భువనగిరి జిల్లా సమీకృత కలెక్టరేట్‌తోపాటు కలెక్టర్, అదనపు కలెక్టర్ బంగ్లాలను గతేడాది ఫిబ్రవరి 12న ప్రారంభించారు. బంగ్లాలో చేరిన కలెక్టర్ పమేలా సత్పతి కేవలం 3 నెలల్లోనే తన అభిరుచికి అనుగుణంగా దాన్ని తీర్చిదిద్దుకున్నారు. కొత్త ఆవిష్కరణలకు, అందమైన ల్యాండ్‌స్కేపింగ్‌కు బంగ్లాను వేదికగా మార్చారు. పర్యావరణహితంగా, సేంద్రియ పద్ధతిలో గార్డెనింగ్, టెర్రస్, కిచెన్ గార్డెనింగ్ నిర్వహిస్తూ పలురకాల పూలమొక్కలు పెంచుతున్నారు. కలెక్టర్‌గా క్షణం తీరికలేకుండా గడిపే ఆమె కొద్ది సమయం చిక్కినా మొక్కల సంరక్షణలోనే గడుపుతారు. బంగ్లాను ఉద్యానవనంగా మార్చిన ఆమె.. రాష్ట్ర ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జరిగిన గార్డెన్ ఫెస్టివల్–2023లో సేంద్రియ పద్ధతిలో పర్యావరణహితంగా చేపట్టిన వ్యక్తిగత గార్డెనింగ్ విభాగంలో మొదటి బహుమతిని అందుకున్నారు.



మొక్కలంటే ప్రాణం..

మొక్కలంటే నాకు ప్రాణం. ఉద్యోగ నిర్వహణలో ఎక్కడికి బదిలీపై వెళ్లినా నా వెంట లగేజీతోపాటు మొక్కలను కచ్చితంగా తీసుకెళ్తా. మా అమ్మ వ్యవసాయ శాస్త్రవేత్త కావడంతో పదేళ్లప్పటి నుంచే నాకూ మొక్కలంటే ఇష్టం ఏర్పడింది. చిన్నప్పుడు మా అమ్మతో వెళ్తే అక్కడ కొందరు నాకు మొక్కలు బహుమతిగా ఇచ్చేవారు. అలా నాకు మొక్కల పెంపకంపై ఆసక్తి కలిగింది. నేను ప్రస్తుతం ఉంటున్న బంగ్లాలో 400 మొక్కల తొట్లు ఉన్నాయి. ఎంత బిజీగా ఉన్నా మొక్కల సంరక్షణకు రోజూ కొంత సమయం కేటాయిస్తాను.

– పమేలా సత్పతి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్

కలెక్టర్ బంగ్లా టెర్రస్ వందల రకాల మొక్కలతో చిన్నపాటి ఉద్యానవనాన్ని తలపిస్తోంది. ఇక బంగ్లా ఆవరణ 400 రకాల మొక్కలకు నెలవైంది. వాటి రక్షణకు విభిన్నమైన కుండీలు పెట్టారు. నీటి మొక్కల కోసం తొట్లను ఏర్పాటుచేశారు. కలెక్టర్ బంగ్లా కిటికీలు, ఇంట్లోకి వెళ్లే కారిడార్, వరండా.. ఇలా ఆవరణ మొత్తం అందమైన మొక్కలతో నింపేశారు. విధి నిర్వహణలో భాగంగా ఎక్కడకు వెళ్లినా కొత్త మొక్కలు సేకరించి.. వాటిని తన బంగ్లా ఆవరణలో నాటడం పమేలాకు అలవాటు. అలాగే, వేర్వేరు ప్రాంతాల్లో భిన్నమైన మొక్కలు పెంచుతున్న వారి దగ్గర నుంచీ కొన్నింటిని తెచ్చారు. వృథా సామగ్రి, రాళ్లు, ఇసుక, రకరకాల మట్టితో గార్డెనింగ్ నిర్వహిస్తున్నారు.

ఎటుచూసినా పచ్చదనం.. పూల అందాలే..



సాక్షి, యాదాద్రి

తప్పులు లేకుండా ఇంటర్ ఫలితాలు

- పొరపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు
- నిశిత పరిశీలనకు ప్రత్యేక సిబ్బంది
- అధికారులకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి తప్పులు, సమస్యలకు తావివ్వకుండా ఈసారి ఇంటర్ ఫలితాలు వెల్లడించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. దీనికోసం ప్రత్యేక కసరత్తు చేస్తోంది. ఫలితాల వెల్లడి ప్రక్రియ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం పరీక్షల విభాగం అధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. స్పాట్ వ్యాల్యుయేషన్, మార్కుల క్రోడీకరణ, డీ కోడింగ్ ప్రక్రియ, ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు విధానాలపై చర్చించారు. ప్రతీ సంవత్సరం పరీక్షలు, ఫలితాల వెల్లడిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈసారి ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ఇదే స్ఫూర్తిని ఫలితాల వెల్లడిలోనూ కనబరచాలనే ఆలోచనలో ఉన్నారు. ఫలితాల వెల్లడికి అవసరమైతే కొంత సమయం తీసుకోవడానికైనా వెనుకాడవద్దని, అన్ని స్థాయిల్లో పరిశీలించిన తర్వాతే ముందుకెళ్లాలని అధికారులకు మిత్తల్ సూచించారు. ఆన్‌లైన్ ఫీడింగ్‌లో గతంలో అనేక పొరపాట్లు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలపై అధికారులు లోతుగా అధ్యయనం చేశా రు. మార్కుల నమోదులో గతంలో ఎందుకు సమస్యలొచ్చాయి? సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలా? వ్యక్తుల తప్పిదాలా? అనే అంశాలపై మిత్తల్ ఆరా తీశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సాఫ్ట్‌వేర్‌ను పూర్తిస్థాయిలో నిపుణుల చేత పరిశీలించాలని సూచించారు.



పరీక్షలు రాసిన 9 లక్షల మంది విద్యార్థులు

ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షకు సంబంధించి దాదాపు 9 లక్షల మంది ఈసారి పరీక్ష రాశారు. ఇంతమంది మార్కుల నమోదు విషయంలో ప్రత్యేక పరిశీలనకు అధికారులను నియమించారు. అంతిమంగా అన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఫలితాల వెల్లడికి సిద్ధమవ్వాలనే ఆలోచనలో ఉన్నారు. ఫలితాల వెల్లడి తర్వాత ఎక్కడైనా తప్పు జరిగిందని భావిస్తే, మార్కులను మాన్యువల్‌గా తెప్పించి చూడటం ఆలస్యమవ్వొచ్చు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్‌లో వీలైనంత త్వరగా విద్యార్థి రాసిన పేపర్‌ను పరిశీలించే ఏర్పాట్లు చేయాలని, ఏ ఒక్క విద్యార్థి కూడా అధైర్యపడకుండా చర్యలు తీసుకోవాలని మిత్తల్ సూచించారు. మరో మూడు నాలుగు రోజుల్లో ఫలితాల వెల్లడి తేదీని అధికారికంగా ప్రకటించే వీలుందని బోర్డుకు సంబంధించిన ముఖ్య అధికారి ఒకరు తెలిపారు. మే రెండో వారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలితాలు వెల్లడించాలనే పట్టుదలతో అధికారులున్నారు.

ఆర్టిజన్ల సమ్మె విరమణ

▶ మొదటి పేజీ తరువాయి

విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యూనియన్ల నాయకుల విజ్ఞప్తితో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ బుధవారం సీఎండీతో ఫోన్‌లో మాట్లాడారు.

తొలగించిన ఉద్యోగులను తిరిగి చేర్చుకుంటాం

తొలగించిన ఉద్యోగులను తిరిగి ఉద్యోగాల్లో చేర్చుకోవాలని ఒవైసీ కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎండీ ..బేషరతుగా సమ్మె విరమిస్తే 10 రోజుల్లోగా ఉద్యోగాల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఇతేహాద్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అహ్మద్ బలాల రెండు యూనియన్ల నేతలతో కలిసి విద్యుత్ సౌధలో ప్రభాకర్ రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డిని కలిసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సమ్మెను బేషరతుగా విరమిస్తున్నట్టు హెచ్–82 యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిలు, ఇతెహాద్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ హుస్సేన్‌లు తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా ఆర్టిజన్లకు రూ.16 లక్షల గ్రాట్యుటీతో పాటు మెడికల్ అన్‌ఫిట్ పథకం కింద కుటుంబసభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని విజ్ఞప్తి చేయగా, ప్రభాకర్ రావు సానుకూలంగా స్పందించారని సాయిలు వెల్లడించారు. సమ్మె తొలిరోజే 200 మంది ఆర్టిజన్లను ఉద్యోగాల నుంచి తొలగించడంతో బుధవారం రెండోరోజు సమ్మెకు ఆర్టిజన్లు సుముఖత వ్యక్తం చేయలేదని, ఈ కారణంగానే విరమణ ప్రకటన చేయాల్సి వచ్చిందని యూనియన్ల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్వాన్స్‌డ్‌నూ అధిగమించొచ్చు!

- జేఈఈ మెయిన్స్‌కు పడిన కష్టం దీనికీ కలిసొస్తుంది
- విద్యార్థులు కాస్త శ్రద్ధ పెడితే చాలు
- స్పష్టం చేస్తున్న సబ్జెక్టు నిపుణులు



సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు వస్తే ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సీటు వస్తుందని తెలిసీ, చాలామంది పోటీ పడలేకపోతున్నారు. మెయిన్స్ పేపర్ కష్టంగా ఉందని, అడ్వాన్స్‌డ్ మరింత కష్టంగా ఉంటుందనే భావన వారిలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. దీంతో చాలామంది జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకుతో సరిపెట్టుకుంటున్నారు. ఈ ర్యాంకుతో జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో, ట్రిపుల్ ఐటీల్లో సీటు కోసం పోటీ పడుతున్నారు. నిజానికి మెయిన్స్‌కు పడే కష్టం, అడ్వాన్స్‌డ్‌కు సైతం కలిసి వస్తుందని సబ్జెక్టు నిపుణులు అంటున్నారు. మెయిన్స్‌లో ఓ మోస్తరు ర్యాంకు సాధించిన ప్రతి వ్యక్తీ కాస్త శ్రద్ధ పెడితే అడ్వాన్స్‌డ్‌లో రాణించడం తేలికే అని చెబుతున్నారు.

తగ్గుతున్న హాజరు.. ఉత్తీర్ణత

జేఈఈ మెయిన్స్ పరీక్ష దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది వరకు రాస్తున్నారు. వీరిలో 2.50 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు. అయితే వీరిలో పరీక్ష రాస్తున్న వారు 60 శాతానికి మించి ఉండటం లేదు. ఇలా రాసేవాళ్లలోనూ అడ్వాన్స్‌లో ఉత్తీర్ణులయ్యేవారు 30 శాతం కూడా ఉండటం లేదు. కోవిడ్ తర్వాత పరిస్థితి మరీ దిగజారినట్టుగా ఉంటోంది. అర్హత సాధించాం కాబట్టి అడ్వాన్స్‌డ్‌కు హాజరవుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. 2022 జేఈఈ ఫలితాలను పరిశీలిస్తే అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణత 26.17 శాతమే. 2021లో ఇది 29.54 శాతంగా ఉండటం గమనార్హం.

కోవిడ్ ప్రభావమూ కారణమే

జేఈఈ పరీక్షను గత రెండేళ్ళుగా కోవిడ్ వెంటాడుతోంది. 2019 నుంచి 2021 మధ్య కోచింగ్‌కు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఆన్‌లైన్ కోచింగ్ పెరిగింది. కానీ గ్రామీణ, ఒక స్థాయి పట్టణ కేంద్రాల్లో చదువుకున్న విద్యార్థులు స్థానికేతరులు చెప్పే ఆన్‌లైన్ కోచింగ్‌ను అర్థం చేసుకోలేకపోతున్నారు. 2022లో కోచింగ్ కేంద్రాలు తెరుచుకున్నా, చాలాచోట్ల నాణ్యతలేని ఫ్యాకల్టీ ఉందనే వాదన వినిపిస్తోంది. మరోవైపు కోవిడ్ కారణంగా రెండేళ్ళుగా చదువులో వెనుకబడటం కూడా జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌పై ప్రభావం చూపించిందని నిపుణులు చెబుతున్నారు.

ప్రత్యేక శిక్షణతో ప్రయోజనం

మెయిన్స్‌లో అర్హత సాధించిన ప్రతిఒక్కరూ అడ్వాన్స్‌డ్‌పై దృష్టి పెట్టాలి. దీనికోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకోవాలి. మెయిన్స్‌లో పడిన కష్టం అడ్వాన్స్‌డ్‌లో చాలావరకు కలిసి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. గత కొంత కాలంగా అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణత, కటాఫ్ తగ్గుతున్నాయి. మరోవైపు ఐఐటీల్లో సీట్లు పెరిగాయి. ఇవన్నీ కలిసి వచ్చే అంశాలు.

– ఎంఎస్ రావు, జేఈఈ పరీక్షల నిపుణుడు

కొన్నేళ్లుగా అడ్వాన్స్‌డ్‌లో అర్హత మార్కుల తీరు ఇలా..

కేటగిరీ	2022	2021	2020	2019	2018	2017
జనరల్	55	63	69	93	90	128
ఈడబ్ల్యూఎస్	50	56	62	83	81	115
ఓబీసీ	50	56	62	83	45	64
ఎస్సీ	28	31	34	46	45	64
ఎస్టీ	28	31	34	46	45	64
పీడబ్ల్యూడీ	28	31	34	46	45	64

కొన్నేళ్లుగా అడ్వాన్స్‌డ్‌కు హాజరవుతున్న, అర్హత సాధిస్తున్న వారి సంఖ్య

సంవత్సరం	అడ్వాన్స్‌డ్‌కు అర్హులు	హాజరు
2022	2,10,251	1,55,538
2021	2,50,597	1,41,699
2020	2,50,681	1,50,838
2019	2,45,194	1,74,432
2018	2,31,024	1,65,656
2017	2,21,834	1,71,000

'ఖేలో ఇండియా'తో క్రీడల్లో గణనీయ మార్పు

- మద్దతు, ప్రోత్సాహం వల్లే పతకాలు సాధించగలుగుతున్నాం: నిఖత్ జరీన్
- 'మన్ కీ బాత్' నారీశక్తి సదస్సులో తెలంగాణ క్రీడాకారులు



నిఖత్ జరీన్



మలావత్ పూర్ణ

సాక్షి, న్యూఢిల్లీ: ఖేలో ఇండియా ద్వారా అందుతున్న ఆర్థికసహాయంతో దేశంలో క్రీడలకు ఎంతో ఊతం వచ్చిందని, మార్పు స్పష్టంగా కనిపిస్తోందని ప్రముఖ బాక్సర్ నిఖత్ జరీన్ తెలిపారు. క్రీడల్లో పురోగతి సాధించి రికార్డులు సృష్టించిన క్రీడాకారులందరికీ, ముఖ్యంగా మహిళా అథ్లెట్లకు 'ఖేలో ఇండియా'ప్రోగ్రాం మద్దతు, ప్రోత్సాహం ఇచ్చిందన్నారు. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం' పథకం అథ్లెట్లందరికీ చాలా ముఖ్యమైనదని, ఈ మద్దతు చాలా కష్టపడి పనిచేయడానికి, దేశం కోసం మరిన్ని పతకాలు సాధించడానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెలవారీ రేడియో ప్రసారమైన 'మన్ కీ బాత్' నిరంతర విజయానికి గుర్తుగా బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో 'మన్ కీ బాత్'పై కేంద్రం నిర్వహించిన ఒకరోజు జాతీయ సదస్సును ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ప్రారంభించారు. అనంతరం నారీశక్తిపై జరిగిన సెషన్‌లో తెలంగాణ క్రీడాకారులు నిఖత్ జరీన్, పూర్ణా మలావత్ పాల్గొని మాట్లాడారు. నిఖత్ జరీన్ మాట్లాడుతూ గెలుపోటములను పట్టించుకోకుండా ప్రధాని మోదీ క్రీడాకారులను ప్రేరేపిస్తారని కొనియాడారు.

నాది పేద కుటుంబం.. చిన్న పట్టణం..

13 సంవత్సరాల వయస్సులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పూర్ణా మలావత్ మాట్లాడుతూ 'ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతాన్ని అధిరోహించగలనని నేను ఎప్పుడూ ఊహించలేదు. ఆపై భారత ప్రధానిని కలవడం కూడా పూర్తిగా ఊహించనిది. నేను ఒక చిన్న పట్టణం నుంచి వచ్చాను. ప్రధానిని కలవడం నా జీవితంలో ఒక గొప్ప క్షణం. ప్రధాని చాలా ప్రోత్సహించారు. నా జీవితంలో ఇంత పెద్ద ప్రభావాన్ని చూపినందుకు మోదీజీకి ధన్యవాదాలు. నేను పేద గిరిజన అమ్మాయిని. అవకాశాలు తక్కువ. కానీ ఇప్పుడు నేను ప్రధానిని కలిసిన తర్వాత ప్రజలు నన్ను తెలుసుకున్నారు. నా జీవితంలో భారీ మార్పు వచ్చింది'అని అన్నారు.

డాక్టర్ కూరెళ్లకు ఉపరాష్ట్రపతి ప్రశంసలు

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకిలోని తన ఇంటిని రెండు లక్షల పుస్తకాలతో గ్రంథాలయంగా నిర్వహిస్తున్న దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య.. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ ప్రశంసలు అందుకున్నారు. ప్రసారభారతిలో ప్రధానమంత్రి మన్ కీబాత్ కార్యక్రమం వంద ఎపిసోడ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా కేంద్రప్రసార శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు బుధవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ప్రారంభమయ్యాయి. జగ్‌దీప్ ముఖ్యఅతిథిగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మన్‌కీబాత్ 84వ ఎపిసోడ్‌లో ప్రధాని ప్రశంసలు పొందిన కూరెళ్లను ఈ ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూరెళ్లను ఉపరాష్ట్రపతి అభినందించి గ్రంథాలయం వివరాలను తెలుసుకున్నారు. కూరెళ్ల తాను రాసిన గ్రంథాలను ఉపరాష్ట్రపతికి బహూకరించారు. మన్‌కీబాత్‌లో ప్రశంసలు పొందినవారిని ఈనెల 27న కర్తవ్య భవన్, రాష్ట్రపతి భవన్, ప్రధానమంత్రి సంగ్రహాలయం, 28న ఎర్రకోట, రాజ్‌ఘాట్‌ను సందర్శించనున్నారు.



ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు అభివాదం చేస్తున్న డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

ఏపీభవన్ విభజనపై మరోసారి 'వాయిదా'

- అసంపూర్తిగా కేంద్ర హోంశాఖ సమావేశం
- వారం తర్వాత మరోసారి భేటీ కావాలని నిర్ణయం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఏపీ భవన్, తెలంగాణ భవన్‌ల విభజనపై ఏర్పాటు చేసిన కీలక సమావేశం మరోసారి అసంపూర్తిగా ముగిసింది. బుధవారం కేంద్ర హోంశాఖ పరిధిలోని కేంద్ర రాష్ట్రాల విభాగం జాయింట్ సెక్రటరీ సంజీవ్ కుమార్ జిందాల్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. ఏపీ ఉన్నతాధికారులు ఆదిత్య నాథ్ దాస్, ప్రేమ చంద్రారెడ్డి, రావత్, హిమాన్షు కౌశిక్ పాల్గొన్నారు. తెలంగాణ ఉన్నతాధికారులు రామకృష్ణారావు, గౌరవ్ ఉప్పల్ ఈ భేటీకి హాజరయ్యారు. ఏపీ భవన్ విభజనపై అధికారులు మూడు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, తాజాగా మరికొన్ని ప్రతిపాదనలు తెరపైకి రావడంతో అధికారుల మధ్య ఏకాభిప్రాయం రాలేదని సమాచారం. తొమ్మిదేళ్లుగా ఒకే ప్రాంగణంలో ఏపీ, తెలంగాణ భవన్‌లు కొనసాగుతుండగా, తాత్కాలి కంగా 58:42 నిష్పత్తి పద్ధతిలో గదుల విభజన ద్వారా రెండు భవనాల నిర్వహణ జరుగుతున్న విషయం విదితమే. ఇండియా గేట్ పక్కన 20 ఎకరాల్లో రెండు రాష్ట్రాలకు కలిపి ఉమ్మడిగా రూ.7 వేల కోట్ల ఆస్తి ఉండగా, విభజన చట్టం ప్రకారం ఏపీకి 58 శాతం, తెలంగాణకు 42 శాతం వాటా రావాల్సిన విషయం తెలిసిందే. కాగా బుధవారం జరిగిన సమావేశంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో ఏపీ భవన్ విభజన అంశంపై వచ్చే వారం మరోసారి భేటీ కావాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది.



సమావేశం తర్వాత బయటకు వస్తున్న తెలంగాణ అధికారులు గౌరవ్ ఉప్పల్, రామకృష్ణారావు

మేలో అపెక్స్ కౌన్సిల్ సమావేశం

- సంకేతాలు పంపిన కేంద్ర జలశక్తి శాఖ
- కృష్ణా, గోదావరి బోర్డుల నిర్వహణపై చర్చ
- అనుమతులకు నిరీక్షిస్తున్న తెలంగాణ ప్రాజెక్టులు
- చర్చించి నిర్ణయం తీసుకోనున్న అపెక్స్ కౌన్సిల్

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదాలు, సాగునీటి ప్రాజెక్టులకు అనుమతుల వ్యవహారం, కృష్ణా, గోదావరి బోర్డు భవితవ్యంపై చర్చించేందుకు మే నెలాఖరులోగా అపెక్స్ కమిటీ సమావేశం నిర్వహించడానికి కేంద్ర జలశక్తి శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలకు సంకేతాలు పంపించింది. కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డులకు తెలుగు రాష్ట్రాలు నిధులు ఇవ్వకపోవడంతో వాటి నిర్వహణ కష్టంగా మారింది. గోదావరి బోర్డును మూసివేస్తామని పేర్కొంటూ ఇటీవల బోర్డు అధికారులు కేంద్ర జలశక్తిశాఖకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయించినట్టు తెలిసింది. ప్రాజెక్టుల అప్పగింతపై జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలుపై సైతం ఈ సమావేశంలో చర్చించనున్నారు.

గోదావరి జలాల పంపకాలు జరిగే వరకు ఆ నదిపై తెలంగాణ నిర్మిస్తున్న ఏ ప్రాజెక్టుకూ అనుమతి ఇవ్వరాదని ఇటీవల ఏపీ కేంద్ర జలశక్తిశాఖకు లేఖ రాసింది. అనుమతి లేకుండా నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పనులను నిలుపుదల చేయించాలని కోరింది. ఏపీ, తెలంగాణ మధ్య 50:50 నిష్పత్తిలో కృష్ణా జలాల పంపకాలు జరపాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. కృష్ణా జలాల పంపిణీకి అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద చట్టంలోని సెక్షన్–3 కింద ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరుతోంది. కృష్ణా బోర్డు జరిపిన తాత్కాలిక కేటాయింపులను అంగీకరించమని పలుమార్లు లేఖలు రాసింది. కేంద్ర జలశక్తి శాఖ గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన జరగనున్న అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్ రావు పాల్గొనే అవకాశముంది.

డీపీఆర్‌లకు టీఏసీ అనుమతుల కోసం..

గోదావరిపై తెలంగాణ నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం(ముక్తేశ్వర్), చనాకా కొరాటా, చౌటపల్లి హనుమంతరెడ్డి ప్రాజెక్టుల డీపీఆర్‌లకు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ) అనుమతులు ఇప్పటికే లభించాయి. మొడికుంటవాగు, గూడెం ఎత్తిపోతల పథకాల డీపీఆర్‌లు టీఏసీ అనుమతి కోసం నిరీక్షిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులకు అనుమతులపై అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర జలశక్తి శాఖ ఇటీవల తేల్చిచెప్పింది. కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన కేంద్రం తెలంగాణలోని ప్రాజెక్టుల పట్ల వివక్ష చూపుతోందని తెలంగాణ ప్రభుత్వం ఘాటుగా కేంద్ర జలశక్తిశాఖకు లేఖ రాసింది. ఈ అంశాలపై అపెక్స్ కౌన్సిల్‌లో విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది.

కన్నడనాట బీజేపీ 'తెలుగు' ప్రచారం

3 రోజుల పాటు సంజయ్ ప్రచారం

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు ప్రాబల్య ప్రాంతాల్లో అత్యధిక ఓట్లు రాబట్టేందుకు రాష్ట్ర బీజేపీ నేతలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో గురు, శుక్ర, శని వారాల్లో చిక్ బల్లాపూర, కోలార్ జిల్లాల్లోని నియోజకవర్గాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రచారం నిర్వహించనున్నారు. ఇప్పటికే కర్ణాటక పార్టీ సహ ఇన్‌చార్జిగా జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అక్కడ ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఎంపీ డా.కె.లక్ష్మణ్ బళ్లారి జిల్లాకు ఇన్‌చార్జిగా, రాయచూర్ జిల్లాకు ఇన్‌చార్జిగా జాతీయ కార్యవర్గసభ్యు డు నల్లు ఇంద్రసేనారెడ్డి, బీదర్ జిల్లా ఇన్‌చార్జిగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరివింద్ వ్యవహరిస్తున్నారు. జాతీయ కార్యవర్గసభ్యుడు జి.వివేక్ వెంకటస్వామి ఎన్నికల ప్రచారంలో తలమునకలయ్యా రు. ఇక వచ్చేనెల 8న ఎన్నికల ప్రచార గడువు ముగిసేలోగా కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కూడా ప్రచారాన్ని నిర్వహించే అవకాశాలున్నాయి.

క్లుప్తంగా...

విభజన చట్టం అమలులో కేంద్రం విఫలం: భట్టి



కాజీపేట: తెలంగాణకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం చేసిన విభజనచట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా నిర్వహిస్తున్న పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర బుధవారం హనుమకొండ జిల్లాలో సాగింది. ఉదయం మడికొండలో ప్రారంభమై ధర్మసాగర్ మండలానికి చేరుకుంది. ధర్మసాగర్‌లోని కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపించాలని యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అప్పట్లో నిర్ణయించారన్నారు. రైల్వేవ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 160 ఎకరాలు స్థలం కావాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం 150 ఎకరాల భూమి సేకరించి అప్పగించిందని, మిగిలిన 10 ఎకరాలు ఇవ్వకపోవడంవల్లే ఆ పరిశ్రమ ప్రారంభానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాగన్ తయారీ పరిశ్రమతో పాటు పీఓహెచ్ పనులు ప్రారంభమైతే దాదాపు 8,300 ఉద్యోగాలు ప్రత్యక్షంగా, మరో 40 వేల కుటుంబాలు పరోక్షంగా కాజీపేట పట్టణంలో ఉపాధి పొందుతాయన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. రెండుపార్టీలకు ఏమాత్రం నిరుద్యోగ సమస్యపై చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మిగిలిపోయిన స్థలాన్ని రైల్వేకు అప్పగించి వ్యాగన్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటుండటంతో జీర్ణించుకోలేని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు చేతులు కలిపి బలహీన పర్చాలని చూస్తున్నాయని అన్నారు.

'గాంధీభవన్‌లో ప్రశాంతంగా కూర్చునే పరిస్థితి కరువు'



సాక్షి, హైదరాబాద్: తన మనసులో ఎన్నో ఆవేదనలు మెదులుతున్నాయని, వాటిని చెప్తే ఏమవుతుందో, చెప్పకపోతే ఏమవుతుందో తెలియదు కానీ, తనకు గాంధీభవన్‌లో ప్రశాంతంగా కూర్చునే పరిస్థితి కరువైందని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను గాంధీభవన్‌లో కూర్చుని ఆనందించేవాడిని. అక్కడ కూర్చుని అనేక సమస్యలను మర్చిపోయేవాడిని. కానీ, 5 నెలల నుంచి రాజకీయంగా గాంధీభవన్‌కు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఇది చాలా బాధగా ఉంది. రాహుల్‌గాంధీ త్యాగాల కుటుంబమంటే నాకు చాలా ఇష్టం. ఆ పిచ్చితోనే కాంగ్రెస్‌లోనే ఉంటున్నా. కానీ గాంధీభవన్‌లో ప్రశాంతంగా కూర్చునే పరిస్థితి లేదు'అని బుధవారం మనసులో మాట పేరుతో ఒక ప్రకటన విడుదల చేశారు.

బీఆర్ఎస్ పార్టీకి గార్ల జెడ్పీటీసీ రాజీనామా

ఆమె బాటలో మరో 30 మంది నాయకులు, కార్యకర్తలు

గార్ల: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మహబూబాబాద్ జిల్లా గార్ల జెడ్పీటీసీ సభ్యురాలు జాటోత్ ఝాన్సీలక్ష్మి బుధవారం ప్రకటించారు. ఆమెతోపాటు మరో 30 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గార్లలోని పొంగులేటి, కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బలమైన నాయకుడైన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం లభించలేదన్నారు. ఆయన వెంట తిరుగుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యకు సైతం ప్రభుత్వం భద్రతను తొలగించడం కక్ష పూరిత చర్యగా ఆమె అభివర్ణించారు.

వలసలు ఆగడం లేదు

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



అయిజ: నడగడ్డ ప్రజలు నేటికీ అనేక ప్రాంతాలకు వలస వెళుతూ జీవనం సాగిస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా బుధవారం రాత్రి ఆయన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని ఉప్పల, భూంపురం, ఉత్తనూరు, మూగోనిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు నేటికీ అనేక ప్రాంతాలకు వలస వెళుతున్నారని పేర్కొన్నారు. వలసపోయిన చోట పలువురు కార్మికులు ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నారని విచారం వ్యక్తంచేశారు. కేవలం అలంపూర్ నియోజకవర్గ ప్రజలే ఎందుకు వలస పోవాలని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జి.కృష్ణయ్య బిహార్‌లో కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో దారుణంగా హత్యకు గురైతే.. ప్రస్తుతం ఆ రాష్ట్ర సీఎం నితీష్‌కుమార్ నిబంధనలు మార్చి హత్య చేసిన దోషిని విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్‌ను హత్య చేసిన వ్యక్తిని విడుదల చేయడంపై అన్ని పార్టీల నాయకులు స్పందించినా.. సీఎం కేసీఆర్ స్పందించడం లేదని విమర్శించారు.

సర్వం సిద్ధం..

నేడు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

- మంత్రులు, పార్లమెంటరీ, లెజిస్లేటరీ పార్టీ నేతలకు ఆహ్వానం
- సుమారు 300 మంది ప్రతినిధులకు ఆహ్వానం
- ఉదయం 11 గంటలకు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించనున్న కేసీఆర్
- ప్రవేశపెట్టే రాజకీయ తీర్మానాలపై సర్వత్రా ఆసక్తి



సాక్షి, హైదరాబాద్: ఏడాది చివరలో జరిగే శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏటా పార్టీ ప్రతినిధులతో ప్లీనరీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఈ ఏడాది మాత్రం కేవలం సర్వసభ్య సమావేశానికే పరిమితం కావాలని నిర్ణయించింది. వేసవి తీవ్రత, వరికోతలు, అకాల వర్షాలు తదితరాలను దృష్టిలో పెట్టుకుని పరిమిత సంఖ్యలో ప్రతినిధులతో తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సుమారు 6వేల మంది ప్రతినిధులతో టీఆర్ఎస్... బీఆర్ఎస్‌గా మారిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తొలుత భావించినా సర్వసభ్య సమావేశానికే పరిమితం చేశారు. బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతోపాటు జిల్లా పరిషత్, డీసీసీబీ చైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గంతోపాటు జిల్లా శాఖ అధ్యక్షులు కలుపుకొని మొత్తంగా 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారినా సర్వసభ్య సమావేశానికి మాత్రం రాష్ట్రానికి చెందిన వారినే ఆహ్వానించారు. గురువారం ఉదయం 10 గంటలకల్లా తెలంగాణ భవన్‌కు చేరుకోవాలని వారం క్రితమే ఆహ్వానాలు వెళ్లాయి. ఉదయం 11 గంటలకు కేసీఆర్ పార్టీ పతాకాన్ని ఎగురవేసి సమావేశాన్ని ప్రారంభిస్తారు.

తీర్మానాలపై కసరత్తు

కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సర్వసభ్య సమావేశంలో పలు రాజకీయ తీర్మానాలు ప్రవేశపెట్టి విస్తృతంగా చర్చించి ఆమోదించేలా ఎజెండా రూపొందించారు. ప్రవేశపెట్టే తీర్మానాలపై ఎమ్మెల్సీ, రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి నేతృత్వంలోని బృందం కసరత్తు చేస్తోంది. అయితే ఈ తీర్మానాలపై గురువారం ఉదయానికి స్పష్టత వస్తుందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. రెండు రోజుల క్రితం నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన బీఆర్ఎస్ ప్రతినిధుల సభల్లో ఆరు ప్రధాన అంశాలపై తీర్మానాలు జరిగాయి. వ్యవసాయం, సంక్షేమం, పల్లె ప్రగతి-పట్టణ ప్రగతి, విద్య-ఉపాధి, బీజేపీ వైఫల్యాలు, స్థానిక అంశాలపై తీర్మానాలు చేయగా.. సర్వసభ్య సమావేశంలోనూ ఈ అంశాలకు పెద్దపీట వేసే అవకాశముంది. ఈ ఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో రాజకీయ తీర్మానాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆత్మీయ సమ్మేళనాల ద్వారా ఇప్పటికే ఎన్నికల సన్నద్ధతను ప్రారంభించిన బీఆర్ఎస్ వచ్చే నెల నుంచి విద్యార్థి, యువజన సమ్మేళనాలు కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే అక్టోబర్ 10న వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని బీఆర్ఎస్ ప్రకటించిన నేపథ్యంలో రాబోయే రోజుల్లో నిర్వహించే సభలు, సమావేశాలపై కేసీఆర్ స్పష్టతనిచ్చే అవకాశముంది. 2023 అసెంబ్లీ, 2024 పార్లమెంటు ఎన్నికలు లక్ష్యంగా పార్టీ యంత్రాంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపే రీతిలో కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

తెలంగాణ బిడ్డల ఉద్యోగాల కోసమే..

నిరుద్యోగ దీక్ష: వైఎస్ షర్మిల

ప్రతిపక్షాలు నోరు మూసుకున్నాయి కాబట్టే నేను పోరాటం చేస్తున్నా



దీక్ష చేస్తున్న వైఎస్ షర్మిల

కవాడిగూడ (హైదరాబాద్): నీళ్లు, నిధులు, నియామకాల కోసం 1,200 మంది విద్యార్థులు బలిదానాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే సీఎం గద్దెనెక్కిన కేసీఆర్ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా, వారి ఆత్మహత్యలకు కారణమవుతున్నారని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించా రు. అందుకే తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్నానని అన్నారు. బుధవా రం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద టీ-సేవ్ ఆధ్వర్యంలో షర్మిల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వైఎస్ షర్మిల మాట్లాడుతూ, తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు రావాలని కొట్లాడాలంటే కూడా కోర్టుల నుంచి అనుమతి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నా రు. అయినా దీక్ష అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేసి జైలుకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ అందించిన పాలన రాష్ట్రంలో ఎక్కడా అమలు కావడం లేదని విమర్శించారు. నిరుద్యోగుల ఉద్యోగాల కోసం పోరాటం చేయాల్సిన ప్రతిపక్షాలు నోరు మూసుకుని కూర్చుంటే, తాను వారిపక్షాన నిలబడి కొట్లాడుతున్నానని తెలిపారు. దివంగత సీఎం వైఎస్ఆర్ సతీమణిని అడ్డుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీ-సేవ్ తరఫున కేసీఆర్‌కు పది ప్రశ్నలు పంపుతున్నామని, దమ్ముంటే వాటికి సమాధానం చెప్పాలని షర్మిల సవాల్ విసిరారు. విద్యార్థులు రాజకీయ శక్తిగా ఎదిగి పోరాటాలు చేయాల్సిన అవసరం ఏర్పడిందని గద్దర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వద్ద ఉద్యమం ఉంది తప్ప డబ్బులు లేవని, ఇప్పుడు మాత్రం డబ్బులే మిగిలాయని పేర్కొన్నారు. దీక్షలో ప్రొఫెసర్ కాశీం, వైఎస్ఆర్‌టీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత్ పరివర్తన్ మిషన్‌గా బీఆర్ఎస్

▶ మొదటి పేజీ తరువాయి

పంచగంగ, మంజీర, భీమా లాంటి ఎన్నో నదులు పుడుతున్నాయి. అయినా ఔరంగాబాద్‌లో 8 రోజులకోసారి తాగునీరు అందిస్తున్నారు. అకోలాలోనూ ఇలాంటి పరిస్థితే ఉండాల్సిన అగత్యం ఎందుకు? మహారాష్ట్రలో రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు?.

అవినీతి నేతలే దివాళా తీస్తారు..: తెలంగాణలో అమలవుతున్న ఈ పథకాలు మహారాష్ట్రలో అమలు చేస్తే రాష్ట్రం దివాళా తీస్తుందని పుకార్లు పుట్టిస్తున్నారు. కానీ మేము ఏండ్లుగా అమలు చేస్తున్నా తెలంగాణ ఆర్థికంగా బాగానే ఉంది. మహారాష్ట్ర కంటే చిన్న రాష్ట్రం కావడంతో పాటు ఆర్థికంగా మహారాష్ట్ర తర్వాతే నిలిచే రాష్ట్రమైన తెలంగాణ దివాళా తీయనప్పుడు మహారాష్ట్ర ఎలా దివాళా తీస్తుంది? అవినీతికి పాల్పడే నాయకులే దివాళా తీస్తారు. మహారాష్ట్రలో భూ క్రయవిక్రయాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు తెలిసింది. తెలంగాణలో 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ముగిసేటట్లుగా విధానాలు తీసుకొచ్చాం..'అని తెలిపారు.

ఫడ్నవీస్ నుంచి జవాబు లేదు: 'మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు ఏం పని అని డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ అన్నారు. మహారాష్ట్రలో తెలంగాణ మోడల్ అమలు చేస్తే మధ్యప్రదేశ్‌కు వెళ్లిపోతామని చెబితే ఇప్పటివరకు ఫడ్నవీస్ నుంచి సమాధానం లేదు. తెలంగాణలో సాధ్యమైనవన్నీ మహారాష్ట్రలో ఎందుకు సాధ్యం కావు? అని ప్రజలు ప్రశ్నించుకోవాలి..'అని కేసీఆర్ అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

పెద్ద సంఖ్యలో చేరికలు

బీఆర్ఎస్‌లో చేరిన మహారాష్ట్ర నేతల్లో ఆల్ ఇండియా డీఎస్సీ మహారాష్ట్ర అధ్యక్షుడు, ఓబీసీ వెల్ఫేర్ సంఘ నాయకుడు, ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆనంద్ రావ్ అంగళ్వార్, వంచిత్ ఆఘాడీ ఉమెన్, చంద్రాపూర్ బంజారా ఉమెన్ అధ్యక్షురాలు, ఎమ్మెల్యేగా పోటీచేసిన రేష్మ హాస్ ఉన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొ.బల్బీర్ సింగ్ గురు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ సింగ్ సలూజా, గడ్చిరోలి మాజీ జెడ్పీ చైర్మన్ పసుల సమ్మయ్య, గడ్చిరోలి మాజీ జెడ్పీ సభ్యులు సంజయ్ చర్డుకె, యువ స్వాభిమాన్ పార్టీ రజురా జిల్లా అధ్యక్షుడు సూరజ్ ఠాకరే, చంద్రాపూర్ డీసీసీ అధ్యక్షుడు దిలీప్ పల్లేవార్, బిర్సాముండా క్రాంతిదళ్ అధ్యక్షుడు సంతోష్ కులమతే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంపెల్లి మల్లేష్, ఆప్ బల్లార్పూర్ విభాగ్ అధ్యక్షుడు ప్రశాంత్ గడ్డల, భారత్ ముక్తి మోర్చా వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు శంకర్, యువ స్వాభిమాన్ పార్టీ కార్యదర్శి ఆదిత్య భాకె, శివసేన గడ్చిరోలి జిల్లా అధ్యక్షుడు మిలింద్ భాసర్ బీఆర్ఎస్‌లో చేరారు. చంద్రాపూర్ డీసీసీ మాజీ అధ్యక్షుడు అరికిల్ల హనుమంతు, డబ్ల్యూసీఎల్ ఐటీటీయూసీ అధ్యక్షుడు నర్సింగ్ రాజం దొంత, విదర్భ తెలుగు సమాజ్ ప్రధాన కార్యదర్శి రాజేషం పుల్లూరి, తేలి సమాజ్ జిల్లా అధ్యక్షుడు రవి జుమ్డే, విదర్భ ముక్తి మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తిరమల్ ముంజమ్, శివసేన పార్టీ రాజుర పట్టణ అధ్యక్షుడు రాకేష్ చికుల్వార్, శివసేన బల్లార్షా అధ్యక్షుడు సన్నీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెరెన ఆజ్మీరా, యువ స్వాభిమాన్ గడ్చిరోలి ఉపాధ్యక్షుడు అజయ్ చన్నేతో పాటు మరో నలభై మందికి పైగా నేతలు కూడా బీఆర్ఎస్‌లో చేరారు.

నేడు కాంగ్రెస్ 'సత్యాగ్రహ దీక్ష'

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దుకు నిరసనగా రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో గురువారం సత్యాగ్రహదీక్ష నిర్వహించనున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ గాంధీభవన్‌లో ఉదయం 11 గంటల నుంచి జరగనున్న ఈ దీక్షకు రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జాతీయ అధ్యక్షురాలు మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు హాజరవుతారని పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమళ్ల సిద్దేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని రుజువైంది

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్ఎస్ వేర్వేరు కాదని.. తాము ఎప్పటి నుంచో చెబుతున్న విషయం నిరూపితమౌతోందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. అన్ని రాష్ట్రాల్లో ప్రతిపక్షాలను కలుపుకొని బీజేపీని ఓడించాలంటూ ఈ పార్టీల నేతలు ప్రకటనలివ్వడం దీనికి నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తుండగా, తెలంగాణ కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీఆర్ఎస్‌తో పొత్తుపై తమ అభిప్రాయాలు వెల్లడించారని గుర్తు చేశారు.

టీటీడీపీ ఉపాధ్యక్షురాలిగా నందమూరి సుహాసిని

తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలిగా షకీలారెడ్డి

కొత్త కమిటీల్లో పలువురికి చోటిచ్చిన కాసాని



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా దివంగత హరికృష్ణ కుమార్తె నందమూరి సుహాసినిని నియమించారు. ఈ మేరకు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నందమూరి సుహాసిని 2014 ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అలాగే తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన షకీలా రెడ్డిని నియమించారు. టీటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా సుధాకర్ నాయుడు (కొల్లాపూర్), రాష్ట్ర కార్యదర్శిగా బి.విఠల్ (బాన్సువాడ), బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా కరాటే రమేశ్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మొదటిఏడాదే 2 లక్షల ఉద్యోగాల భర్తీ

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యులైన చైర్మన్, సభ్యులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలన్నారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. 30లక్షలమంది నిరుద్యోగుల ఆశలను అడియాశలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.1లక్షా 60వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. బిశ్వాస్ కమిటీ నివేదిక ప్రకారం తెలంగాణలో 1లక్షా 97వేల 700 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనీ, ఈ లెక్కన బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఉద్యోగాలు భర్తీ చేసిందెక్కడ అని ప్రశ్నించారు. త్వరలో రాష్ట్రా నికి ప్రియాంక రానున్నారని తెలిపారు.

ఎంఐఎం ఎటు పక్షమో తేల్చుకోవాలి..

ముస్లింల 4% రిజర్వేషన్ తొలగించడం నీ జాగీరా అంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రేవంత్ రెడ్డి ధ్వజమె త్తారు. బీఆర్ఎస్ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఆ పార్టీతో దోస్తీ చేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ ఎంఐఎం ఎటు పక్షమో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం ఓట్లతో ప్రయోజనం పొందుతున్న బీఆర్ఎస్ వైపా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, సి.రాంచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి నదీం జావెద్, సిరిసిల్ల రాజయ్య, గడ్డం వినోద్, మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20 వేల చొప్పున ఇవ్వాలి

వడగండ్లతో దెబ్బతిన్న వరిపంటకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని పీసీసీ అధ్యక్షుడురేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మామిడి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలన్నారు. షబ్బీర్ అలీతో కలిసి ఆయన బుధవారం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలోని పొందుర్తి గ్రామ శివారులో వడగండ్ల వానతో దెబ్బతిన్న వరిపంటను, కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో బీఆర్ఎస్ పార్టీ తాగుబోతు సమ్మేళనాలు నిర్వహిస్తోందని విమర్శించారు. రేవంత్ వెంట పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌లున్నారు.

కాంగ్రెస్‌లో 'ఆస్తుల గణన'

- దేశ వ్యాప్తంగా ఉన్న ఆస్తుల వివరాలు సేకరిస్తోన్న ఏఐసీసీ
- గాంధీభవన్ నుంచి జిల్లాల్లో పార్టీ కార్యాలయాల వరకు ట్రస్టుల పేరు మీదనే
- త్వరలోనే రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు దిశగా రేవంత్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తన ఆస్తుల లెక్క తేల్చుకునే పనిలో పడింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఆ పార్టీకి ఉన్న ఆస్తుల వివరాలను సేకరించడంపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణలోనూ ఉన్న ఆస్తుల లెక్క తేల్చేందుకు టీపీసీసీ సిద్ధమవుతోంది. గాంధీభవన్ నుంచి మండల స్థాయిలో లేదా రెవెన్యూ డివిజన్ లేదా జిల్లా స్థాయిలో పార్టీకి కార్యాలయాలున్నాయా? ఆ కార్యాలయాలు ఎవరి పేరిట ఉన్నాయి? ఆ కార్యాలయాల ద్వారా వస్తున్న ఆదాయం సక్రమంగా వినియోగం అవుతుందా? లేదా? అనే వివరాలను సేకరించనున్నారు.

ఎక్కడెక్కడ... ఎవరి చేతుల్లో?

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో, పలు రెవెన్యూ డివిజన్లలో కూడా పార్టీ కార్యాలయాలు సొంతంగా ఉన్నాయి. రాష్ట్ర పార్టీ కార్యాలయమైన గాంధీ భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే నిర్మించినప్పటికీ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలో ఓ ట్రస్టును ఏర్పాటు చేసి యాజమాన్య హక్కులు ఆ ట్రస్టుకు దఖలు పరిచారు. గాంధీభవన్‌ను వినియోగించుకున్నందుకు గాను ఈ ట్రస్టుకు నెలకు నామమాత్రపు అద్దెను కూడా పార్టీ చెల్లిస్తోంది. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల్లో ఉన్న కార్యాలయాలు పలువురు వ్యక్తులు, ట్రస్టుల పేరిట ఉన్నాయి. ఖమ్మం, కరీంనగర్ పార్టీ కార్యాలయాల విషయంలో ఏ ఇబ్బంది లేనప్పటికీ వరంగల్ జిల్లాలోని పార్టీ కార్యాలయాన్ని ఇతర వ్యక్తులు ట్రస్టీల రూపంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయం నుంచి వచ్చే ఆదాయం వారే తీసుకుంటున్నారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. భద్రాచలంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఓ వ్యక్తి కంప్యూటర్ సెంటర్ పెట్టి సొంతానికి వినియోగించుకుంటున్నారని తెలుస్తోంది.

దిగ్విజయ్ నేతృత్వంలో...

సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆస్తుల వివరాల సేకరణ కోసం కసరత్తు జరుగుతోంది. రాష్ట్రంలోని పార్టీ ఆస్తుల వివరాలను సేకరించేందుకు గాను ఏఐసీసీ నుంచి కుంభల్కర్‌ను ఇన్‌చార్జిగా నియమించగా, త్వరలోనే టీపీసీసీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ కమిటీని ప్రకటించనున్నారు. కమిటీ ప్రకటన అనంతరం జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి ఏ జిల్లాలో ఏయే ఆస్తులు న్నాయి? ఆయా ఆస్తుల ద్వారా ఏమైనా ఆదాయం వస్తోందా? వస్తున్న ఆదాయం రాష్ట్ర పార్టీకి, జాతీయ పార్టీకి అందుతోందా? ఒకవేళ అందకపోతే కారణాలేంటి? ఆస్తుల రక్షణ విషయంలో ఏమైనా సమస్యలున్నాయా? అనే అంశాలపై నిర్ణయం తీసుకోనున్నట్టు టీపీసీసీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు.

'కోఠి'ఆఫీసు పరిహారం ఎవరికెళ్లిందో?

హైదరాబాద్ నగర కమిటీకి కోఠిలో ఓ కార్యాలయం ఉండేది. మెట్రో రైల్ నిర్మాణంలో భాగంగా ఆ కార్యాలయం కోల్పోవాల్సి వచ్చింది. ఇందుకు గాను ప్రభుత్వం నుంచి వచ్చిన పరిహారం ఎవరు తీసుకున్నారన్న దానిపై కూడా ఆరోపణలున్నాయి. గాంధీభవన్ స్థానంలో పక్కనే ఉన్న భీంరావ్‌వాడలో ఇందిరాభవన్‌ను నిర్మించాలని మహానేత డాక్టర్ వైఎస్సార్ సీఎంగా ఉన్న ప్పుడు స్థలం కేటాయించారు. ఇందుకు గానూ హౌసింగ్‌బోర్డుకు రుసుము చెల్లించారు. కానీ, ఆ తర్వాత అక్కడ భవనాన్ని నిర్మించే పరిస్థితి లేకపోవడంతో ఆ స్థలం కూడా పెండింగ్‌లో పడిపోయింది. ఆస్తుల లెక్కలు తేల్చడం ద్వారా ట్రస్టీల అధికారాలను పార్టీ తీసుకోవడంతో పాటు ఆస్తుల విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో వివరాలు సేకరిస్తున్నట్టు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.



ఏకాంతం మంచిదే. కానీ ఆ ఏకాంతం మంచిదని
చెప్పడానికి నీకు ఒకరుండాలి.

– హూనొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 27 ఏప్రిల్ 2023

న్యాయం కావాలి!

చట్టం ముందు అందరూ సమానులే అంటాం. కానీ, డబ్బు, పలుకుబడి ఉన్న వ్యక్తులు కొంచెం ఎక్కువ సమానమని పదేపదే రుజువవుతుంటే ఏమనాలి? వ్యవస్థపై ఇక నమ్మకమేం మిగుల్తుంది? లైంగిక వేధింపులకూ, బెదిరింపులకూ పాల్పడ్డాడంటూ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడూ, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై మహిళా రెజ్లర్లు నెలలుగా మొత్తుకుంటున్నా క్రీడాశాఖకూ, పాలకులకూ పట్టనితనం చూస్తే ఇలాంటి ప్రశ్నలెన్నో వస్తాయి. అంతర్జాతీయ పతకాలు తెచ్చిన ఆడపిల్లలు తమ గోడు వెళ్ళబోసుకుంటూ, బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవాలంటూ జనవరిలో వీధికెక్కిన దృశ్యాలు దేశమంతా చూసినవే. మూడు నెలలు గడిచినా అతీగతీ లేక చివరకు మళ్ళీ ఆ అగ్రశ్రేణి మహిళా మల్లయోధులు మరోసారి నిరసనకు దిగాల్సి రావడం శోచనీయం. తాజాగా ఏప్రిల్ 21న పోలీసులకు ఫిర్యాదు చేసినా, కనీసం ఎఫ్ఐఆర్ కూడా దాఖలు కాని పరిస్థితుల్లో అసహాయులైన అమ్మాయిలు ఆఖరికి దేశ సర్వోన్నత న్యాయస్థానం తలుపులు తట్టాల్సి రావడం మనం ఏ కాలంలో, ఎలాంటి రాజకీయ వ్యవస్థలో ఉన్నామో నగ్నంగా నిరూపిస్తున్నాయి.

అన్నిటికీ అత్యుత్సాహంతో కేసులు కట్టే పోలీసులు తాజా ఫిర్యాదు తర్వాత 5 రోజులైనా ఎఫ్ఐఆర్ దాఖలు చేయలేదు. ఆదివారం నుంచి 4 రోజులుగా జంతర్ మంతర్ వద్ద రెండోసారి నిరసన దీక్ష కొనసాగిస్తున్నా బాధిత మహిళా రెజ్లర్లను సంబంధిత అధికారులెవరూ పలకరించనైనా లేదు. మహిళా సంక్షేమం కోసమే ఉన్నామని చెప్పుకొనే జాతీయ మహిళా కమిషన్ సైతం అయిపూ అజా లేదు. ఇక దేశంలో సగటు స్త్రీకి మనం ఏం భరోసా కల్పిస్తున్నట్టు? అసలైతే మహిళలెవరైనా లైంగిక వేధింపుల ఫిర్యాదు చేస్తే – తక్షణమే కేసు పెట్టి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చట్టం. ఢిల్లీ పోలీసులు మాత్రం ఏడుగురు మహిళలు లిఖిత పూర్వక ఫిర్యాదులిచ్చినా ప్రాథమిక విచారణ చేశాక ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని మీనమేషాలు లెక్కిస్తుండడం దారుణం. 'పోక్సో' చట్టం సైతం వర్తించే మైనర్ బాలికపై వేధింపుల తీవ్రాతితీవ్ర అంశమున్నా, సోకాల్డ్ విచారణేదో ఇన్నిరోజులుగా పూర్తి కాకపోవడం మరీ విడ్డూరం. పైపెచ్చు, లైంగిక బాధితులమంటూ ఫిర్యాదు చేసిన స్త్రీల పేర్లను పోలీసులే లీకు చేయడం ఘోరం, నేరం. నిందితుడు అధికార పార్టీకీ, అందునా సీట్లు, ఓట్లలో కీలక యూపీకీ చెందిన వ్యక్తి గనక చట్టాలన్నీ చుట్టాలయ్యాయంటే తప్పు పట్టగలమా?

జనవరిలో బాధితులు నిరసన దీక్షకు దిగినప్పుడే ఈ కేసును నిర్వీర్యం చేసేందుకు శతవిధాల ప్రయత్నాలు జరిగాయి. వినేశ్ ఫోగట్, సాక్షీ మలిక్ లాంటి తోటి క్రీడాకారిణులకు టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత భజరంగ్ పునియా లాంటి పురుషులూ తోడుగా నిలిచి, విషయం మీడియాలో పెద్దదయ్యే సరికి తప్పక క్రీడాశాఖ రంగంలోకి దిగింది. నిందితుడైన బీజేపీ ఎంపీని తాత్కాలికంగా సమాఖ్యకు దూరం జరిపింది. విచారణకు కంటితుడుపు కమిటీ వేసింది. బాక్సర్ మేరీ కోమ్ సారథ్యంలో ఆరుగురు సభ్యుల కమిటీ 4 వారాల్లో నివేదిక ఇవ్వాలి. ఇప్పటికి 3 నెలలైనా ఆ కమిటీ, దాని నివేదిక అతీగతీ దేవరహస్యమే. నివేదికను బయటపెట్టాలనీ, నిందితుణ్ణి అరెస్ట్ చేయాలనీ కోరుతూ రెజ్లర్లు ఇప్పుడు ఢిల్లీ నడిబొడ్డున, నేపథ్యంలో హనుమాన్ చాలీసా వినిపిస్తూ, దీక్షకు కూర్చున్నారు. రోడ్ల మీదే రెజ్లింగ్ సాధన చేస్తున్నారు. పతకాలు తెచ్చినప్పుడల్లా వారితో ఫోటోలకు పోజులిచ్చి, న్యాయం కోసం రోడ్డెక్కినప్పుడు మౌనం పాటిస్తున్న కమలనాథులకు మాత్రం కనికరం కలగట్లేదు.

భారత ఒలింపిక్ అసోసియేషన్ పక్షాన మరో కమిటీ వేస్తున్నట్టు క్రీడా శాఖ ప్రకటించింది కానీ, మరోసారి కమిటీల పేర మోసపోవడానికి రెజ్లర్లు సిద్ధంగా లేరు. బాధిత మహిళలతో పాటు పౌర సమాజం డిమాండ్ చేస్తున్నట్టు... ఆరుసార్లు ఎంపీ, ఒకప్పుడు తీవ్రవాద కేసులో నిందితుడూ, స్థానిక డాన్‌గా అపరిమిత పలుకుబడి గల వ్యక్తి అయిన బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలి. ఎఫ్ఐఆర్ దాఖలుకు నిరాకరించిన పోలీసులపై కేసు నమోదు చేయాలి. పతకాలు పండిస్తున్న భారత రెజ్లింగ్ ఇప్పటికే ఈ వివాదాలతో కుదేలైంది. నిరసనగా గత నెల అంతర్జాతీయ శిక్షణ శిబిరాల నుంచి పునియా, ఫోగట్ పక్కకు తప్పుకున్నారు. వచ్చే ఏటి ప్యారిస్ ఒలింపిక్స్‌లో విజయాలకూ ఇది గండి కొట్టే ప్రమాదం ఉంది. సుప్రీంలో కేసు ఈ 28న తదుపరి విచారణకు రానున్న నేపథ్యంలో ఇప్పటికే పరువు పోయిన క్రీడాశాఖ కళ్ళకూ, చెవులకూ గంతలు తొలగించుకోవాలి.

నిజానికి, మన క్రీడా వ్యవస్థ అనేక లోపాల పుట్ట. క్రీడాసంస్థలు కొందరి జేబుసంస్థలుగా కొనసాగడం, రాజకీయ ప్రాబల్యానికి అడ్డా కావడం దశాబ్దాలుగా ఉన్నదే. కోరింది ఇస్తేనే ఆటలో అవకాశాలొస్తాయనే వాతావరణం కల్పించడం, అర్హుల కన్నా అయినవాళ్ళను అందలం ఎక్కించడం పదే పదే చూస్తున్నదే. అందుకే, అప్రతిష్ఠ మూటగట్టుకున్న రెజ్లింగ్ సమాఖ్య, దాన్ని సొంత జాగీరులా నడుపుతున్న బ్రిజ్‌భూషణ్‌ల వ్యవహారం ఆశ్చర్యం కాకపోవచ్చు కానీ, ఇన్ని ఆరోపణల తర్వాతైనా కళ్ళు తెరిచి, చర్యలు తీసుకోవాల్సిన అంశం. కేసు ఇప్పుడు సుప్రీం దాకా వచ్చింది గనక బాధితులకు న్యాయం జరగవచ్చు. కానీ దేశప్రతిష్ఠను పెంచిన క్రీడాకారులు, అందులోనూ ఆడపిల్లలు ఆరోపణలు చేస్తుంటే అధికార, పాలనా వ్యవస్థలు సరిగ్గా స్పందించకపోవడమే దుర్మార్గం. ఇకనైనా స్వపర భేదాలు వదిలి, క్రీడా వ్యవస్థలను సమూలంగా ప్రక్షాళించాలి. బ్రిజ్ భూషణ్ కథ అందుకు నాంది కావాలి. సాధారణ న్యాయం సైతం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తేనే సాధ్యమన్న సంకేతాలు ప్రజల్లోకి వెళితే, అది పాలకులకు కాదు... మొత్తం వ్యవస్థకే తలవంపులు.

మనం చూసిన సాంకేతిక విప్లవం

సందర్భం



దినేష్ సి. శర్మ

ప్రపంచంలో మొబైల్ ఫోన్లు మొదలై యాభై ఏళ్లయ్యింది. అవి ఇండియాలోకి ప్రవేశించి నలభై ఏళ్లయ్యింది. అప్పట్లో ఆ ఫోన్లు అడుగు పరిమాణంలో ఉండేవి. వాటితో కేవలం మాట్లాడగలం. మెసేజులు, ఫొటోలు పంపలేము. 1990లలో ఇండియాలో మొబైల్ సేవలు ఊపందుకున్నాయి. అప్పుడు కూడా 'టాక్ టైమ్' ఖరీదైన వ్యవహారం. కానీ తర్వాతి రెండు దశాబ్దాల్లో అనేక మలుపులు తిరిగాయి. పాలసీ మార్పులు, ప్రీ–పెయిడ్ సర్వీస్, ఛోటా రీచార్జ్, సర్వీస్ నెట్‌వర్క్‌ల విస్తరణ, స్థానిక తయారీ వంటివన్నీ కలిసి మొబైల్ ఫోన్ సేవలను సరసమైన ధరలకే అందుబాటులోకి తెచ్చాయి. ఆధునిక మానవ చరిత్రలో అనేకమంది ప్రజల జీవితాలను స్పృశించిన అతి గొప్ప సాంకేతిక సాధనం మొబైల్ ఫోన్!

ఆధునిక మానవ చరిత్రలో అనేకమంది ప్రజల జీవితాలను స్పృశించిన అతి గొప్ప సాంకేతిక సాధనం మొబైల్ ఫోన్. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన పలు దశాబ్దాల తర్వాత సగటు కుటుంబాలకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతలు సైకిల్, చేతి గడియారం, లేదా ట్రాన్సిస్టర్ రేడియో మాత్రమే. 1960లు, 1970లలో నాలాగా భారత్‌లో పుట్టి పెరిగినవారు అప్పట్లో ఫోన్ కలిగి ఉండటం ఒక విలాసంగా ఉండేదని మీకు చెబుతారు. టెలిఫోన్ కనెక్షన్ కోసం వేచి ఉండే సమయం అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉండేది. ఫోన్ ఉన్న కుటుంబాలకు ఇరుగుపొరుగు వద్ద చాలా డిమాండ్ ఉండేది. తమ సంబంధీకుల కాల్స్ అందుకోవడానికి వారు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకునేవారు. వారు ఆ నంబర్‌ను పీపీ (ప్రైవేట్ పార్టీ) అని పంచుకునేవారు. అనధికారికంగా తమ ఫోన్లను ఇతరులు వాడకుండా యజమానులు వాటిని లాక్ చేసేవారు. (ఇప్పుడు స్మార్ట్ ఫోన్లకు స్క్రీన్ లాక్ లాగా అప్పుడు ఫోన్ డయలర్‌ని లాక్ చేసేవారు.)

నా తరం వారు నిజంగానే తమ జీవితకాలంలో లాండ్‌లైన్ ఫోన్ల నుంచి సర్వవ్యాపి అయిన స్మార్ట్ ఫోన్ల వరకు సంభవించిన సాంకేతిక విప్లవానికి సాక్షీభూతులయ్యారు. మొబైల్ ఫోన్‌ను 50 సంవత్సరాల క్రితమే ఆవిష్కరించారు. న్యూయార్క్‌లోని దాని ఆవిష్కర్త మార్టిన్ కూపర్ ప్రపంచంలోనే మొట్టమొదటి మొబైల్ కాల్‌ను 1973 ఏప్రిల్ 3న చేశారు. పాశ్చాత్య ప్రపంచంలో కూడా మొబైల్ ఫోన్



వినియోగదారీ వస్తువుగా మారటానికి దాదాపు రెండు దశాబ్దాలు పట్టింది.

లాండ్‌లైన్ లాగే, మొబైల్ ఫోన్ కూడా ప్రారంభంలో విలాసంగానే ఉండేది. 1980లలో దాని ధర అమెరికాలో 4,000 డాలర్లు. వాటి పరిమాణం పెద్దదిగా ఒక అడుగు ఉండేది. దాన్ని 'ఇటుక ఫోన్' అనేవారు. 1990ల మధ్యలో నేను ఉపయోగించిన తొలి మొబైల్ ఇటుక సైజు కంటే కాస్త చిన్నదిగా ఉండేది. అప్పటికీ అది ఏ జేబులోనూ పట్టేది కాదు. ధర సుమారు యాభై వేలు. నేను పని చేస్తుండిన టెలివిజన్ ప్రొడక్షన్ కంపెనీ, ఫీల్డ్ అసైన్‌మెంట్ల కోసం వెళ్లే విలేఖరుల కోసం కొన్ని హ్యాండ్ సెట్లను అద్దెకు తీసుకుంది. అవి ఒక డయలింగ్ ప్యాడ్‌తో కూడిన భారీ పరికరం, పొడుచుకువచ్చిన యాంటెన్నా, మందమైన రింగ్‌టోన్‌తో ఉండేవి. గుర్తుంచుకోండి, దాంతో కేవలం మాట్లాడగలరు. మెసేజ్ చేయలేరు, ఫొటోలు పంపలేరు.

మొబైల్ టెలిఫోన్ యుగంలోకి భారత్ 1987 జనవరి 1న ప్రవేశించిందని కొద్దిమందికే తెలుసు. మహానగర్ టెలిఫోన్ నిగమ్ తన 'మొబైల్ రేడియో ఫోన్ సర్వీస్'ను ఢిల్లీలో ప్రారంభించడం ద్వారా ఇది మొదలైంది. అది కారులో అమర్చిన ఫోన్ యూనిట్‌ని ఉపయోగించి ప్రయాణిస్తున్నప్పుడు మాట్లాడటానికి వీలయ్యే ఒక ప్రాథమికమైన కార్ ఫోన్ సర్వీస్. కొన్ని డజన్ల ఫోన్లను మాత్రమే అప్పట్లో వ్యవస్థాపించారు.

1992లో దేశంలోని నాలుగు మెట్రో నగరాల్లో సెల్యులార్ టెలిఫోన్ సేవలను అందించడానికి ప్రైవేట్ కంపెనీలకు లైసెన్స్ ఇచ్చారు. మొట్టమొదటి వాణిజ్యపరమైన సెల్యులార్ మొబైల్ కాల్‌ను 1995 జూలై 31న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు కలకత్తా నుంచి న్యూఢిల్లీలో ఉన్న సమాచార మంత్రి సుఖ్‌రామ్‌కు చేశారు. కలకత్తాలో మొబైల్ కాల్ సర్వీస్‌ను మోడీ–టెల్‌స్ట్రా (బీకే మోడీ గ్రూప్, ఆస్ట్రేలియాకు చెందిన టెల్‌స్ట్రా జాయింట్ వెంచర్) అందించాయి. కొన్ని నెలల తర్వాత ఢిల్లీలో 'భారతి' సెల్యులార్ సేవలు ఆరంభించింది.

ఆ రోజుల్లో మొబైల్ ఫోన్‌లో మాట్లాడటం ఖరీదైన వ్యవహారంగా ఉండేది – ఒక కాల్ చేయాలంటే నిమిషానికి రూ. 16.80, కాల్ రిసీవ్ చేసుకోవాలంటే రూ. 8.40 చెల్లించాల్సి వచ్చేది. ఫస్ట్ జనరేషన్ (1జి) డేటా టెక్నాలజీ అయిన జనరల్ పాకెట్ రేడియో సర్వీస్ (జీఆర్‌పీఎస్) అందించడానికి ఫోన్ కంపెనీలకు మరి కొన్నేళ్లు పట్టింది.

తర్వాతి రెండు దశాబ్దాల్లో అనేక మలుపులు తిరిగాయి. పాలసీ మార్పులు, ప్రీ–పెయిడ్ సర్వీస్, ఛోటా రీఛార్జ్, కొత్త ప్రాసెసింగ్ టెక్నాలజీలు, దూకుడైన రోలవుట్ ప్లాన్స్, సర్వీస్ నెట్‌వర్క్‌ల విస్తరణ, లోకల్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటివన్నీ కలిసి భారతీయులకు మొబైల్ ఫోన్లను సరసమైన ధరలకే అందుబాటులోకి తెచ్చాయి. అధిక కాల్ ఛార్జీలు పాతకథ అయిపోయాయి. జీఆర్‌పీఎస్ నుంచి, సూపర్ ఫాస్ట్ డేటా స్పీడ్ వరకు పయనించాం. మొబైల్ ఫోన్లు అంటే గతంలోలా ఎమర్జెన్సీ కాల్స్ చేసుకోవడానికి మాత్రమే కాదు, వినోదం నుంచి బ్యాంకింగ్ వరకు ప్రతి అవసరానికీ ఉపయోగపడుతున్నాయి. పిల్లలుగా ఉన్నప్పుడు, ల్యాండ్ లైన్ ఫోన్‌లో మనం సమాధానం ఇస్తుండగా మనకు కాల్ చేస్తున్న వ్యక్తి చిత్రాన్ని చూడటం సరదాగా ఉంటుందని జోక్ చేయడం నాకు గుర్తుంది. వీడియో కాల్స్ నిజంగానే ఇప్పుడు చిన్నపిల్లలాట అయిపోయింది!

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

భారతీయ సెల్‌ఫోన్ విప్లవంలో మలుపులు

టాక్ టైమ్‌కు ఎక్కువ ఖర్చు అవుతుండటం మొబైల్ ఫోన్లను సృజనాత్మకంగా ఉపయోగించడానికి దారితీసింది. సాధారణంగా, మీరు ఒక నంబరుకు కాల్ చేస్తున్నప్పుడు, ఆ వ్యక్తి కాల్ తీసుకోలేనప్పుడు దాన్ని మిస్డ్ కాల్ అంటారు. టాక్ టైమ్ ఆదా చేయడానికి, జనం మిస్డ్ కాల్స్ చేయడం ప్రారంభించారు. ఉద్దేశపూర్వకంగా 'కాల్ మి బ్యాక్', 'నేను చేరుకున్నాను' వంటి ముందస్తుగా నిర్దేశించిన సందేశాలను తెలియచేయడానికి మిస్డ్ కాల్స్ ఇస్తుంటారు. యజమానులకూ, డ్రైవర్లు, ఇంటి పనిమనుషులు వంటి పరిమితమైన టాక్ టైమ్ ఉన్న వారికీ మధ్య సమాచారానికి ఇది అనుకూలమైన సాధనం. కంపెనీలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ విభాగాలు తరచుగా వాడే మార్కెటింగ్ సాధనమే మిస్డ్ కాల్.

సామాన్య ప్రజలకు మొబైల్ ఫోన్‌ని రోజువారీ సాధనంగా చేసే ప్రయాణంలో ప్రీ–పెయిడ్ సర్వీస్ ఒక కీలక మలుపు. నెల చివరలో బిల్‌ని చెల్లించడానికి బదులుగా వినియోగదారులు టాక్ టైమ్‌ని కొని, దాన్ని నిర్దిష్ట కాలంలో తమ అవసరాల కోసం ఉపయోగిస్తారు. మరొక వినూత్న ఆవిష్కరణ 'ఛోటా రీఛార్జ్' లేదా మైక్రో రీఛార్జ్ కూపన్లు. నెలకు 200 లేదా 300 రీఛార్జ్‌కి బదులుగా కేవలం ఐదు రూపాయలకే చోటా రీఛార్జ్ చేసుకోవచ్చు. ఇది కూరగాయల వ్యాపారి, వ్యవసాయ కూలీ వంటివారికి కూడా మొబైల్ సేవలను సరసమైన ధరకు అందించే గేమ్ ఛేంజర్ అయ్యింది.

ఎఫ్ఎమ్‌సీజీ సిమ్ కార్డులు, రీఛార్జ్ సేవల రూపంలో ఫోన్ సర్వీస్‌ని స్థానిక పచారీ కొట్లు, ఫార్మసీలు, పాన్ షాపుల్లో విస్తృతంగా అందుబాటులో ఉంచడం జరిగింది. టెలికామ్ సంస్థల కోసం 'పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్' లాగా సేవ చేయడమే కాకుండా, ఈ ఫ్రాంచైజీలు కంపెనీ స్టోర్లలోని కస్టమర్ రిలేషన్స్ ఉద్యోగుల లాగా చందాదారుల సమస్యలను లాంఛనప్రాయంగా పరిష్కరిస్తాయి. ఫోన్లు, వాటి సేవలు వేగంగా అమ్ముడయ్యే వినియోగ సరుకులు (ఎఫ్ఎమ్‌సీజీ)గా మారిపోయాయి.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మనవే నయం



కెనడీ విమానాశ్రయం (అమెరికా)లో ఇమ్మిగ్రేషన్ క్లియరింగ్ కోసం 3 గంటలు గడిపాను. అదీ విమానంలో 16 గంటల ప్రయాణం తర్వాత. వీటితో పోల్చితే భారతీయ విమానాశ్రయాలు అత్యాధునికంగా ఉన్నాయి. అమెరికాకు వచ్చేప్పుడు ప్రవేశం నుంచి నిష్క్రమణ గేటుకి అరగంటలోపే పట్టింది.

– బర్ఖా దత్, జర్నలిస్ట్

పిరికి చర్య



ఛత్తీస్‌గఢ్, దంతెవాడలో చాలా మంది పోలీసుల మరణానికి కారణమైన నక్సలైట్ల పిరికి ఐఈడీ పేల్చివేత చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. తమ జీవితాలను త్యాగం చేసిన ధైర్యశాలురకు సెల్యూట్!

– నవీన్ పట్నాయక్, ఒడిషా ముఖ్యమంత్రి

శుభాకాంక్షలు



ఇజ్రాయిల్ ప్రజలకు, కెనడా వ్యాప్తంగా ఉన్న యూదు సమాజానికి, ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయిల్ దేశ స్థాపన 75వ వార్షికోత్సవం జరుపుకొంటున్న వారికి: హేపీ ఇండిపెండెన్స్ డే!

– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

ఇదా పద్ధతి?



నిరసనలో ఉన్న భారత రెజ్లర్లు జంతర్ మంతర్ దగ్గర వ్యాయామం చేస్తున్నారు. తన క్రీడాకారులను వీధులకెక్కేలా చేసేది ఎప్పటికీ మేటి ఒలింపిక్ దేశం కాలేదు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

మూల కారణం



విద్యావంతురాలైన అఫ్గాన్ మహిళ తాలిబన్ సేనను పెంచదు. తాలిబన్ స్త్రీద్వేషికి భార్యగా ఉండదు. తనను కేవలం ఒక వస్తువుతో సమానంగా చూసే తాలిబన్ల పితృస్వామిక ఇస్లామీయ వ్యాఖ్యానాన్ని అంగీకరించదు. ఇంట్లోనే తాలిబన్లకు నిరోధకమవుతుంది. అందుకే స్త్రీల విద్యను తాలిబన్లు నిషేధించారు.

– అమ్రుల్లా సలేహ్, అఫ్గాన్ మాజీ ఆపద్ధర్మ అధ్యక్షుడు

పశువైద్యం కత్తి మీద సాము!

సందర్భం



డా॥ మల్లంపల్లి సాయి బుచ్చారావు

ప్రపంచంలోని అన్ని దేశాల సంస్కృతుల్లోనేకాక, ఆర్థిక వ్యవస్థల్లోనూ పశు సంపద కీలక పాత్ర వహిస్తుంది. పశు సంపద ద్వారా ఆర్థికాభివృద్ధి, సమాజ ఆరోగ్యం, ఆహార భద్రత, జీవనోపాధి కలుగుతున్నాయి. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) 2009 అంచనాల ప్రకారం ప్రపంచ జనాభాకు 15 శాతం శక్తి నిచ్చే పోషకాలు, 25 మాంసకృత్తులు పశు సంపద ద్వారా లభిస్తున్నాయి. మారుతున్న జీవనశైలి, వాతావరణ మార్పుల్లో ప్రపంచ ఆహార భద్రతకు పశు సంపద మాత్రమే ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది. ప్రపంచంలో 60–65 శాతం వ్యవసాయం పశువుల శక్తితోనే చేస్తున్నారు. ఇదే సమయములో పశువుల వలన మీథేన్ విడుదల ద్వారా ప్రపంచ ఉష్ణోగ్రత (గ్లోబల్ వార్మింగ్) 14 శాతం పెరుగుతోందనీ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పశు వైద్య రంగానికి ఇదొక సవాల్. పశు వైద్య రంగం... పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి, అభివృద్ధి మాత్రమే కాకుండా అవి విడుదల చేసే మీథేన్, వాటి ద్వారా సంక్రమించే సంక్రమిత వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా ఎప్పటికప్పుడు నవీనీకరణ చెందాలి.

1990 మధ్య కాలంలో మానవ, పశు ఆరోగ్యాలు, పర్యావరణం వంటి బహుముఖ పరిస్థితులను అధ్యయనం చేసే శాస్త్రం ఆవిర్భవించింది. దీనిని 'కన్సర్వేషన్ మెడిసిన్' లేదా 'ఎన్విరాన్మెంటల్ మెడిసిన్' అంటారు. పర్యావరణ మార్పుల వలన పశువులు, మనుషుల్లో కలిగే వ్యాధులు గురించి సరైన అధ్యయనాలు లేవు. ఫలితంగా కరోనా లాంటి మహమ్మారి ప్రపంచాన్ని గడగడ లాడించింది.

పశు వైద్య రంగం... మానవ సంస్కృతి, ఆరోగ్యం, ఆనందం, అభివృద్ధిల్లో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కీలక పాత్ర వహిస్తుంది. వైద్యంలో విచక్షణను అనుసరించకపోతే అది పశువులకే కాదు వాటిని ఆధారం చేసుకున్న మానవులకూ, అవి జీవిస్తున్న పరిసరాలకూ ముప్పు సంభవిస్తుంది. ఉదాహరణకు పశువులలో నొప్పులను నివారించటానికి 'డైక్లో ఫెనాక్ సోడియం' అనే ఇంజెక్షన్స్ వాడుతారు. ఒక వేళ ఇంజక్షన్ చేసిన పశువు మరణిస్తే ఆ కళేబరాన్ని తిన్న రాబందులు 'గౌట్' వచ్చి మరణిస్తాయి. రాబందులు మృత కళేబరాలను ఇతర వ్యర్థ పదార్థాలను తినటం ద్వారా ప్రకృతిని శుభ్రంగా ఉంచటంతో పాటు అంటు వ్యాధులు ప్రబలకుండా కాపాడుతున్నాయి.

మరొక ఉదాహరణ, ఆహారంగా తీసుకునే పశుపక్ష్యాదులకు వైద్యం చేయడం. ఇది కత్తి మీద సాము లాంటిది. పాలు ఇచ్చే పశువులకు 'ఆక్సీ టెట్రా సైక్లిన్' లాంటి ఏంటీబయోటిక్స్ ఇవ్వడం వలన వాటి అవశేషాలు పాలలో 21 రోజులు కనిపిస్తాయి. ఇండియా లాంటి దేశాలలో ఆ పాలను పారబోసే పరిస్థితులు లేవు. ఒక పక్క పశువు ఆరోగ్యం కాపాడాలి... మరోపక్క వాడిన మందుల అవశేషాల వలన మనుష్యులలో ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా చూడాలి. ఇది పశు వైద్యుని నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది.



ఇంత ప్రాముఖ్యత ఉన్న పశు వైద్య రంగం గుర్తింపు కోసం ప్రతి ఏడాది ఏప్రిల్ నెలలో నాల్గవ శనివారం ఒక థీమ్‌తో అంతర్జాతీయ పశు వైద్య దినోత్సవం జరుపుతారు. పశు వైద్యవృత్తిలో వైవిధ్యం, ఈక్విటీ సమగ్రతను ప్రోత్సహించడం ఈ ఏడాది థీమ్.

వ్యాసకర్త అసిస్టెంట్ డైరెక్టర్ (ఏహెచ్);
ఏవీహెచ్ జీలుగుమిల్లి, ఏలూరు జిల్లా
(ఏప్రిల్ 29న ప్రపంచ పశువైద్య దినోత్సవం)

ప్రజా పాలనా వ్యవస్థలో మైలురాయి

సందర్భం



డా॥ సత్తు లింగమూర్తి

స్వాతంత్ర్యానంతరం ఇన్నేళ్ల కాలంలో న్యూ ఢిల్లీనీ, పీఎంఓనూ ప్రజలకు దగ్గర చేసిన వారు ప్రధాని నరేంద్ర మోదీ. 2014లో మోదీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన తర్వాత పాలనా వ్యవస్థను ప్రజల మధ్యకు నేరుగా తీసుకురావడానికి 'మన్ కీ బాత్' ప్రారంభించారు. ఏప్రిల్ 30న ఈ కార్యక్రమం 100వ ఎపిసోడ్ పూర్తి చేసుకోబోతోంది. ఇది మోదీ సుపరిపాలన వ్యవస్థ అభివృద్ధి క్రమంలో ఒక సువర్ణాధ్యాయాన్ని సృష్టించిన కార్యక్రమం అనడంలో అతిశయోక్తి లేదు. ఈ కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి ప్రజలతో నేరుగా సంబంధాలను ఏర్పరుచుకోవడమే కాకుండా వారిలో ఒకరిగా కలిసిపోయారు. అందరికీ అందుబాటులో ఉండే 'రేడియో'ను దీని ప్రసారానికి ఎంచుకోవడం వల్ల ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లింది. 'మన్ కీ బాత్' భారతీయుల మనసుల్లోకి ఎంతగా చొచ్చుకు పోయిందో తెలిపే వివరాలను పరిశీలిస్తే.. దాని ప్రాముఖ్యం మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

ఐఐఎం–రోహ్‌తక్ అధ్యయనం... ఈ కార్యక్రమాన్ని కులాలకు, మతాలకు అతీతంగా దేశం మొత్తంలో 100 కోట్ల మంది కనీసం ఒక్కసారైనా విన్నారనీ, 23 కోట్ల మంది ప్రతి 'మన్ కీ బాత్' కార్యక్రమాన్నీ విన్నారనీ, అదేవిధంగా దేశంలో 96 శాతం మందికి దీని గురించి అవగాహన ఉందనీ పేర్కొంది. ఈ కార్యక్రమం పౌరుల బాధ్యతలనూ, దేశం పట్ల వారి ప్రవర్తననూ, సుహృద్భావపూరిత ఆశావహ దృక్పథాన్నీ ఏర్పరిచిందని సర్వే పేర్కొంది. ఈ సర్వే ప్రకారం 60 శాతం ప్రజలను 'మన్ కీ బాత్' దేశ నిర్మాణం విషయంలో ఉత్తేజితులను చేసింది. 55 శాతం ప్రజల్లో దేశం పట్ల వారి ప్రవర్తన ప్రభావితమయ్యింది. 63 శాతం ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాల గురించి విన్నారు. 59 శాతం ప్రజలకు ప్రభుత్వం పట్ల నమ్మకం పెరిగింది. 73 శాతం ప్రజలకు కేంద్ర ప్రభుత్వంపై సకారాత్మకమైన ఆశలు పెరిగాయి.

'మన్ కీ బాత్' కార్యక్రమం 11 విదేశీ భాషలలో తర్జుమా జరిగింది. 'భేటీ బచావో–



భేటీ పఢావో', 'స్వచ్ఛ్ భారత్ అభియాన్', 'నగదు బదిలీ' వంటి అనేక ప్రభుత్వ కార్యక్రమాలు ఈ కార్యక్రమం ద్వారా ప్రజల మధ్యకు నేరుగా చేరడంవల్ల అనేకమంది లబ్ధిదారులయ్యారు. అంతే కాకుండా ప్రజలను ఉత్తేజ పరచడానికి దేశంలోని నలుమూలలా జరిగిన అభివృద్ధినీ, అందుకు కారణమైన వ్యక్తులు, సంస్థల విజయ గాథలను ప్రధాని ప్రజలకు చెప్పడం ఈ కార్యక్రమంలో ఆకర్షించే ప్రధాన అంశం.

దేశ ప్రజలకు తమ జీవితాల పట్ల ఒక ఆశావాహ దృక్పథం నెలకొనడానికి 'మన్ కీ బాత్' ఎంతగానో తోడ్పడింది. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలను ఏకం చేయడానికి ప్రధాని దీనిని బాగా ఉపయోగించుకున్నారు. ముఖ్యంగా యువతరాన్ని ఉత్తేజితులను చేసి దేశ నిర్మాణానికి వారిని ఒక్క తాటిపై నడిపించడానికి ప్రధాని ఎంచుకున్న మార్గాలలో ప్రముఖమైనది ఈ కార్యక్రమం.

ప్రతి నెల చివరి ఆదివారం రోజు జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రజల నుండి సూచనలు, సలహాలు తీసుకుంటారు. ప్రజల నుండి రకరకాల సమస్యలను తెలుసుకోవడానికీ, ప్రభుత్వ కార్యక్రమాలు, వాటి అమలుతీరుపై సమాచారాన్ని సేకరించడానికీ ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా మోదీ ఉపయోగించుకుంటున్నారు. సామాజిక, అభివృద్ధి కార్య క్రమాలను ప్రకటించడానికి దీనిని వాడుకున్నారు. 'స్వచ్ఛ్ భారత్ అభి యాన్', 'భేటీ బచావో – భేటీ పఢావో', 'స్కిల్ ఇండియా' వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రకటించడం ఈ సందర్భంగా గమనార్హం. కోవిడ్–19 సమయంలో ప్రజలకు ప్రధానమంత్రి తగిన ధైర్యాన్నీ, దాన్ని ఎదుర్కోవడానికి కావలసిన అవగాహననూ కల్పించడానికి దీనిని వాడుకున్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 30న జరుగబోయే 100వ 'మన్ కీ బాత్' కార్యక్రమం కోసం దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తు న్నారు.

వ్యాసకర్త అర్థశాస్త్ర సహాయకాచార్యులు,
కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయం
ఇ–మెయిల్ : sathulingamurthy@gmail.com
('మన్ కీ బాత్' 100వ ఎపిసోడ్ సందర్భంగా)

అతితెలివి అనర్థం

'మేల్వడసియు, బుద్ధిచాలని యభాగ్యులు తత్ఫలమంద నేర్తురే?' (మంచన, కేయూరబాహు చరిత్రము, ద్వితీయాశ్వాసం, 33వ పద్యంలో భాగం). ఏదో పూర్వ సుకృతం వలన కొంత మేలు జరుగుతుంది. అయితే దాని ఫలం పొందే సమయం వచ్చే సరికి అకస్మాత్తుగా బుద్ధిలో పొడ సూపే అతి తెలివి దానిని చేజారుస్తుంది.

పూర్వం ఒకడు తపస్సుచేసి వరంగా మృత్యుంజయత్వాన్ని దేవీప్రసాదంగా (ఎప్పటికీ వాడిపోని ఆకుల నుండి పిండ గలిగే) ఆకు పసరు రూపంలో పొందాడు. అడవి నుండి ఇంటికి వెళ్ళే దారిలో ఒక మృతజీవి కళేబరం కనబడింది. దానిని చూసిన వాడికి, దేవి నుండి ప్రసాదంగా పొందిన ఆకుపసరు మహత్యాన్ని పరీక్షించాలన్న పెడబుద్ధి పుట్టింది. వెంటనే చేతిలోని ఆకుల పసరును ఆ కళేబరంపై పిండాడు. వాడి కర్మకు ఆ కళేబరం నుండి ఒక పులి జీవం పోసుకుని లేచి నిలబడింది. అలా జీవం పోసుకున్న ఆ పులి కళ్ళకు ఎదురుగానే కనబడింది ఆహారం. మరింక ఆలస్యం ఎందుకు చేస్తుంది? అలా ముగిసింది వాని కథ.



మృత్యుంజయత్వం చేతిలో ఉండడం గొప్ప వరం అనుకోవడం ఒక భ్రమ. తన చేతలకు తానే అబ్బురపడే ఒక తెలివి లేని వ్యక్తి చేతిలో అదే ఒక్కొక్కప్పుడు వాని మృత్యువుకు కారణం కూడా అవుతుందన్నది ఇందులో సారాంశం. ఒక్కొక సందర్భంలో వరం పొందడం అన్నది సమస్యగా కనపడదు. ఆ వరం పొందిన ఆనందంలో, ఉన్న మతిని పోగొట్టుకుని, దానిని ఉపయోగించుకొని చేసే పనే అసలైన సమస్యగా పరిణమించి పాఠం నేర్పుతుంది. శివుని శరీరంపై ఉండే భస్మం నుండి పుట్టినవాడు భస్మాసురుడు. భక్తికి మెచ్చి వరం కోరుకొమ్మంటే తాను 'నెత్తిన చెయ్యి పెడితే బూడిదై మిగలాలని' కోరతాడు. ఇవ్వటమే తెలిసిన దేవుడు పరమశివుడు. కనుక అడిగినదే ఇచ్చేశాడు. అయితే ఆ వరమే చివరికి ఆ అసురుడికి మృత్యుకారణమైన వైనం 'మోహినీ భస్మాసుర' కథగా అందరూ ఎరిగినదే. అందుచేతనే 'మతి లేనివాడు విద్యాన్వితు డయ్యును మేలు వడయ నేరడు' అని మంచన మరో చోట చెప్పిన మాటలు కూడా విలువైనవి.

– వెంకట్ భట్లు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.సప్తమి ప.12.56 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పునర్వసు ఉ.6.35 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.3.26 నుండి 5.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.42 వరకు తిరిగి ప.2.53 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.2.04 నుండి 3.50 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.41, **సూర్యాస్తమయం:** 6.13.

రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్!

నేడు కూడా వానలు.. పలుచోట్ల భారీ వర్షాలకు చాన్స్

- హైదరాబాద్ పరిసర జిల్లాల్లో కుండపోత కురవొచ్చన్న వాతావరణ శాఖ
- బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సగటున 2.32 సెం.మీ. వర్షపాతం నమోదు
- అత్యధికంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో 10 సెంటీమీటర్లు
- నారాయణపేట జిల్లాలో సగటున 4.4 సెంటీమీటర్లు
- రాష్ట్రమంతటా నాలుగైదు రోజులుగా వర్షాకాలాన్ని తలపించిన తీరు
- కొన్నిరోజులు 40 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాతావరణం వానాకాలాన్ని తలపిస్తోంది. పొద్దంతా ఎండ తీవ్రంగా ఉన్నా.. సాయంత్రానికి ఒక్కసారిగా చల్లబడి వానలు కురుస్తున్నాయి. ఉష్ణోగ్రతలూ బాగా తగ్గి చలి వేస్తోంది. నాలుగైదు రోజులుగా రాష్ట్రంలోని పలుచోట్ల ఈ పరిస్థితి కనిపించగా.. మరో మూడు రోజులూ ఇలాంటి వాతావరణమే కొనసాగుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అతిభారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

హైదరాబాద్ చుట్టూ భారీగా..

పశ్చిమ విదర్భ నుంచి కర్ణాటక వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దీనికి తోడు రాష్ట్రానికి దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నాయని.. వీటి ప్రభావంతో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే రెండ్రోజులు హైదరాబాద్ పరిసర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. పలుచోట్ల సగటున 7 సెంటీమీటర్ల నుంచి 12 సెంటీమీటర్ల వరకు కుండపోత వానలు పడొచ్చని ప్రకటించింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు, పలుచోట్ల వడగళ్లు కురుస్తాయని పేర్కొంది.

రాష్ట్రవ్యాప్తంగా వానలే..

బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఒక్కరోజే రాష్ట్రంలో సగటున 2.32 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా వానాకాలంలోనే ఇలా వర్షపాతం నమోదవుతుంది. అలాంటిది ఈసారి నడి వేసవిలో కురుస్తున్నాయి. బుధవారం రాష్ట్రంలో 0.02 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఏకంగా 2.32 సెంటీమీటర్లు కురవడం గమనార్హం.

ప్రాంతాల్లో సిద్దిపేట.. జిల్లా సగటులో నారాయణపేట

అత్యధికంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో 10 సెంటీమీటర్లు, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 9, భువనగిరిలో 9 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. ఇక జిల్లా సగటు వర్షపాతాన్ని పరిశీలిస్తే.. నారాయణపేటలో 4.5 సెంటీమీటర్లు, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 4.48, యాదాద్రి భువనగిరిలో 3.88, వికారాబాద్ 3.66, మహబూబ్‌నగర్ 3.54, జోగుళాంబ గద్వాలలో 3.49 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

తగ్గిన ఉష్ణోగ్రతలు

వరుస వానల నేపథ్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. బుధవారం గరిష్టంగా నల్లగొండలో 38.5 డిగ్రీలుగా నమోదవడం గమనార్హం. ఇక హనుమకొండలో కనిష్ట ఉష్ణోగ్రత 19.5 డిగ్రీలకు పడిపోయింది. వచ్చే మూడు రోజులు కూడా రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకన్నా తక్కువగానే నమోదవుతాయని, పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోయి చలి వాతావరణం ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలివీ..

ప్రాంతం	గరిష్టం
నల్లగొండ	38.5
ఆదిలాబాద్	36.8
నిజామాబాద్	36.5
మెదక్	36.2
రామగుండం	35.8
ఖమ్మం	35.2
భద్రాచలం	34.0
మహబూబ్‌నగర్	33.7
హైదరాబాద్	33.5
హకీంపేట్	33.0
దుండిగల్	33.0
హనుమకొండ	31.5

బుధవారం జిల్లాల వారీగా సగటు వర్షపాతం (సెం.మీలలో)

జిల్లా	సగటు వర్షపాతం	జిల్లా	సగటు వర్షపాతం
నారాయణపేట	4.50	సంగారెడ్డి	2.79
మేడ్చల్ మల్కాజ్‌గిరి	4.48	నాగర్‌కర్నూల్	2.78
యాదాద్రి భువనగిరి	3.88	వరంగల్	2.65
వికారాబాద్	3.66	హనుమకొండ	2.53
మహబూబ్‌నగర్	3.54	రాజన్న సిరిసిల్ల	2.58
జోగుళాంబ గద్వాల	3.49	నిజామాబాద్	2.52
సిద్దిపేట	3.41	మహబూబాబాద్	2.43
జనగామ	3.34	ములుగు	2.40
వనపర్తి	3.25	హైదరాబాద్	1.95
మెదక్	3.20	ఆదిలాబాద్	1.62
కామారెడ్డి	3.26	ఆసిఫాబాద్	1.65
రంగారెడ్డి	3.17	నిర్మల్	1.35
		జగిత్యాల	1.13
		భద్రాద్రి కొత్తగూడెం	1.03

ఆదుకుంటాం.. అధైర్య పడొద్దు

- పంటలు నష్టపోయిన రైతులకు మంత్రి హరీశ్‌రావు భరోసా



మంత్రి హరీశ్‌రావుకు గింజలు రాలిన వరికంకులను చూపిస్తూ ఏడుస్తున్న మహిళా రైతులు

సాక్షి, సిద్దిపేట: వడగళ్ల వానలతో నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు సిద్దిపేట జిల్లాలో పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, వ్యవసాయ శాఖ అధికారులతో కలసి పలు గ్రామాల్లో పర్యటించారు. వడగళ్ల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంటనష్టం వివరాలను తెలుసుకుని రైతులను ఓదార్చారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. నోటికాడికి వచ్చిన ముద్ద నేల పాలైనట్టు, ఆకస్మికంగా కురిసిన వానతో రైతులు పంటలు నష్టపోవడం దురదృష్టకరమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకి రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం అందిస్తామన్నారు. రైతులను ఆదుకోవాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉంటే మరో రూ.10 వేలు ఇచ్చి సాయం చేయాలని సూచించారు. యాసంగి కాలంలో తెలంగాణలో సాగయ్యే బాయిల్డ్ రైస్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకోకున్నా, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ వివిధ పథకాలతో వ్యవసాయ రంగానికి గట్టి పునాదులు వేశారని, ఏ గ్రామంలో తిరిగినా కేసీఆర్ ప్రభుత్వం పట్ల రైతులలో అభిమానం కనబడుతోందని మంత్రి హరీశ్ అన్నారు.

‘దడ’గళ్ల వాన



వడగళ్లు బెంబేలెత్తిస్తున్నాయి. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయిపల్లిలోని మల్లారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో బుధవారం భారీ వడగళ్లు పడ్డాయి. ఒకదానినొకటి అతుక్కుని ఉన్న ఈ పెద్ద వడగళ్ల గడ్డను స్థానికులు ఆసక్తిగా చూశారు.
– హుస్నాబాద్

బండి బెయిల్ రద్దుపై తీర్పు నేడు

వరంగల్ లీగల్: పదో తరగతి పేపర్ లీకేజీ కేసులో బండి సంజయ్‌కు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం తీర్పును గురువారానికి వాయిదా వేసింది. ఇరుపక్షాలు అదనపు వాదనలేవీ లేవని తెలపడంతో హనుమకొండ నాలుగో మున్సిఫ్ కోర్టు జడ్జి మట్ట సరిత తీర్పును గురువారానికి వాయిదా వేశారు. దీంతో తుది తీర్పుపై అన్నివర్గాల ప్రజలు, రాజకీయ నేతలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ 6వ దశ కర్మాగారంలోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 11వ యూనిట్‌లో నిరంతరాయంగా విద్యుదుత్పత్తి జరిపి వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం కర్మాగారంలో జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బి.లక్ష్మయ్య కేక్ కట్ చేసి ఉద్యోగులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించడం ద్వారా రికార్డ్ స్థాయి ఉత్పత్తి సాధ్యమైందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఈ ఎం.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఇవ్వడానికేం సమస్య?



రవీందర్ సింగ్

సాక్షి, హైదరాబాద్: గడువులోగా సీఎంఆర్ ఇవ్వడానికి బియ్యం మిల్లర్లకున్న సమస్యేమిటని.. పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ప్రశ్నించారు. ఆయన పౌరసరఫరాల భవన్‌లో బుధవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్‌తో కలసి 2019-20లో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎంఆర్‌లో జాప్యం జరగడం వల్ల సంస్థ తీసుకున్న అప్పులకు వడ్డీ భారంగా మారుతోందన్నారు. 2019-20లో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లు 15 రోజుల్లోగా బకాయి పడిన బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని రవీందర్ సింగ్ విమర్శించారు. ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవడం వల్లే ధాన్యం తడిచిపోయిందనడం అవగాహన లేమి అన్నారు.

5 రోజులు.. 4.5 లక్షల ఎకరాల్లో నష్టం

- అకాల వర్షాల నష్టంపై వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా
- నెల రోజుల్లో రెండు సార్లు భారీ వర్షాలు.. మొత్తం 9.5 లక్షల ఎకరాల్లో నష్టం
- భారీగా దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు
- మళ్లీ వర్షాల హెచ్చరికతో రైతుల్లో ఆందోళన
- క్షేత్రస్థాయిలో పర్యటించని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు



మహబూబాబాద్ జిల్లా మొండ్రాయిగూడెంలో నీట మునిగిన వరికంకులను ఏరుతున్న మహిళా రైతు

సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో గత ఐదు రోజుల్లోనే ఏకంగా 4.5 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అంతే కాదు గత నెల రోజుల్లో రెండు సార్లు కురిసిన గాలివానలు, వడగళ్లతో మొత్తంగా 9.5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించింది. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి. మొత్తంగా 3.5 లక్షల ఎకరాల్లో వరి దెబ్బతిన్నదని అంచనా. మామిడి, మొక్కజొన్న, నువ్వులు, పెసర, జొన్న, పొద్దు తిరుగుడు, బొప్పాయి, నిమ్మ, ఇతర పండ్ల తోటలు, కూరగాయల పంటలకూ భారీగానే నష్టం వాటిల్లింది. దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ పంట నష్టం వాటిల్లగా.. పలు జిల్లాల్లో ఐదు రోజులపాటు వరుసగా భారీ వర్షాలు కురవడం, వడగళ్ల కారణంగా ఎక్కువ నష్టం జరిగింది. అత్యధికంగా జగిత్యాల జిల్లాలో పంట నష్టం జరిగిందని.. తర్వాత సూర్యాపేట, కరీంనగర్, జనగామ, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో నష్ట తీవ్రత ఎక్కువగా ఉందని వ్యవసాయశాఖ నిర్ధారించింది. గాలివానలు ఇలా కొనసాగితే ఇంకా నష్టం సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక పంట నష్టంపై వ్యవసాయ విస్తరణాధికారులు గ్రామాల్లో సర్వే చేస్తున్నారు.

రైతులకు అందని పరిహారం

గత నెల 17 నుంచి 22వ తేదీ వరకు కురిసిన వర్షాలతో 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతు సంఘాలు అంచనా వేశాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం 2.28 లక్షల ఎకరాలుగా తేల్చింది. అందులోనూ 1.51 లక్షల ఎకరాలకు నష్టపరిహారంగా రూ.151 కోట్లు కేటాయించింది. ఈ సొమ్ము ఇంకా రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది.

క్షేత్రస్థాయికి వెళ్లని ఉన్నతాధికారులు

రాష్ట్రంలో ఇంతగా పంట నష్టం జరిగినా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఇలాంటి పెద్ద విపత్తు సంభవిస్తే అన్ని జిల్లాలకు నోడల్ ఆఫీసర్లను నియమించాలి. వారి నేతృత్వంలో బృందాలు క్షేత్రస్థాయికి వెళ్లి జిల్లా స్థాయి అధికారులకు సూచనలు ఇవ్వాలి. రైతుల వేదనను తెలుసుకోవాలి. కానీ వ్యవసాయ కమిషనర్ రఘునందన్‌రావు, ప్రత్యేక కమిషనర్ హనుమంతుతోపాటు అడిషనల్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు ఎవరూ జిల్లాలకు వెళ్ల లేదన్న విమర్శలు వస్తున్నాయి. కనీసం రైతులకు తగిన సలహాలు, సూచనలైనా ఇవ్వడం లేదని.. వానల తర్వాత పంటల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించే ప్రయత్నమూ చేయడం లేదని వ్యవసాయ నిపుణులు మండిపడుతున్నారు. కమిషనరేట్‌లో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఎవరూ రైతులకు అందుబాటులో ఉండటం లేదని, మీడియా ద్వారా రైతులకు సమాచారం ఇవ్వడంలోనూ వైఫల్యం కనిపిస్తోందని, కనీసం ఫోన్లలోనూ అందుబాటులో ఉండటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. వ్యవసాయశాఖకు కమిషనర్, కార్యదర్శి ఒకరే కావడంతో సమస్యలు వస్తున్నాయని.. కమిషనర్ వారానికోసారి వచ్చిపోతుండటంతో రైతులు, రైతు ప్రతినిధులు కలసి విజ్ఞప్తులు చేసే పరిస్థితి లేదని విమర్శలు ఉన్నాయి.

కల్లాల్లో కన్నీళ్లు..

▶ మొదటి పేజీ తరువాయి

క్వింటాల్ ధాన్యం కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఒక్క వరి మాత్రమే కాదు.. మామిడి, నువ్వులు, మిరప, మొక్కజొన్న, టమాటా వంటి ఇతర పంటలు కూడా వడగళ్ల బీభత్సానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా సంగారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, కరీంనగర్, ఖమ్మం, సూర్యాపేట తదితర జిల్లాల్లో మామిడి భారీగా నేలరాలింది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్లగొండ, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో పంట నష్టం అత్యధికంగా.. ఖమ్మం, ఆదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో కాస్త తక్కువగా ఉంది.

ఈదురుగాలులు, వడగళ్లతో అధిక నష్టం

వేసవిలో అకాల వర్షాలు మామూలే అయినా.. ఈసారి తీవ్రమైన ఈదురుగాలులు, వడగళ్లతో ఒక్కసారిగా భారీ వర్షాలు కురుస్తుండటం తీవ్ర నష్టానికి కారణం అవుతోందని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో పలుచోట్ల ఎకరానికి క్వింటాల్ వడ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని.. వరికోత కోసం తెచ్చే హార్వెస్టర్ అద్దెకు సరిపడా ధాన్యం కూడా వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు. పొలాలను కౌలుకు తీసుకొని వరిసాగు చేసిన రైతులకు మరింత దెబ్బపడింది. కౌలు, పెట్టుబడి కలిపి ఒక్కో ఎకరాకు 20వేలకుపైనే నష్టపోతున్నామని, ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

తడిసిన ధాన్యం

ముందుగా వరి సాగు చేసిన నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట, నల్లగొండతోపాటు వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో కోతలు మొదలయ్యాయి. 2వేలకుపైగా కేంద్రాలను ఏర్పాటు చేసినా ఇంకా కొనుగోళ్లు మొదలుపెట్టలేదు. రైతులు తెచ్చిన పంటను కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోశారు. అకాల వర్షాలతో అంతా తడిసిపోయింది. పలుచోట్ల కొట్టుకుపోయింది. మొత్తంగా 5 లక్షల టన్నుల ధాన్యం తడిసినట్టు పౌరసరఫరాల సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రకృతి బీభత్సం నేపథ్యంలో వరి దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉందని.. కోటి టన్నుల సేకరణ అంచనా వేసుకున్నా, అందులో సగమైనా వస్తుందా అన్న అనుమానాలు ఉన్నాయని అంటున్నారు.



జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ కొనుగోలు కేంద్రంలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న బాధిత రైతులు

ఏడెకరాల్లో నష్టపోతే అర ఎకరమే రాశారు



నేను ఏడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. గత నెలలో కురిసిన వానలకు పంట పూర్తిగా నేలవాలింది. అయినా అధికారులు అర ఎకరమే నష్టం జరిగినట్లు రాశారు. మిగిలిన కాసింత పంటనూ వ్యాపారులు తక్కువకే అడుగుతున్నారు.
– వరి మేకల నాగయ్య, సువర్ణాపురం, ఖమ్మం జిల్లా

రాళ్లవాన ముంచింది



మూడెకరాల్లో వరి వేసిన. తెల్లారి కోద్దామనుకుంటే.. రాత్రి మాయదారి రాళ్లవాన నిండా ముంచింది. గింజలన్నీ మట్టిలో కలిసిపోయాయి. సర్కారు ఆదుకోవాలి. లేకుంటే కుటుంబం రోడ్డుపడుతుంది.
– గుగులోతు నీల, ఆంధ్ర తండా, జనగామ జిల్లా

పావు మందమే వడ్లు మిగిలాయి

8 ఎకరాల్లో వరి సాగు చేసిన. వడగళ్ల వానతో గింజలు రాలిపోయాయి. పావు మందమే వడ్లు మిగిలాయి. మిషిన్ పెట్టి కోయిస్తే గడ్డి మాత్రమే మిగులుతుంది.
– రైతు ఆవుల మహేందర్, గర్రెపల్లి, సుల్తానాబాద్

పంట నష్టం అంచనాలివీ..

ఉమ్మడి కరీంనగర్‌లో..

కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో లక్ష ఎకరాలకుపైగా వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో వరి పంటే 80 వేల ఎకరాల్లో నష్టపోయింది. ఒక్క జగిత్యాల జిల్లాలోనే 50వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 60వేల మంది రైతులపై వర్షం ప్రత్యక్ష ప్రభావం చూపినట్టు అంచనా.

మెదక్ ఉమ్మడి జిల్లాలో..

సిద్దిపేటలో పంట నష్టం అధికంగా ఉంది. ఈ జిల్లాలో 86,203 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ఇందులో 79,350 ఎకరాల్లో వరికి నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మెదక్‌లో 13,632 ఎకరాల్లో వరి, 342 ఎకరాల్లో మామిడి దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లా పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో లక్షన్నర టన్నుల ధాన్యం తడిసినట్లు అనధికారిక అంచనా. సంగారెడ్డి జిల్లాలో నష్టం తక్కువగా ఉంది.

ఉమ్మడి నిజామాబాద్‌లో..

కామారెడ్డి జిల్లాలో 22 వేల మంది రైతులకు సంబంధించిన పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొత్తంగా 32 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్టు పేర్కొంది. నిజామాబాద్ జిల్లాలో వరి, మొక్కజొన్న, నువ్వు, పొద్దుతిరుగుడు, పసుపు, ఉద్యాన పంటలకు 600 ఎకరాల్లో నష్టం జరిగింది. నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు తడిసింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో లక్షన్నర ఎకరాల వరకు వివిధ పంటలు నష్టపోయినట్టు సమాచారం. అయితే 75,603 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, ఇతర పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు అంచనా వేశారు. ఇందులో 58 వేల ఎకరాల్లో వరి, 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 7,603 ఎకరాల్లో ఇతర పంటలు ఉన్నట్టు పేర్కొన్నారు. జనగామలో వరి బాగా దెబ్బతింది.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో..

మంచిర్యాల జిల్లాలో 2,379 ఎకరాల్లో వరి, 309 ఎకరాల్లో మామిడి.. ఆదిలాబాద్ జిల్లాలో 2వేల ఎకరాల్లో జొన్న పంటలకు నష్టం జరిగినట్టు అంచనా వేశారు. ఆసిఫాబాద్‌లో 3,419 ఎకరాల మేర పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించారు.

నల్లగొండ ఉమ్మడి జిల్లాలో..

సూర్యాపేట జిల్లాలో 25వేల ఎకరాలకుపైగా వరికి నష్టం వాటిల్లగా, సుమారు 1,000 ఎకరాల్లో మామిడి తోటలు నాశనమయ్యాయి. యాదాద్రి జిల్లాలో 11వేల ఎకరాల్లో వరి దెబ్బతిన్నది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో..

ఖమ్మం జిల్లాలో వరి 8,169 ఎకరాల్లో, మొక్కజొన్న 1751 ఎకరాల్లో నష్టపోయినట్టు కలెక్టర్‌కు వ్యవసాయ శాఖ నివేదించింది.

రైతులను ఆదుకోవాలి: సంజయ్



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. తక్షణమే ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి, యుద్ధ ప్రాతిపదికన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ‘భూమిని నమ్ముకుని సేద్యం చేస్తున్న 14 లక్షల మంది కౌలు రైతులను కూడా ఆదుకోండి. వచ్చే ఖరీఫ్ సీజన్‌లోనైనా ఉచిత ఎరువులు, విత్తనాలు అందజేసి రైతులకిచ్చిన మాట నిలుపుకోండి’అని కోరారు. యాసంగి సీజన్‌లో రైతులు పంట నష్టపోవడం ఇది రెండోసారని, ఈ సీజన్‌లో 9 లక్షలకు పైగా ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని బుధవారం సీఎంకు రాసిన బహిరంగ లేఖలో సంజయ్ తెలిపారు. కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతమని, ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యమని వారు గుండెలవిసేలా రోదిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఇస్తానన్న రూ.228 కోట్ల పంట నష్టపరిహారం ఇప్పటిదాకా ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఐదురోజులుగా వర్షాలతో రైతులు అల్లాడుతుంటే సీఎం, వ్యవసాయశాఖ మంత్రి ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

క్లుప్తంగా

157 నర్సింగ్ కాలేజీలు

న్యూఢిల్లీ: ఇప్పటికే ఉన్న వైద్య కళాశాలలకు అనుబంధంగా రూ.1,570 కోట్ల వ్యయంతో నూతనంగా 157 నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. సంబంధిత కేబినెట్ భేటీ నిర్ణయాలను ఆ తర్వాత మీడియాకు కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఢిల్లీలో చెప్పారు. 'కొత్త కాలేజీల రాకతో ఏటా దాదాపు 15,700 కొత్త నర్సింగ్ గ్రాడ్యుయేట్ సీట్లు అందుబాటులో ఉంటాయి. ప్రతీ కాలేజీలు 100 బీఎస్సీ(నర్సింగ్) సీట్లు ఉంటాయి. మొత్తం 157కుగాను యూపీలో 27, రాజస్థాన్‌లో 23, మధ్యప్రదేశ్‌లో 14, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో చెరో 11 , కర్ణాటకలో నాలుగు కాలేజీలు నెలకొల్పుతాం' అని మాండవీయ చెప్పారు. బ్రిటన్‌లో 26 వేల మంది, అమెరికాలో 16వేల మంది, ఆస్ట్రేలియాలో 12వేల మంది, గల్ఫ్ దేశాల్లో 20వేల మంది భారతీయ నర్సులు సేవలందిస్తున్నారు.

చంద్రునిపై కూలిన జపాన్ వ్యోమనౌక!



టోక్యో: జపాన్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ ఐస్పేస్ ప్రయోగించిన ల్యాండర్ మంగళవారం చంద్రునిపై దిగే క్రమంలో కుప్పకూలినట్లు సమాచారం. చంద్రుని ఉపరితలానికి కేవలం 10 మీటర్ల దూరంలో ఉండగా దానితో సంబంధాలు తెగిపోయాయి. 6 గంటలకు పైగా విఫలయత్నం చేసిన అనంతరం, చివరి అంకంలో ల్యాండర్ చంద్రున్ని ఢీకొట్టి కుప్పకూలిందని ఐస్పేస్ ప్రకటించింది. ఈ ప్రయోగం విజయవంతమైతే చంద్రునిపై ల్యాండర్‌ను దించిన తొలి ప్రైవేట్ కంపెనీగా అది చరిత్రకెక్కేది. ఇంతటితో కుంగిపోకుండా మళ్లీ ప్రయత్నిస్తామని దాని సీఈఓ హకమడ ప్రకటించారు.

భారత సంతతి వ్యక్తికి సింగపూర్‌లో ఉరి

సింగపూర్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యవహారంలో నేరం రుజువు కావడంతో సింగపూర్‌లో భారత సంతతికి చెందిన తంగరాజు సుప్పయ్య(46)కు ఉరిశిక్ష అమలు చేశారు. ఉరిశిక్ష ఆపాలని ఆయన కుటుంబ సభ్యులతోపాటు అంతర్జాతీయ మానవ హక్కుల కార్యకర్తలు, ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేసినప్పటికీ సింగపూర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. క్షమాభిక్ష పిటిషన్‌ను మంగళవారం న్యాయస్థానం తిరస్కరించడంతో చాంగీ జైలులో బుధవారం తెల్లవారుజామున శిక్షను అమలు చేశారు. ఈ విషయాన్ని సింగపూర్ ప్రిజన్ సర్వీసు ప్రతినిధి వెల్లడించారు. తంగరాజు డెత్ సర్టిఫికెట్‌ను అధికారులు తమకు అందజేశారని అతని సోదరి చెప్పారు. సింగపూర్ జాతీయుడైన తంగరాజు 2014లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణల కింద అరెస్టయ్యాడు.

రెడ్ కారిడార్ రక్తసిక్తం

భద్రతా దళాల బస్సును పేల్చేసిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఘాతుకం	ఐఈడీ పేలుడు తీవ్రతకు తునాతునకలైన పోలీసు వాహనం	10 మంది పోలీసులు, డ్రైవర్ దుర్మరణం



ఘటనాస్థలి నుంచి భద్రతా బలగాల మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టులు మరో ఘాతుకానికి పాల్పడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో 10 మంది పోలీసులను బలి తీసుకున్నారు. పల్నార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని ఇంటెలిజెన్స్ విభాగానికి సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ సిబ్బంది మినీ బస్సులో ఆ ప్రాంతానికి మంగళవారం బయలుదేరి వెళ్లారు. గాలింపు చర్యలు పూర్తిచేసి బుధవారం దంతెవాడకు తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం సమయంలో పల్నార్–అరన్‌పూర్ మధ్యలో ఉన్న అటవీ ప్రాంతానికి మినీ బస్సు చేరుకోగానే రోడ్డు మధ్యలో అమర్చిన ఐఈడీ బాంబును మావోయిస్టులు పేల్చారు. పేలుడు ధాటికి మినీ బస్సు గాల్లోకి లేచి పక్కన చెట్లలో పడిపోయింది. బస్సు భాగాలు తునాతునకలు అయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న 10 మంది డీఆర్‌జీ సిబ్బంది, డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భగేల్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ విపత్కర పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోవడానికి తగిన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే కేంద్ర బలగాలను ఛత్తీస్‌గఢ్‌కు పంపిస్తామని చెప్పారు. రాష్ట్రంలో నక్సలిజాన్ని అంతం చేస్తామని భగేల్ అన్నారు.

11 మంది బలి

మావోయిస్టుల దాడిలో చనిపోయిన వారిలో హెడ్ కానిస్టేబుళ్లు జోగా సోధి, మున్నా రామ్ కడాతి, సంతోష్ తామో, కానిస్టేబుళ్లు దుల్గో మాండవి, లఖ్ము మార్కం, జోగా కవాసి, హరిరామ్ మాండవి, రాజారామ్ కర్తమ్, జైరాం పొడియం, జగదీష్ కవాసీలతో పాటు డ్రైవర్ ధనిరామ్ యాదవ్ ఉన్నారు.

టీసీఓసీ ఉచ్చులో..

వేసవికి ముందు అడవుల్లో పచ్చదనం పలచబడుతుంది. ఈ సమయంలో మావోయిస్టులు అడవి లోపలికి వెళ్లిపోతుంటారు. పోలీసులు మరింత ఉధృతంగా వారి కోసం గాలిస్తుంటారు. ప్రతి వేసవిలో సాయుధ భద్రతా దళాల దూకుడుతో మావోయిస్టులు చిక్కుల్లో పడుతున్నారు. దీంతో భద్రతా దళాల వేగానికి అడ్డుకట్ట వేసేందుకు కొంత కాలంగా టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెన్ (టీసీఓసీ) పేరుతో సరికొత్త వ్యూహాన్ని మావోయిస్టులు అమలు చేస్తున్నారు. భావజాల వ్యాప్తి, కొత్త రిక్రూట్‌మెంట్, భద్రతా దళాలపై మెరుపుదాడులు చేయడం టీసీఓసీలో వ్యూహంలో భాగంగా ఉన్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో టీసీఓసీని మావోయిస్టులు అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే పల్నార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు దళాలు సంచారిస్తున్నాయంటూ భద్రతా దళాలకు సమాచారం చేరవేసి తమ ఉచ్చులో పడేసినట్లు తెలుస్తోంది.

తొందరపాటు వల్లే...

పేలుడు జరిగిన తీరును చూస్తే కూంబింగ్‌లో పోలీసులు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొటోకాల్ (ఎస్‌ఓపీ) పాటించలేదని తెలుస్తోంది. ప్రొటోకాల్ ప్రకారం నిఘా సమాచారాన్ని పక్కాగా ధ్రువీకరించుకోవాలి. తర్వాత భద్రతా దళాలు ప్రయాణించే మార్గంలో ప్రమాదం జరగకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలి . అవసరమైతే భద్రతా దళాల కంటే ముందు రోడ్ ఆపరేటింగ్ పార్టీని పంపించాలి. మినీ బస్సులో బయలుదేరిన డీఆర్‌జీ బృందం వీటిని పాటించలేదని తెలుస్తోంది. దాంతో తిరుగు ప్రయాణంలో మావోయిస్టుల ఉచ్చులో చిక్కారు. 2021 ఏప్రిల్ 3న బీజాపూర్ జిల్లా తెర్రం పోలీస్ స్టేషన్ పరిధిలో టేకుల్‌గూడా సమీపంలో సైతం ఇదే తరహాలో మావోయిస్టులు పన్నిన ట్రాప్‌లో భద్రతా దళాలు చిక్కుకున్నాయి. ఆ ఘటనలో 22 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బలయ్యారు.



పేలుడు ధాటికి తునాతునకలైన పోలీసు వాహనం

వారి త్యాగాన్ని మరువం: మోదీ

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దుశ్చర్యను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. బాంబు దాడిలో మృతి చెందిన పోలీసులకు నివాళులర్పించారు. వారి త్యాగం సదా స్మరణీయమని ట్వీట్ చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. పోలీసు సిబ్బంది మృతి పట్ల కేంద్ర మంత్రివర్గం సంతాపం తెలిపింది. బాధితులకు నివాళిగా సమావేశంలో మంత్రులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సంతాపం తెలిపారు.

మావోయిస్టులది పిరికిపంద చర్య: కాంగ్రెస్

ఛత్తీస్‌గఢ్ ఘటనపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేత రాహుల్ గాంధీ స్పందించారు. మావోయిస్టులది పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. మృతులకు సంతాపం ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలిజంపై పోరాడుతోందని, కచ్చితంగా విజయం సాధిస్తుందని ఖర్గే చెప్పారు. ఆయన సీఎం భూపేశ్ భగెల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మావోయిస్టుల దాడిలో 11 మంది మరణించడం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

కేజ్రీవాల్ 'ఇంటి' ఖర్చు రూ.45 కోట్లు: బీజేపీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన అధికార నివాస సుందరీకరణ కోసం రూ.45 కోట్లకుపైగా ఖర్చుచేశారని బీజేపీ, కాంగ్రెస్ దుమ్మెత్తిపోశాయి. 'నిజాయితీ, నిరాడంబరతకు మారుపేరుగా నిలుస్తాననే కేజ్రీవాల్ ఇప్పుడు మహారాజుగా మారారు. ఆయన ఇంట్లోని విలాసవంత, అత్యంత సౌకర్యవంత వస్తువులను చూస్తే రాజులు కూడా కేజ్రీవాల్‌కు సలామ్ చేస్తారు. రూ.7.94కు ఒక కర్టెన్ కొన్నారు. వియత్నాం నుంచి తెప్పించిన రూ.1.15 కోట్ల మార్బుల్స్‌ను వాడారు. ప్రీ–ఫ్యాబ్రికేటెడ్ గోడలకే రూ.4 కోట్లు పెట్టారు. దీన్ని కప్పిపుచ్చేందుకు మీడియా సంస్థలకు రూ.20–50 కోట్లు ముట్టజెప్పేందుకు కేజ్రీవాల్ సిద్ధపడ్డారు'' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఆరోపించారు. వీటిపై మీడియాముఖంగా బదులివ్వాలని సవాల్ చేశారు. తక్షణం రాజీనామా చేయాలన్నారు.

సీఎంగా ఉండే హక్కుందా ?: కాంగ్రెస్

ఇంతటి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాక కేజ్రీవాల్‌కు సీఎంగా నైతిక అర్హత ఉందా అంటూ కాంగ్రెస్ నిలదీసింది. ఎర్ర బుగ్గ కారును వాడబోనని, అదనపు భద్రతా సిబ్బంది, పెద్ద బంగ్లా వద్దని ప్రకటించి చివరికిలా మారారని కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ ఆరోపించారు

పాత భవనం కనుకే: ఆప్

ఈ ఆరోపణలను ఆప్ ఖండించింది. 'అది 1942లో కట్టిన ఇల్లు. ఇప్పటికి మూడుసార్లు పైకప్పు కూలింది. కేజ్రీవాల్ తల్లిదండ్రులుండే గది, కేజ్రీవాల్ గది, ప్రజా సమావేశ గది పైకప్పులు కూలాయి. దాంతో ప్రజాపనుల విభాగమే రూ.30 కోట్లతో కొత్తగా కట్టింది'' అని పార్టీ నేత సంజయ్ సింగ్ అన్నారు. పెచ్చులూడిన ఫొటోలు షేర్ చేశారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఇంటికి చిన్న రిపేర్లకే రూ.15 కోట్లు వెచ్చించారని ఆరోపించారు.

ప్రజల గొంతు నొక్కేయగలరా?

సోనియా వ్యాసంపై ధన్‌ఖడ్ ఆక్షేపణ • 'మన్ కీ బాత్' దేశానికి ఆశాదీపమని ప్రశంస



మన్ కీ బాత్ కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ధన్‌ఖడ్, కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ: భారతదేశంలో ఉన్నంత భావ ప్రకటన స్వేచ్ఛ ప్రపంచంలో ఇంకెక్కడా లేదని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. దేశంలో బీజేపీ పాలనలో ప్రజల గొంతు నొక్కేస్తున్నారంటూ కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఇటీవల ఓ పత్రిక వ్యాసంలో చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అవి తనకు బాధ కలిగించాయన్నారు. ప్రజల గొంతును ఎవరూ నొక్కేయలేరని చెప్పారు. బుధవారం 'మన్‌కీ బాత్ 100 జాతీయ సదస్సు' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతినెలా నిర్వహించే ఈ రేడియో కార్యక్రమం దేశానికి ఒక ఆశాదీపమన్నారు. దీనిద్వారా రాజకీయాలకు అతీతంగా మోదీ దేశానికి సందేశమిస్తున్నారని ప్రశంసించారు. కొందరు నాయకులు విదేశాలకు వెళ్లి, మన దేశాన్ని తూలనాడుతున్నారని మండిపడ్డారు. మోదీ హయాంలో ఎంతో అభివృద్ధి జరుగుతోందంటూ ప్రశంసల వర్షం కురిపించారు. మన్ కీ బాత్ 100 కాఫీ టేబుల్ బుక్ తదితరాలను ధన్‌ఖడ్ విడుదల చేశారు.

ముఖ్యమైన భావప్రసారం: ఆమిర్ ఖాన్

మన్ కీ బాత్ చాలా ముఖ్యమైన భావప్రసార కార్యక్రమమని బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ ప్రశంసించారు. మన్ కీ బాత్ ద్వారా మోదీ దేశ ప్రజలతో అనుసంధానం అవుతున్నారని తెలిపారు. అత్యంత కీలకమైన అంశాలపై చర్చిస్తున్నారని, తన ఆలోచనలు పంచుకుంటూ చక్కటి సలహాలు, సూచనలు ఇస్తున్నారని అమీర్ ఖాన్ ప్రశంసించారు.

పార్లమెంటుకు వదిలేయండి

స్వలింగ వివాహాలపై సుప్రీంకోర్టుకు కేంద్రం విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ''స్వలింగ వివాహాల అంశం అత్యంత సంక్లిష్టమైనది. సమాజంపై ఇది పెను ప్రభావం చూపుతుంది'' అని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కాబట్టి దీన్ని పూర్తిగా పార్లమెంటు పరిశీలనకు వదిలేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా సుప్రీంకోర్టును కోరింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కోరుతూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ముందు వాదనలు బుధవారం ఐదో రోజూ కొనసాగాయి. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు కొనసాగించారు. వివాహమంటే ఏమిటి, ఎవరి మధ్య జరుగుతుందన్న కీలకాంశాలపై నిర్ణయం తీసుకోవాల్సింది ఎవరన్నదే కీలక ప్రశ్న అని ఆయనన్నారు. ''నిజానికి పార్లమెంటుకు స్థాయికి కూడా ఇదెంతో విస్తృతమైన కసరత్తు. స్వలింగ వివాహాలపై తీసుకోబోయే నిర్ణయం పలు చట్టాలకు సంబంధించి ఏకంగా 160 నిబంధనలను ప్రభావితం చేస్తుంది. దీనిపై కసరత్తు చేసేందుకు కావాల్సిన వనరులు న్యాయవ్యవస్థ వద్ద లేవు. పెళ్లి ఒక సామాజిక, చట్టపరమైన వ్యవస్థ. దానికి గుర్తింపు పూర్తిగా శాసనవ్యవస్థ విధాన నిర్ణయాల పరిధిలోని అంశం. ఆ అధికారాన్ని న్యాయవ్యవస్థ లాక్కోజాలదు'' అన్నారు. తన వాదనకు మద్దతుగా అబార్షన్‌కు రాజ్యాంగపరమైన హక్కు కల్పించేందుకు నిరాకరిస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకించారు. దీన్ని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. ''మీ వాదనను అర్థం చేసుకున్నాం. న్యాయమూర్తులు చట్టాలు చేయరనేది అందరికీ తెలిసిన విషయమే. మహిళల హక్కుల పరిరక్షణలో అమెరికా కంటే భారత్ ఎంతో ముందుకు వెళ్లింది. కనుక అక్కడి తీర్పులను ప్రస్తావించొద్దు'' అని సీజేఐ స్పష్టం చేశారు.



కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మైసూరులో ఓ హోటల్‌లో మసాలా దోసె వేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక

నక్షత్రాలు పేలితే భూమికి ముప్పు!


సూపర్‌నోవాల విస్ఫోటంతో యూవీ రేడియేషన్

గ్రహాలపై జీవజాలం అంతరించిపోయే ప్రమాదం

యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయి ఖగోళ శాస్త్రవేత్తల అధ్యయనం

భూగోళంపై కోట్లాది జీవులు ఉన్నాయి. లక్షల సంవత్సరాల పరిణామ క్రమంలో జీవజాలం పుట్టుకొచ్చింది. ఇందుకు ఎన్నో సంఘటనలు దోహదం చేశాయి. భూమిపై జీవుల ఆవిర్భావం, మనుగడకు ఇక్కడి అనుకూల వాతావరణమే కారణం. ధరణిపై వాతావరణం విషతుల్యంగా మారితే జీవులకు ముప్పు తప్పదు. పూర్తిగా అంతరించిపోయినా ఆశ్చర్యం లేదు. అలాంటి ప్రమాదమే తలెత్తే అవకాశం ఉందని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సుదూరంలోని అంతరిక్షంలో ఉన్న సూపర్‌నోవాల పేలుడు నుంచి గ్రహాలకు కొత్త ముప్పు పొంచి ఉందని, ఈ విపత్తు నుంచి తప్పించుకోవడం మన చేతుల్లో లేదని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్‌కు చెందిన ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు.

అంతరిక్షంలో అనంతమైన నక్షత్రాలు ఉన్నాయి. కొన్ని సూపర్‌నోవాగా మారి పేలిపోతుంటాయి. బ్లాస్ట్ వేవ్ సంభవిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ప్రమాదకరమైన ఎక్స్–కిరణాలు అధిక మోతాదులో వెలువడుతాయి. ఇవి సమీపంలోని గ్రహాలను చేరుతాయి. ఇందుకు నెలలు, సంవత్సరాలు, దశాబ్దాలు కూడా పట్టొచ్చు. సూర్యుడు కూడా ఒక నక్షత్రమే. సూర్యుడి నుంచి వెలువడే అల్ట్రావయొలెట్(యూవీ) రేడియేషన్ నుంచి దాని పరిధిలోని భూగ్రహాన్ని రక్షించడానికి ఓజోన్ పొర ఆవరించి ఉంది.



ఏమిటీ ముప్పు?

సూపర్‌నోవా పేలుడుతో ఉద్గారమయ్యే ఎక్స్–కిరణాలు భూమిని చుట్టూ ఉన్న ఓజోన్ పొరను విచ్ఛిన్నం చేస్తాయి. ఓజోన్ పొర చాలావరకు తుడిచిపెట్టుకుపోతోంది. దాంతో యూవీ రేడియేషన్ నేరుగా భూగ్రహం ఉపరితలాన్ని ఢీకొడుతుంది. ఫలితంగా నైట్రోజన్ డయాక్సైడ్ అనే విషవాయువు భూమిపై ఉత్పత్తి అవుతుంది. అది విషపూరితమైన గోధుమ రంగు పొరను భూమి చుట్టూ ఏర్పరుస్తుంది. అప్పుడు వాతావరణం లుప్తమైపోతుంది. జీవులు అంతరించిపోతాయి.

ఎలా గుర్తించారు?

యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయి శాస్త్రవేత్తలు చంద్ర ఎక్స్–రే అబ్జర్వేటరీతోపాటు ఇతర అత్యాధునిక టెలిస్కోప్‌లతో సూపర్‌నోవాలపై అధ్యయనం చేశారు. పేలిపోయే తారల నుంచి ఎక్స్–కిరణాలు వెలువడి, భూమి, ఇతర గ్రహాలను ప్రభావితం చేసే దశ రాబోతుందని, ఈ పరిణామం 100 కాంతి సంవత్సల దూరంలో చోటుచేసుకుంటుందని కనిపెట్టారు. పేలిపోయే నక్షత్రాల నుంచి వాటిల్లే ముప్పు గతంలో పోలిస్తే ఇప్పుడు మరింత పెరిగినట్లు గుర్తించారు. 160 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న సూపర్‌నోవాలు పేలిపోతే భూమిలాంటి గ్రహాలకు రేడియేషన్ ముప్పు ఉంటుందని తేల్చారు. 1979సీ, ఎస్ఎన్ 1987ఏ, ఎస్ఎన్ 2010జేఎల్, ఎస్ఎన్ 1994ఐ అనే సూపర్‌నోవాలను నిశితంగా పరిశీలించారు. అవి ఇప్పట్లో పేలే అవకాశం ఉందా? దానిపై ఓ అంచనాకొచ్చారు.



ఇప్పటికిప్పుడు ప్రమాదం లేనట్లే

భూమికి ఇప్పటికిప్పుడు ముంచుకొచ్చిన ప్రమాదం ఏమీ లేదని శాస్త్రవేత్త కానర్ ఓమహోనీ వెల్లడించారు. ఎక్స్–రే డేంజర్ జోన్‌లో బలమైన సూపర్‌నోవా ఏదీ లేదని తెలిపారు. భూమికి సమీపంలో గతంలో తారలు పేలిపోయిన దాఖలాలు ఉన్నాయని వెల్లడించారు. 20 లక్షల నుంచి 80 లక్షల సంవత్సరాల క్రితం భూమి నుంచి 65 నుంచి 500 కాంతి సంవత్సరాల దూరంలో సూపర్‌నోవా ఒకటి పేలిపోయింది. దానికి సంబంధించిన రేడియేషన్ ఇప్పటికీ భూమి వైపునకు దూసుకొస్తోందని పరిశోధకులు గుర్తించారు. సూపర్‌నోవా నుంచి వెలువడే ఎక్స్–కిరణాలపై మరిన్ని పరిశోధనలు చేయడం నక్షత్రాల జీవితకాలం గురించి అర్థం చేసుకోవడానికే కాదు, ఆస్ట్రోబయాలజీ, పాలియోంటాలజీ, ప్లానెటరీ సైన్సెస్ తదితర రంగాల్లో చిక్కుముడులు విప్ప డానికి ఉపయోగపడతాయని యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయి శాస్త్రవేత్త బ్రియాన్ ఫీల్డ్స్ తెలిపారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

బాదల్‌కు నేతల ఘన నివాళి



చండీగఢ్: పంజాబ్ రాజకీయ కురువృద్ధుడు, ఐదుసార్లు పంజాబ్ సీఎంగా సేవలందించిన ప్రకాశ్ సింగ్ బాదల్‌ను కడసారి చూసేందుకు పార్టీలు, ప్రాంతాలకతీతంగా వందలాది మంది నేతలు, స్థానికులు చండీగఢ్‌కు తరలివచ్చారు. ఆయన పార్థివదేహం వద్ద ఘన నివాళులర్పించారు. తీవ్ర అనారోగ్యంతో బుధవారం తుదిశ్వాస విడిచిన తమ అభిమాననేతను చివరిసారి చూసేందుకు చండీగఢ్‌లోని శిరోమణి అకాలీదళ్ పార్టీ ప్రధాన కార్యాలయానికి ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. గురువారం మధ్యాహ్నం బాదల్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మళ్లీ ఢిల్లీ మేయర్‌గా ఆప్ నేత షెల్లీ



న్యూఢిల్లీ: ప్రత్యర్థి పార్టీ బీజేపీ మహిళా అభ్యర్థి శిఖా రాయ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా నేత, ప్రస్తుత ఢిల్లీ మున్సిపాలిటీ(ఎంసీడీ) మేయర్ షెల్లీ ఒబెరాయ్ ఈ ఆర్థిక సంవత్సరానికీ మరోమారు మేయర్‌గా ఎంపికయ్యారు. ఎంసీడీ నిర్ణాయక మండలి అయిన స్టాండింగ్ కమిటీకి ఇంతవరకు ఎన్నికలు నిర్వహించనందుకు నిరసనగా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు శిఖా రాయ్ చెప్పారు. డెప్యూటీ మేయర్ పదవికి బీజేపీ మహిళా అభ్యర్థిగా సోనీ పాల్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో ప్రస్తుత డెప్యూటీ మేయర్ ఆలీ మొహమ్మద్ ఇక్బాల్‌కు మరోసారి పదవి దక్కింది. ఓటింగ్‌లో ఓటమి భయాలతోనే వీరిద్దరూ పోటీ నుంచి తప్పుకున్నారని ఆప్ ఎద్దేవాచేసింది. ' కనీసం పోటీచేసే సత్తాలేక బీజేపీ కౌన్సిలర్లు ఆప్ నేతృత్వంలోని కేజ్రీవాల్ ఎదుట సరెండర్ అయ్యారు' అని పార్టీ ఎమ్మెల్యే, పార్టీ ఎంసీడీ ఇన్‌చార్జ్ దుర్గేశ్ పాఠక్ వ్యాఖ్యానించారు. కాగా, స్టాండింగ్ కమిటీలు, వార్డ్ కమిటీలను ఏర్పాటుచేయకుండా ఎంసీడీని ఆప్ నిర్వీర్యం చేస్తోందని ఢిల్లీ బీజేపీ విభాగం ఆరోపించింది. ఎంసీడీ మేయర్ పదవీకాలం ఏడాది. ఎంసీడీ ఎన్నికలయ్యాక ఐదేళ్ల కోసం ప్రతిఏటా మేయర్‌ను రిజర్వేషనల పరంగా రొటేషన్ పద్ధతిలో ఎన్నుకుంటారు. మొదటి సంవత్సరం మహిళలకు, రెండో ఏడాది జనరల్ కేటగిరీ, మూడో ఏడాది రిజర్వ్‌డ్ కేటగిరీ, చివరి రెండేళ్లు ఓపెన్ కేటగిరీకి కేటాయిస్తారు. ఆర్థిక సంవత్సరం ముగియగానే కొత్త మేయర్‌ను ఎన్నుకుంటారు. గత ఆర్థిక సంవత్సరానికి ఓటింగ్ పలుమార్లు వాయిదాపడ్డాక చివరకు ఆప్ అభ్యర్థి గెలవడం తెల్సిందే.

అడ్డంకులున్నా ముందడుగే..

'సౌరాష్ట్ర–తమిళ సంగమం'లో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు



సోమనాథ్: మన దేశం వైవిధ్యానికి మారుపేరు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. విశ్వాసం నుంచి ఆధ్యాత్మిక దాకా.. అన్ని చోట్లా వైవిధ్యం ఉందని తెలిపారు. దేశంలో వేర్వేరు భాషలు, యాసలు, కళలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ వైవిధ్యం మనల్ని విడదీయడం లేదని, మన మధ్య అనుబంధాన్ని, సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. బుధవారం 'సౌరాష్ట్ర–తమిళ సంగమం' వేడుక ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ ఏదైనా కొత్త విజయం సాధించే శక్తి సామర్థ్యాలు మన దేశానికి ఉన్నాయని ఉద్ఘాటించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్నదే మన ఆశయమని వివరించారు. ఈ లక్ష్య సాధనలో ఎన్నో అడ్డంకులు ఉన్నాయని, మనల్ని ఆటంకపరిచే శక్తులకు కొదవలేదని చెప్పారు. అయినప్పటికీ లక్ష్యాన్ని చేరుకోవడం తథ్యమని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 7 దశాబ్దాలు పూర్తయినా దేశంలో ఇంకా బానిస మనస్తత్వం ఇంకా కొనసాగుతుండడం ఒక సవాలేనని అన్నారు. బానిస మనస్తత్వం నుంచి మనకి మనమే విముక్తి పొందాలని, అప్పుడు మనల్ని మనం చక్కగా అర్థం చేసుకోగలమని, మన ఘనమైన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లగమని ఉద్బోధించారు. అన్ని అడ్డంకులను అధిగమించి, మనమంతా కలిసి దేశాన్ని ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.

ఆరోగ్య సమస్యలను సరిహద్దులు ఆపలేవు

న్యూఢిల్లీ: ఆరోగ్య రంగంలో మన ముందున్న సవాళ్లను దీటుగా ఎదిరించడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలని మోదీ పిలుపునిచ్చారు. 'వన్ ఎర్త్, వన్ హెల్త్–అడ్వాంటేజ్ హెల్త్‌కేర్ ఇండియా 2023' సదస్సులో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ఆరోగ్య సంరక్షణ విషయంలో సమీకృత కృషిపై ప్రత్యేకంగా దృష్టి సారించామని చెప్పారు. మెరుగైన, చౌకైన వైద్య సేవలు అందరికీ అందాలన్నారు.



బుధవారం టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామాకు రామన్ మెగసెసె అవార్డును అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి. 1959లో ప్రకటించిన అవార్డును 64 ఏళ్ల తర్వాత ఇవ్వడం విశేషం!



ఆర్టీసీ బంపర్ ఆఫర్

ఆర్టీసీ టి–24 టికెట్లపై మరో రాయితీని ప్రకటించింది. గ్రేటర్‌లో ఇప్పటి వరకు రూ.100 ఉన్న టి–24 టికెట్ ధరలను రూ.90కు తగ్గించింది. 60 ఏళ్లు దాటినవారికి రూ.80కే లభిస్తాయి..-8లో



మెట్రో మార్గంపై అధ్యయనం

రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు ఎయిర్‌పోర్టు మెట్రో పనుల్లో వేగం పెరిగింది. మెట్రో అలైన్‌మెంట్లలోని సమస్యలపై అధికారులు అధ్యయనం చేపట్టారు. -8లో

ఓయూ సెంటినరీ పైలాన్‌కు శంకుస్థాపన



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ శతాబ్ది ఉత్సవాలు జరిగిన ఆరు నంవత్సరాలకు సెంటినరీ పైలాన్ పనులకు బుధవారం వీసీ ప్రొ.రవిందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు.

న్యూస్‌రీల్

కొత్త సచివాలయంలో పచ్చదనంపై దృష్టి



బంజారాహిల్స్: ఆధునిక హంగులతో అద్భుతంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయం ఈ నెల 30న ప్రారంభం కానుంది. ఇక్కడి ఏర్పాట్లను బుధవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–17 అధికారులు పరిశీలించారు. అధికారులతో పాటు సిబ్బంది ఇక్కడ పారిశుద్ధ్య పనులను పరిశీలించడంతో పాటు పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. నూతన సచివాలయంలోకి వివిధ శాఖలు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఆయా అంతస్తుల్లో ఏర్పాట్లను పరిశీలించి తనిఖీలు నిర్వహించారు.

అందుబాటులోకి మరో 'షీ షటిల్' బస్సు



రాయదుర్గం: ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో పనిచేసే మహిళా ఉద్యోగుల కోసం మరో నూతన 'షీ షటిల్' బస్సు సౌకర్యాన్ని ఏడీపీ ఇండియా ఐటీ సంస్థ ఏర్పాటు చేసింది. సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సహకారంతో ఏడీపీ సంస్థ దీనిని ప్రారంభించింది. ఈ బస్సును బుధవారం ఏడీపీ చీఫ్ లీగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ లీడర్ డేవ్‌క్వాన్, జనరల్ మేనేజర్, మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ వేములపల్లి, విపుల్‌సింగ్, సైబరాబాద్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె శిల్పవల్లి, ఎస్‌సీఎస్ అసోసియేట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ నూతన షటిల్‌ను హైటెక్‌సిటీ ఎంఎంటీఎస్ నుంచి ఏడీపీ బౌలెవార్డ్, నానక్‌రాంగూడ మార్గంలో మహిళా ఉద్యోగులు సురక్షితంగా ప్రయాణించేం దుకు అవకాశం కలిగిస్తుంది. ఈ బస్సు ద్వారా ఒకేసారి 40 మంది మహిళా ఉద్యోగులు రాకపోకలు నిర్వహించేందుకు అవకాశం కలుగుతుంది. ఇది వారానికి అయిదు రోజులు, రోజుకు 6–8 ట్రిప్పులు తిరుగుతుంది.

బెట్టింగ్ పేరుతో రూ.70 లక్షలు హాంఫట్

హిమాయత్‌నగర్: తాము చెప్పిన వెబ్‌సైట్‌లో బెట్టింగ్ కాస్తే అతి తక్కువ కాలంలో కోటీశ్వరుల్ని చేస్తామంటూ నగరానికి చెందిన ఓ టెకీకి సైబర్ నేరగాళ్లు వల వేశారు. రెండేళ్ల క్రితం కోటీశ్వరుడిని చేస్తామంటూ వల వేసిన కేటుగాళ్లు.. అప్పటి నుంచి ఆ టెకీ వద్ద డబ్బు లూటీ చేస్తూనే ఉన్నారు. రెండేళ్ల కాలంలో లక్షలాది రూపాయిలు లూటీ చేయడంతో బాధితుడు బుధవారం సిటీ సైబర్‌క్రైం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమాజిగూడకు చెందిన ఓ యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. రెండేళ్ల క్రితం టెలిగ్రామ్ ద్వారా ఓ వ్యక్తి పరిచయమై 'డెఫా' అనే బెట్టింగ్ వెబ్‌సైట్‌లో బెట్టింగ్ కాస్తే అధిక లాభాలు వస్తాయన్నాడు. తొలిరోజుల్లో లాభాలు ఇచ్చి యువకుడిని నమ్మించాడు. ఇలా రెండేళ్లుగా వివిధ గేమ్స్‌పై యువకుడు రూ.70 లక్షలు బెట్టింగ్ కాశాడు. మరిన్ని లక్షలు పెట్టుబడి పెట్టాలంటూ ఒత్తిడి రావడంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరిభూషణరావు తెలిపారు.

శనివారాల్లోనూ పాస్‌పోర్ట్ స్పెషల్ డ్రైవ్

సనత్‌నగర్: పాస్‌పోర్ట్ దరఖాస్తుల డిమాండ్ ఎక్కువ ఉండడంతో శనివారాల్లో సైతం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి దాసరి బాలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి జరిగే స్పెషల్ డ్రైవ్ ద్వారా త్వరితగతిన దరఖాస్తులను క్లియర్ చేస్తామన్నారు. రానున్న శనివారం సాధారణ, తత్కాల్, పీసీసీ వంటి అన్ని కేటగిరీలను కలుపుకొని 3,096 అపాయింట్‌మెంట్లను ఇస్తామన్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట, అమీర్‌పేట, టోలిచౌకిలతో పాటు కరీంనగర్, నిజామాబాద్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లో ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించి ఈ నెల 27 సాయంత్రం 4 గంటల నుంచి పాస్‌పోర్ట్ సేవా వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



అదిగదిగో.. స్కైవాక్

త్వరలో ప్రారంభానికి సిద్ధం
- రూ.25 కోట్ల వ్యయంతో నిర్మాణం
- స్కైవాక్ కోసం 8 లిఫ్టులు, 6 స్టేర్ కేసులు, 4 ఎస్కలేటర్లు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉప్పల్ స్కైవాక్ త్వరలో ప్రారంభం కానుంది. సుమారు రూ.25 కోట్లతో హెచ్‌ఎండీఏ చేపట్టిన ఈ స్కైవాక్ వందేళ్ల పాటు ఏ మాత్రం చెక్కు చెదరని విధంగా ఎంతో పటిష్టంగా ఏర్పాటు చేశారు. స్కైవాక్ నిర్మాణం కోసం వెయ్యి టన్నులకుపైగా స్ట్రక్చరల్ స్టీల్‌ను వినియోగించినట్లు అంచనా. ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద పాదచారులు నలువైపులా సురక్షితంగా రోడ్డు దాటేందుకు ఈ ఆకాశ వంతెన నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. ఇది సుదీర్ఘకాలం మన్నికగా ఉండేందుకు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, వైజాగ్ స్టీల్‌తో పాటు జిందాల్ స్టీల్ కంపెనీలకు చెందిన స్ట్రక్చరల్ స్టీల్‌ను వినియోగించారు. పాదచారుల వంతెన నిర్మాణంలో భాగంగా 8 లిఫ్టులు, 6 మెట్ల మార్గాలు, మరో 4 ఎస్కలేటర్లను ఏర్పాటు చేశారు. ఈ స్కైవాక్ కారిడార్ 660 మీటర్ల పొడవు ఉంటుంది. దీని కోసం 37 పిల్లర్లు వినియోగించారు. ఇది భూమి నుంచి 6 మీటర్ల ఎత్తులో ఉంటుంది. స్కైవాక్ బ్యూటిఫికేషన్ కోసం 40 శాతం వరకు రూఫ్ కవరింగ్ ఏర్పాటు చేశారు. ఉప్పల్ చౌరస్తాలో ప్రతి రోజు నాలుగు వైపులా రాకపోకలు సాగించే సుమారు 20 వేల మందికి పైగా పాదచారులు ఈ స్కైవాక్‌ను వినియోగించుకొనే అవకాశం ఉంది. ఉప్పల్ మెట్రో ప్రయాణికులు ఇకపైన మెట్రో కాన్‌కోర్ నుంచి స్కై వాక్ మీదుగా స్టేషన్‌కు రాకపోకలు సాగించవచ్చు. లిఫ్టులు, మెట్ల మార్గాల పరిసరాల్లో హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ యంత్రాంగం మొక్కలు పచ్చిక బయలతో పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది.

ప్రపంచ దేశాలకు దీటుగా అంతరిక్ష పరిశోధనలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత అధునాతన సాంకేతిక యుగంలో అన్ని దేశాలు అంతరిక్ష పరిశోధనలపైన దృష్టి సారించాయి. భారత్ కూడా ఇస్రో ఆధ్వర్యంలో ఇప్పటికే చంద్రయాన్ వంటి ప్రాజెక్టులను చేపట్టింది. త్వరలో ప్రతిష్టాత్మక గగన్‌యాన్‌ను అంతరిక్షంలోకి పంపించే ప్రయత్నంలో ఉంది. 40 ఏళ్ల క్రితమే భారత్‌కు చెందిన వింగ్ కమాండర్ రాకేష్ శర్మ అంతరిక్షంలో మొదటిసారిగా కాలుమోపారు. సోవియట్ ఇంటర్ కాస్మోస్ ప్రాజెక్ట్‌లో భాగంగా 1984లో అంతరిక్షం చేరిన మొదటి భారతీయ వ్యోమగామిగా రాకేష్ శర్మ చరిత్ర సృష్టించారు. హైదరాబాద్‌లోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసి, నిజాం కళాశాల నుంచి పట్టభద్రులైన రాకేష్ శర్మ అనంతరం స్పేస్ రీసెర్చ్‌లో తన ప్రాతినిధ్యాన్ని పంచుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ 106వ స్థాపకదినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పట్లో అంతరిక్షం నుంచి ప్రధాని ఇందిరాగాంధీతో మాట్లాడినప్పుడు.. అక్కడినుంచి భారత్ ఎలా కనిపిస్తోందని ఆమె అడిగితే.. 'సారే జహాసే అచ్ఛా..'అని చెప్పానంటూ ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అంతరిక్ష యానానికి సంబంధించి రాకేష్‌శర్మ తెలిపిన ఆసక్తికర విషయాలు ఆయన మాటల్లోనే..

భారత తొలి వ్యోమగామి రాకేష్‌శర్మ
- ఇతర గ్రహాలపై మానవ మనుగడ అంత సులువు కాదు
- ప్రస్తుతం గగన్‌యాన్‌పై ఇస్రో దృష్టి
- అంతరిక్షం నుంచి భారత్‌ను చూడటం గొప్ప అనుభూతినిచ్చింది
- మళ్లీ అవకాశం వస్తే వదులుకోను..





ఓయూలో మాట్లాడుతున్న రాకేష్ శర్మ

వనరులు, ప్రత్యామ్నాయ వేదికల అన్వేషణ దిశగా..

భారత్‌లో 40 ఏళ్ల క్రితం ఉన్న సాంకేతికతకు, ప్రస్తుత అధునాతన టెక్నాలజీకి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ప్రపంచ దేశాలకు పోటీగా మారింది. స్పేస్ టెక్నాలజీలో ఎంతో అభివృద్ధి చెంది సొంతగా ఎన్నో విజయవంతమైన ప్రాజెక్టులను చేపట్టింది. ఇందులో ఇస్రో కీలకపాత్ర పోషిస్తోంది. రానున్న ఏడాదిలో ప్రతిష్టాత్మకమైన గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను పంపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు నేను నేషనల్ అడ్వైజరీగా ఉండి పలు అంశాలను పర్యవేక్షిస్తున్నా.

గట్టి పునాదులు వేశారు..

అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి విక్రమ్ సారాభాయ్ వంటి పరిశోధకులు గట్టి పునాది వేశారు. దానిని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉంది. భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే వనరులను అన్వేషించనున్నాయి. భూమిపై పర్యావరణం క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వేదికలను సైతం వెతకనున్నాయి. చంద్రుడిపై మనిషి మనుగడ సాధ్యమే కానీ అది సాకారం కావాలంటే ఎంతో పురోగమించాలి.

అంతరిక్షంలో యోగా చేశా..

అంతరిక్షంలో ప్రయాణించాలంటే ముందే కఠినమైన శిక్షణ తీసుకోవాలి. అంతరిక్ష నౌక ప్రయాణ వేగం భూమ్యాకర్షణ శక్తికి వ్యతిరేకంగా ప్రతి సెకనుకు సున్నా నుంచి ఏడున్నర కిలోమీటర్లు పెరుగుతుంది. ఈ సమయంలో శరీరంపై చాలా ప్రభావం పడుతుంది. గుండె నుంచి వివిధ అవయవాలకు రక్తం సరఫరాపైనా ప్రభావం పడుతుంది. ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారుతుంది. ఇవన్నీ తట్టుకోవడానికి వీలుగా సాధారణ స్థాయి కన్నా నాలుగు రెట్ల వేగంతో రక్త ప్రసరణ జరిగేలా శిక్షణ ఉంటుంది. ఇందుకోసం నేను యోగా సాధన కూడా చేశా.

అవకాశాల్ని యువత అందిపుచ్చుకోవాలి..

అంతరిక్షంలో నేను యోగా చేస్తుంటే దీని ఫలితాలు గమనించి ఒకరిద్దరు తోటి వ్యోమగాములు కొన్ని ఆసనాలను అడిగి మరీ ప్రయత్నించారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా వ్యోమగాములకు సెంట్రిఫ్యూజ్ ఆధారిత శిక్షణ ఇస్తున్నారు. అంతరిక్షం నుంచి భారత్ మిశ్రమ వర్ణాల్లో అద్భుతంగా కనిపిస్తుంది. రాజస్థాన్ బంగారు వర్ణంలో, హిమాలయాలు ఊదా రంగులో కనిపిస్తాయి. వ్యోమనౌక కిటికీ నుంచి భూమిని చూడటం మరిచిపోలేని అనుభూతి. మళ్లీ అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోను. ఓయూలో వనరులు అద్భుతంగా ఉన్నాయి. విద్యార్థులు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి.

పోలీసుల అదుపులోని వ్యక్తి మృతి

గతంలో నిందితుడిపై అనేక కేసులు
- ఐ–ఫోన్ చోరీ కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- తుకారాంగేట్ ఠాణాలోనే తీవ్ర అస్వస్థత
- గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబ సభ్యులు



చిరంజీవి (ఫైల్)

అడ్డగుట్ట/గాంధీ ఆస్పత్రి: ఓ వ్యక్తి దృష్టి మళ్లించి ఐ–ఫోన్ చోరీ చేసిన ఘటనలో అనుమానితుడిగా ఉన్న పాత నేరస్తుడు పోలీసు కస్టడీలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కొట్టడం వల్లే మరణించాడంటూ మృతుడి కుటుంబీకులు ఉత్తర మండల డీసీపీ కార్యాలయంతో పాటు గాంధీ ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. మృతదేహం ఉన్న గాంధీ ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. కస్టోడియల్ డెత్ ఉదంతంపై అంతర్గత విచారణ జరుపుతున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు. పోలీసులు, మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం వివరాలు..

- ఎల్బీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని భూపేష్ నగర్‌కు చెందిన ఆమూరి చిరంజీవి (30) వృత్తి రీత్యా ఆటోడ్రైవర్. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్న ఇతడిపై గతంలో 10కి పైగా సొత్తు సంబంధిత నేరాల కేసులు ఉన్నాయి. తుకారాంగేట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ వ్యక్తి దృష్టి మళ్లించి ఐ–ఫోన్ తస్కరించాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న ఆ ఠాణా క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఘటనాస్థలిలో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్‌ను విశ్లేషించిన అధికారులు అనుమానితుడి ఫొటోలు సేకరించారు. వీటిని పాత డేటాబేస్‌తో సరిపోల్చడంతో పాటు ఇన్‌ఫార్మర్లకు చూపిచడం ద్వారా చిరంజీవిగా గుర్తించారు. ఠాణాకు రమ్మంటూ ఫోన్ చేయగా... వస్తానని చెప్పిన అతడు స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు.
- మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు చిరంజీవిని ఇద్దరు కానిస్టేబుళ్లు అతడి ఇంటి నుంచి అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో కుటుంబసభ్యులు అడ్డుకోగా అర్ధ గంటలో తిరిగి పంపిస్తామని చెప్పి ఠాణాకు తీసుకువచ్చారు. ఆ సమయంలో నేర సమీక్ష సమావేశం జరుగుతుండటంతో అతడికి పోలీసుస్టేషన్‌లో కూర్చోబెట్టారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో ప్రశ్నించడం మొదలెట్టగా కొద్దిసేపటికే ఫిట్స్ రావడంతో చిరంజీవి కిందపడిపోయాడు. గమనించిన అధికారులు తొలుత అతడు నాటకం ఆడుతున్నాడని భావించారు. కొద్దిసేపు వేచి చూడగా అతడు పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో ప్రత్యేక వాహనంలో రాత్రి 9.30 గంటల సమయంలో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడు చికిత్స పొందుతూ చనిపోయాడు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించారు..

విషయం తెలుసుకున్న చిరంజీవి కుటుంబీకులు మంగళవారం అర్ధరాత్రి ఉత్తర మండల డీసీపీ కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు దిగారు. సర్దిచెప్పిన పోలీసులు గాంధీ ఆస్పత్రి మార్చురీలో ఉన్న చిరంజీవి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు చూపించారు. తన కుమారుడి చెవుల నుంచి రక్తం కారిన మరకలు, తల, ఛాతీ భాగంలో గాయాలున్నాయని, పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతోనే చనిపోయాడని చిరంజీవి తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మధ్యాహ్నం గాంధీ ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. మృతుడి కుటుంబ సభ్యులతో పోలీసులు చర్చలు జరిపిన నేపథ్యంలో బుధవారం సాయంత్రం చిరంజీవి మృతదేహానికి పోస్టుమార్టం చేపట్టే ప్రక్రియ నిలిచింది. కాగా.. పోలీసులు మృతుడి కుటుంబీకులతో రూ.20 లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకుని రాజీ చేసుకున్నట్లు సమాచారం.

"విచారణ నిమిత్తం తీసుకొచ్చాం

ఓ కేసులో విచారించేందుకు చిరంజీవిని మంగళవారం సాయంత్రం పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చాం. అప్పటికే అతని ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించాం. చికిత్స పొందుతూ రాత్రి 10 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిరంజీవిపై పోలీసులు చేయి చేసుకోలేదు. – ఎల్లప్ప, తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్



గాంధీ ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

అశ్వంతో దిగి.. నీటిలో మునిగి..

- ఈసీ వాగులో ఇద్దరు యువకులు సహా గుర్రం మృత్యువాత
- కాల్వ నీటిలో హార్స్ రైడింగ్ చేస్తుండగా ప్రమాదం
- రాజేంద్రనగర్ కిస్మత్‌పూర్‌లో ఘటన



సైఫ్, ఆషూసింగ్ మృతదేహాలు

రాజేంద్రనగర్: హార్స్ రైడింగ్‌కు వచ్చిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు ఈసీ వాగు నీటిలో మునిగి మృత్యువాత పడిన ఘటన బుధవారం సాయంత్రం రాజేంద్రనగర్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. నగరంలోని కిషన్‌బాగ్ చిరాగ్‌లేన్ ప్రాంతానికి చెందిన అక్రం కిస్మత్‌పూర్‌లో హార్స్ రైడింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఇందులో ఆయన కుమారుడు మహ్మద్ సైఫ్ (18) హార్స్ రైడింగ్ శిక్షణ ఇస్తున్నాడు. వీరి వద్ద ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆషూసింగ్ (19) ఉద్యోగం చేస్తూ శిక్షణ కేంద్రంలోనే ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం సైఫ్, ఆషూసింగ్‌లు గుర్రంపై స్వారీ చేసుకుంటూ ఈసీ కాల్వ వద్దకు వచ్చారు. కాల్వలోకి దిగి రైడ్ చేస్తుండగా ఆషూసింగ్ గుర్రంపై నుంచి నీటిలో పడిపోవడంతో.. అతడిని కాపాడేందుకు వెళ్లిన సైఫ్ సైతం నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. వాగు నీటిలో మునిగిపోయిన గుర్రాన్ని బయటకు తీసి చూడగా అప్పటికే అది మృతి చెందింది. విషయం తెలుసుకున్న అక్రమ్‌తో పాటు కొందరు హార్స్ రైడర్లు ఘటన స్థలానికి చేరుకుని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్లు కాల్వలోకి దిగి మహ్మద్ సైఫ్, ఆషూసింగ్ మృతదేహాలను వెలికితీశారు. విషయం తెలుసుకున్న సైఫ్ కుటుంబ సభ్యులు, స్నేహితులు ఘటన స్థలానికి చేరుకుని భోరున విలపించారు. సైఫ్‌నకు ఈత వచ్చని వెల్లడించారు. అంతగా లోతులేని కాల్వలో పడి అతను మృతి చెందడం పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకున్నా.. యథేచ్ఛగా శిక్షణ

కిస్మత్‌పూర్‌లో మల్లన్న దేవాలయం, టైమ్స్ స్కూల్ ప్రాంతంలోని హార్స్ రైడింగ్ కేంద్రాలకు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. అయినా వీటిని నిర్వాహకులు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో హార్స్ రైడర్లు స్థానిక బస్తీలు, రహదారులతో పాటు ఈసీ కాల్వ ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో రైడ్స్ చేస్తుంటారు. ఈ విషయమై స్థానికులు గతంలో అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. నివాస ప్రాంతాల్లో ఈ శిక్షణ కేంద్రాలను మూసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒక్కవానకే..

- 250 ప్రాంతాల్లో నీటి నిల్వలు.. కూలిన చెట్లు 33

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ రోడ్ల కోసం ఎన్ని నిధులు ఖర్చు చేస్తున్నా వానొస్తే చాలు గుంతలు పడుతున్నాయి. ఎక్కడికక్కడ నీటి నిల్వలు చేరి రాకపోకలకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రతియేటా నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి సమస్యల్లేకుండా పరిష్కారం చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, వర్షం వస్తే చాలు అనేక ప్రాంతాలు జలమయం కావడంతో పాటు రోడ్లపై మోకాలిలోతు నీళ్లు చేరుతున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన ఒక్క వర్షానికే నీటినిల్వలు ఏర్పడ్డాయంటూ జీహెచ్‌ఎంసీకి కాల్ సెంటర్‌కు దాదాపు 250 ఫిర్యాదులందాయి. ప్రజలు ఫిర్యాదులు చేయని ప్రాంతాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ కాల్‌సెంటర్‌కో, ట్విట్టర్ ద్వారానో ఫిర్యాదు చేసే వారు కొందరే ఉంటారు. బుధవారం ఉదయం 9 గంటల వరకు దాదాపు 250 ఫిర్యాదులందగా, వాటిలో 11 ప్రాంతాల్లో తప్ప మిగతా అన్ని ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించినట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొన్నారు. 33 ప్రాంతాల్లో చెట్లు కూలినట్లు ఫిర్యాదులందగా, వాటిలో 28 ప్రాంతాల్లో కూలిన చెట్లను తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేసినట్లు తెలిపారు. మిగతా 5 ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో గోడలు కూలి ప్రమాదాలు జరిగినా జీహెచ్‌ఎంసీకి మాత్రం అలాంటి ఫిర్యాదు ఒక్కటి కూడా అందలేదు.



ఆశావహులకు నిరాశేనా?

- బల్దియా కోఆప్షన్ సభ్యుల ఎన్నిక అనుమానమే
- చట్ట సవరణ బిల్లును తిప్పి పంపిన గవర్నర్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పాలకమండలిలో కోఆప్షన్ పదవుల కోసం గత రెండేళ్లుగా ఎదురు చూస్తున్న ఆశావహులు నిరాశకు లోనయ్యారు. జీహెచ్‌ఎంసీ కొత్త పాలకమండలి కొలువుదీరి రెండేళ్లు దాటిపోయింది. ఎన్నికల సమయంలో కార్పొరేటర్లుగా టికెట్లు రాని వారికి, ఇతరత్రా కొందరికి కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తామని ప్రభుత్వంలోని ముఖ్యనేతలు హామీ ఇచ్చారు. ఈ మేరకు తాము జీహెచ్‌ఎంసీ పాలకమండలిలో స్థానం పొందగలమని ఎందరో ఎదురు చూస్తున్నారు. నిబంధనల మేరకు కొత్త పాలకమండలి తొలి సమావేశం తర్వాత రెండు నెలల్లోగా కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. కానీ.. అమల్లో ఉన్న చట్టం మేరకు జీహెచ్‌ఎంసీలో అయిదుగురు కోఆప్షన్ సభ్యులకు మాత్రమే అవకాశం ఉంది. అందులో రెండు స్థానాలు మైనార్టీలకివ్వాలి. జీహెచ్‌ఎంసీతో పాటు రాష్ట్రంలోని ఇతర స్థానిక సంస్థల్లోనూ ఎక్కువ మందికి కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలనే తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం కోఆప్షన్ సభ్యుల సంఖ్యను పెంచాలని భావించింది. ఆ మేరకు చట్ట సవరణ కోసం సంబంధిత బిల్లును అసెంబ్లీలో ఆమోదించి, గవర్నర్ ఆమోదం కోసం పంపించారు. ఈ బిల్లు ఆమోదం పొందగానే కోఆప్షన్ ఎన్నిక నిర్వహించాలని గత సెప్టెంబర్ నుంచి ఎదురు చూస్తున్నారు. కానీ.. రాజ్యాంగం మేరకు మైనార్టీ అంటే నిర్దిష్ట ప్రామాణికత ఉండాలని పేర్కొంటూ రాష్ట్ర గవర్నర్ తమిళిసై మున్సిపల్ చట్ట సవరణ బిల్లును ప్రభుత్వానికి తిప్పి పంపడంతో ఆ బిల్లు ఆమోదం పొందేనా? పొందే పక్షంలో అందుకు ఇంకెంత కాలం పడుతుందోనని కోఆప్షన్‌పై ఆశలు పెట్టుకున్న వారు ఉసూరుమంటున్నారు. ఇప్పటికే రెండేళ్ల పదవీయోగం గడచిపోయింది. అసలా బిల్లు ఆమోదం పొందుతుందా.. అందుకెంత కాలం పడుతుందో తెలియని పరిస్థితిలో ఏంచేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

బిల్లుపై నీలినీడలు..

ఈ మున్సిపల్ బిల్లు గవర్నర్ ఆమోదం పొంది చట్ట సవరణ జరిగితే జీహెచ్‌ఎంసీ కో ఆప్షన్ సభ్యుల సంఖ్య 15కు పెరుగుతుంది. అయిదుగురు కోఆప్షన్ సభ్యులుగా ఉన్నప్పుడు ఇద్దరు మైనార్టీలకు అవకాశం ఉండేది. సభ్యుల సంఖ్య 15కు పెరిగితే అదే దామాషాలో మైనార్టీలకు ఆరుగురికి అవకాశం లభిస్తుందని, మున్సిపల్ వ్యవహారాల్లో అవగాహన ఉన్నవారికి 9 మందికి అవకాశం ఉంటుందని మున్సిపల్ నిబంధనల గురించి తెలిసినవారు పేర్కొన్నారు. అంటే అయిదేళ్లపాటు కార్పొరేటర్లుగా కానీ, మేయర్‌గా కానీ, డిప్యూటీ మేయర్‌గా కానీ, మున్సిపల్ చైర్మన్ లేదా వైస్‌చైర్మన్‌గా కానీ పనిచేసిన వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. గెజిటెడ్ అధికారి హోదాలో రిటైరైన వారికి కూడా అవకాశం ఉంటుందన్నారు. మైనార్టీల కోటానే రాజ్యాంగ విరుద్ధమని గవర్నర్ పేర్కొనడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చడంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

మెట్రో మార్గంపై అధ్యయనం

ఎయిర్‌పోర్ట్ మెట్రోకు రాజేంద్రనగర్ గుట్టల్లో అలైన్‌మెంట్‌ను పరిశీలించిన ఎండీ



సాక్షి, సిటీబ్యూరో: రాయదుర్గం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో పనుల్లో వేగం పెరిగింది. ఒకవైపు భూసార పరీక్షలు నిర్వహిస్తుండగానే మరోవైపు వివిధ ప్రాంతాల్లో మెట్రో అలైన్‌మెంట్‌లలోని సమస్యలపై అధికారులు అధ్యయనం చేపట్టారు. ఎయిర్‌పోర్టు చాలా వరకు రోడ్డు మార్గం గుండానే వెళుతున్నప్పటికీ ఒకటి, రెండు చోట్ల గుట్టలపై నుంచి మెట్రో పరుగులు తీయవలసి వస్తుంది. దీంతో కొండలపైన అలైన్‌మెంట్ పైన అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి , సీనియర్ ఇంజినీర్లతో కలిసి రాజేంద్రనగర్ గుట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ గుట్టపై పైన సుమారు 1.3 కి.మీ పొడవుగల విమానాశ్రయ మెట్రో అలైన్‌మెంట్ నిర్మాణం కోసం కసరత్తు చేపట్టారు. ఈ మార్గంలో నిటారుగా ఉండే ఎత్తులు, బండరాళ్లు, లోయలు ఉండడం వల్ల మెట్రో వయాడక్ట్ నిర్మాణం చాలా కష్టమైన పని అని ఈ సందర్భంగా ఎండీ అభిప్రాయపడ్డారు.ఈ మార్గాన్ని పరిశీలించిన అనంతరం కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు.

- మెట్రో అలైన్‌మెంట్, ఔటర్‌రింగ్‌రోడ్డు క్రాష్ బారియర్ మధ్య దాదాపు 18 అడుగుల గ్యాప్ మాత్రమే ఉంది.దీంతో ఔటర్ లోతైన కటింగ్‌లో ఉన్నందున వల్ల అటువైపు ఎటువంటి బండరాళ్లు పడకుండా తగిన బలం, ఎత్తుతో కూడిన రక్షణ బ్యారియర్లను అమర్చాలని ప్రతిపాదించారు.
- ఈ మార్గంలో మెట్రో అలైన్‌మెంట్‌కు బౌల్డర్ స్టెబిలైజేషన్ పద్ధతులను నిపుణులతో సంప్రదించి అవలంబించాలి;
- గుట్టపై నుంచి వెళ్లేటప్పుడు మెట్రో వయాడక్ట్‌ను రక్షించేందుకు విమానాశ్రయం మెట్రో కుడి ఎడమ వైపున రక్షిత ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలి.దీనివల్ల సంఘవిద్రోహ శక్తుల నుంచి రక్షణ లభిస్తుంది.
- విమానాశ్రయ మెట్రో ప్రాంతంలో ఎలాంటి ఆక్రమణలు చోటుచేసుకోకుండా నియంత్రించేందుకు హెచ్‌ఎండీఏ సహకారంతో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయవలసి ఉంటుంది.
- కొండపైన రాయిని తొలగించవలసిన అవసరం లేకుండా స్టబ్‌లు లేదా తక్కువ ఎత్తు ఉన్న స్తంభాలపై మెట్రో వయాడక్ట్‌ను నిర్మించే అంశాన్ని పరిశీలించాలి.

క్రాస్ డ్రెయిన్‌ల ఏర్పాటు...

- మరోవైపు ఔటర్ డ్రైనేజీ వ్యవస్థలోకి వర్షపు నీరు ప్రవహించేలా కొండపైన హెచ్‌ఏఎంఎల్ నిర్మించిన తాత్కాలిక రహదారి లోయ పాయింట్ల వద్ద తగినంత వ్యాసార్థంతో కూడిన హ్యూమ్ పైపులతో క్రాస్ డ్రెయిన్‌లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.
- అలాగే కొండపై దాదాపు 300 మీటర్ల వరకు విస్తీర్ణంలో చేపట్టిన తాత్కాలిక రహదారిని త్వరలో పూర్తి చేయాలని ఎన్వీఎస్ రెడ్డి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎయిర్ పోర్ట్ మెట్రో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ ఇంజనీర్ సాయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల క్షేమం కోసమే ఆరోగ్య శిబిరాలు

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఎండీ దానకిశోర్ అభిప్రాయపడ్డారు. జలమండలిలో పనిచేసే ఉద్యోగుల కోసం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగుల క్షేమం కోసం ఏటా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బోర్డు పరిధిలో పనిచేసే ఉద్యోగులందరూ తప్పనిసరిగా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ప్రధాన కార్యాలయంతో పాటు ఎస్.ఆర్.నగర్, గోషామహల్, మారేడ్‌పల్లి, పటాన్‌చెరు కార్యాలయాల్లో దశలవారిగా ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తామని వివరించారు.

మొత్తం 21 రకాల పరీక్షలు : వైద్య శిబిరాల్లో.. సీబీపీ, ఈసీజీ, 2డీ ఈకో, టీఎంటీ, చెస్ట్ ఎక్స్ రే వంటి వాటితో కలిపి మొత్తం 21 రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. బుధవారం నుంచి శనివారం వరకు బోర్డు ప్రధాన కార్యాలయంలో, వచ్చే నెల 3 నుంచి 6 వరకు ఎస్ ఆర్ నగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో, 10 నుంచి 13 వరకు గోషామహల్ డిస్పెన్సరీలో, 17 నుంచి 20 వరకు మారేడు పల్లి డివిజన్ ఆఫీసులో, 24 – 27 వ తేదీ వరకు పటాన్ చెరు జలమండలి కార్యాలయంలో శిబిరాలు జరుగనున్నాయి. ఈ సమయంలో అందుబాటులో లేని వారి కోసం తిరిగి మే 31 నుంచి జూన్ 3 వ తేదీ వరకు బోర్డు ఆఫీసులో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

నగరంలో ఎల్లో అలెర్ట్..!

మరో ఐదు రోజుల పాటు వర్షాలు పడే సూచనలు

సాక్షి, సిటీ బ్యూరో: వాతావరణంలో నెలకొన్న ద్రోణి ప్రభావంతో హైదరాబాద్ నగరంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. మరో 5 రోజులు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఇప్పటికే 24 గంటల వ్యవధిలో పటాన్‌చెరులో రికార్డు స్థాయిలో 10.9 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. చార్మినార్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ సికింద్రాబాద్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉందని హెచ్చరించింది. శుక్ర, శనివారాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది.

ఆటపాటలతో ఆకట్టుకున్న ట్రైనీ అధికారులు



నృత్యాలు చేస్తున్న ట్రైనీ అధికారులు

బంజారాహిల్స్: కాబోయే ఉన్నతాధికారులంతా తమ ఆటపాటలతో అదరగొట్టారు, జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో శిక్షణ పొందుతున్న సెంట్రల్ సివిల్ సర్వీస్ ఆఫీసర్లు బుధవారం ఆర్ట్–సంఖ్య–కళ అనే థీమ్‌తో సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. కల్చరల్ ఈవెనింగ్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 90 మంది ట్రైనీ అధికారులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఆ రాష్ట్ర సంప్రదాయకళ లెజిమ్ అండ్ లావునీతో పాటు రాజస్థాన్ భాంగ్రా, పంజాబ్ ఆర్ట్‌గిడ్డ, అస్సాం సంప్రదాయ బిహు, ఉత్తరఖాండ్ పహాడి విశేషంగా ఆకట్టుకున్నాయి. శాస్త్రీయ భరతనాట్యం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆటపాటలే కాకుండా తమ ప్రాంతాల సంప్రదాయ దుస్తులు, ఆభరణాలు ధరించి ఈ కార్యక్రమానికి మరింత వన్నె తీసుకొచ్చారు. ఆయా రాష్ట్రాల జానపద పాటలను కూడా పాడి ఆకట్టుకున్నారు. దేశంలోని వివిధ మతాలు, భాషలకు చెందిన వీరంతా తమతమ ప్రాంతాల సంప్రదాయక కళలను కళ్లకు కట్టారు. కార్యక్రమంలో ఐఎస్ఎస్ అధికారి బంటికుమార్, కౌస్తుబ్ రాజ్‌పుత్, ప్రజ్ఞ ప్రతిష్ట, రంజనా షైనీ, నిఘర్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించిన మంత్రి సత్యవతి రాథోడ్



కెఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

మాదాపూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని తెలంగాణ గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని కేఎల్ హెచ్ గ్లోబల్ బిజినెస్‌స్కూల్ కాన్ఫరెన్స్ హాల్‌ను, లైబ్రరీ క్యాంపస్‌ను బుధవారం నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. కెఎల్‌ఈఈఈఈ(ఫేజ్–3), కేఎల్‌ఎంఎటీ ఫలితాలను విడుదల చేశారు. ఈసందర్భంగా కేఎల్‌డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ చాన్సలర్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ మౌళిక సదుపాయాలను నిరంతరం మెరుగుపరచడం, విజ్ఞానాన్ని అందించడమే కాకుండా కాన్ఫరెన్స్ హాల్ విద్యార్థులలో ఉత్తేజాన్ని నింపుతుందన్నారు. కేఎల్‌ఈఈఈఈ పరీక్షల కౌన్సిలింగ్ ప్రక్రియ ఏప్రిల్ 27న విజయవాడ, హైదరాబాద్‌లలో ఉన్న రెండు క్యాంపస్‌లలో ప్రారంభమవుతుందన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల నిర్మూలనకు ఏం చర్యలు తీసుకున్నారు?

మీర్‌పేట్ చెరువు పిటిషన్‌లో సర్కార్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం మీర్‌పేట పెద్ద చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ పరిధిలో ఆక్రమణల నిర్మూలనకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. జూలై 20వ తేదీలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, కందుకూరు ఆర్డీవో, బాలాపూర్ తహశీల్దార్ తదితరులను ఆదేశించింది. అక్రమ నిర్మాణాల వెనుకున్న అధికారులు, ఇతరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన పద్మమ్మ హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. 'ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిని ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడమే కాకుండా.. మట్టి, ఇతర నిర్మాణ సామగ్రిని డంపింగ్ చేయడంతో పెద్దచెరువు నాలాలు పూర్తిగా మూతపడిపోయాయి. చెరువులో చెత్త డంపింగ్ ద్వారా పర్యావరణ చట్టాల ఉల్లంఘన జరుగుతోంది. సుప్రీంకోర్టు, హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను పాటించడంలేదు' అని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బొల్లు రచనారెడ్డి వాదనలు వినిపించారు. వాదనల అనంతరం ధర్మాసనం విచారణను వాయిదా వేశారు.

హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్న ఆదేశాలివీ...

- మీర్‌పేట పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, శిఖం పరిధిలో సర్వే నంబర్ 46, 61లోని ఆక్రమణను తొలగించాలి.
- ఎఫ్‌టీఎల్ భూములకు రక్షణ కల్పిస్తూ, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో నాలాను క్లియర్ చేయాలి.
- చెరువు అభివృద్ధికి కమిటీని ఏర్పాటు నియమించాలి.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

పంజగుట్ట: రాష్ట్రంలో 2012 నుంచి కార్మికులకు జీతాలు పెరగలేదని, 2021లో కనీస వేతన జీవో ఇచ్చారు కాని గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో ఆ జీవో అమలు కావడంలేదని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. హింద్ మజ్దూర్ సంఘ్ (హెచ్‌ఎమ్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల బతుకులకు భద్రత లేకుండా పోయాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ అనుగుణంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని సంఘాల నాయకులు కార్మికుల సమస్యలపై త్వరలోనే ఇందిరాపార్క్ వద్ద ఒకరోజు దీక్ష చేద్దామని తీర్మానించాయి. హెచ్‌ఎమ్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్, కార్యదర్శి కానుగంటి రాజుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోదండరామ్ మాట్లాడుతూ .. గతంలో రెగ్యులర్ ఉద్యోగులు ఎక్కువగా ఉండేవారని కాని ప్రస్తుతం అన్ని శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెరిగిపోయారని తెలిపారు. తెలంగాణ వస్తే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ లేకుండా చేస్తామని అప్పుడు నాయకులు ప్రగల్భాలు పలికారని, ఇప్పుడు ఓట్లకోసం ఇంటికి వస్తే నిలదీయాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తరువాత కార్మిక సంఘాల్లో పోరాట పటిమ పోయిందని రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సంఘాలు ఐక్యమై పోరాడితేనే మన సమస్యలు సాధించుకోగలమన్నారు.నూతన జీతాల గెజిట్ నోటిఫికేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు,రాష్ట్ర ప్రధానకార్యదర్శి జనార్థన్, ఉపాధ్యక్షులు అరుణ, వివిధ సంఘాల నాయకులు సూర్యం, క్రాంతి కుమార్, చంద్రశేఖర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హైలెవల్ కమిటీ సిఫార్సుల అమలుకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో వీధికుక్కల బెడద నివారణకు హైలెవల్ కమిటీ సిఫార్సుల మేరకు జీహెచ్‌ఎంసీ చర్యలకు సిద్ధమైంది. మాంసం దుకాణాలు, మాంసాహార విక్రయ కేంద్రాలు, తదితర ప్రాంతాల్లోనివ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చర్యలు చేపట్టారు. జీహెచ్‌ఎంసీ ఆమోదించిన ఏజెన్సీకే సదరు వ్యర్థాలను ఇవ్వాలని, లేని పక్షంలో చర్యలు తప్పవంటూ 4001 హోటళ్లు, తదితర సంస్థలకు నోటీసులు జారీ చేశారు. వేసవిలో కుక్కల దాహం తీర్చేందుకు స్వచ్ఛందసంస్థలు, వ్యక్తుల సహకారంతో నీటిని ఉంచే ప్రదేశాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 2453 ప్రాంతాల్లో ఈ ఏర్పాట్లు చేసినట్లు మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

పిట్టగోడ కూలి చిన్నారి మృతి

నిర్లక్ష్యంగా గోడకట్టిన తాపీమేస్త్రి అరెస్ట్



పిట్టగోడ కూలి మృతి చెందిన చిన్నారి జీవనిక



అరెస్ట్ అయిన వెంకటరమణ

బంజారాహిల్స్: నాణ్యత లేకుండా నిర్లక్ష్యంగా పిట్టగోడ నిర్మించి చిన్నారి మృతికి కారకుడైన తాపి మేస్త్రిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. రహమత్‌నగర్ సమీపంలోని ఎస్పీఆర్ హిల్స్ ఓంనగర్‌లో నివసించే ఆవుల శ్రీకాంత్‌కు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు శర్వనికకు రెండున్న సంవత్సరాలు, రెండో కూతురు జీవనిక 8 నెలలు. మంగళవారం రాత్రి 8.15 గంటల సమయంలో చిన్నారి జీవనికను ఒక గదిలో పడుకోబెట్టి తాను, భార్య, పెద్దకుమార్తెతో కలిసి మరో గదిలో అన్నం తింటున్నారు. ఆ సమయంలోనే పక్కనే ఉన్న మూడంతస్తుల భవనంపై ఉన్న పిట్టగోడ కూలి తమ ఇంటి ఆస్‌బెస్టాస్ రేకులపై ఇటుకలు పడ్డాయన్నారు. దీంతో రేకులు పగిలిపోయి ఒక ఇటుక తాము తింటున్న పక్కనే పడిందని, కొద్ది సేపటిలోనే ఇటుకలన్నీ తన రెండో కూతురు జీవనిక పడుకున్న గదిపైన రేకులపై పడటంతో రేకులు కుప్పకూలి తన కూతురిపై పడ్డాయని, ఆందోళనతో తాము గదిలోకి వెళ్లి చూడగా, సిమెంటు రేకులు, ఇటుకలు నిద్రిస్తున్న తన కూతురుపై పడ్డాయని దీంతో రక్తస్రావం జరిగిందన్నారు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే తన కుమార్తె చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. ఇదే పిట్టగోడ కూలి తన ఇంటి పక్కనే ఉండే దాసరి గణేష్ అనే వ్యక్తి ఇంటిపై కూలి అతని తల, చేతులకు స్వల్పగాయాలయ్యాయన్నారు. పక్కనే ఇంటిని అసంపూర్తిగా నిర్మించి గోడలకు ప్లాస్టరింగ్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి తన కూతురు ప్రాణాలు తీసిన తాపీమేస్త్రి వెంకటరమణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటరమణపై జూబ్లీహిల్స్ పోలీసులుకేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఆర్టీసీ బంపర్ ఆఫర్

- రూ. 90కే టి- 24 టికెట్
- సీనియర్ సిటిజన్లకు రూ.80కే

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ టి–24 టికెట్లపై మరో రాయితీని ప్రకటించింది. గ్రేటర్‌లో రాకపోకలు సాగించేందుకు ఇప్పటి వరకు రూ.100 ఉన్న టి–24 టికెట్ ధరలను రూ.90కు తగ్గించింది. 60 ఏళ్ల దాటిన సీనియర్ సిటిజన్లకు టికెట్లు రూ.80కే లభిస్తాయి. వారికి 20 శాతం రాయితీ వర్తించనుంది. వయసు ధ్రువీకరణ కోసం సీనియర్ సిటిజన్లు తమ ఆధార్ కార్డును బస్ కండక్టర్లకు విధిగా చూపించాల్సి ఉంటుంది. గురువారం నుంచే ఈ రాయితీలు అమల్లోకి రానున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. టి–24 టికెట్లపై సిటీ ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో 24 గంటల పాటు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. మొదట్లో ఆ టికెట్ ధర రూ.120 వరకు ఉండేది. ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించేందుకు రూ. 100కి తగ్గించారు. తాజాగా సాధారణ ప్రయాణికులకు టి–24 టికెట్ ధరను రూ.90కి, సీనియర్ సిటిజన్లకు రూ.80కి తగ్గిస్తూ ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. ఎండాకాలంలో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేందుకు ఈ రాయితీని కల్పిస్తున్నట్లు ఎండీ తెలిపారు. ఈ టికెట్లకు ప్రయాణికుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందని, ప్రతి రోజు సగటున 25 వేల వరకు అమ్ముడవుతున్నాయని పేర్కొన్నారు. మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం రూ.50కే లభించే టి–6 (ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు) టికెట్లకు కూడా మంచి ఆదరణ ఉందన్నారు.

రికవ'రీ'ల్లోనే తప్పటడుగులు!

- అనేక లాకప్, కస్టోడియల్ డెత్‌లకు రికవరీలే కారణం
- చట్టంలోని విధానానికి పోలీసు అధికారుల పెద్దపీట
- సొత్తు స్వాధీనం కోసం అనివార్యమైన అక్రమ నిర్బంధం
- ఇప్పటికీ పూర్తి సాంకేతికత పట్టని క్రైమ్ విభాగం సిబ్బంది
- 'గ్రేటర్'లో కలకలం సృష్టించిన తుకారామ్‌గేట్ ఉదంతం

సాక్షి, సిటీబ్యూరో: ఓ నిందితుడిని అరెస్టు చేసినప్పుడు అతడి వద్ద, పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించినప్పుడు అతడు చెప్పిన ప్రాంతం నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవాలి. – చట్ట ప్రకారం దీన్నే రికవరీగా పిలుస్తారు.

- సొత్తు సంబంధిత నేరాల్లో నిందితుడిని అరెస్టు చేస్తే సరిపోదు.. అతడు చోరీ చేసిన మొత్తం లేదా వీలైనంత ఎక్కువ స్వాధీనం చేసుకుని బాధితుడికి న్యాయం చేయడం అనివార్యం. – పోలీసు ఉన్నతాధికారుల దృష్టిలో రికవరీ అంటారు.
- ఈ రికవరీల కోసం అనేక పాట్లు పడుతున్న క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు అనుమానాలు/నిందితులను అక్రమంగా నిర్బంధించాల్సి వస్తోంది. దీని కారణంగానే కొన్నిసార్లు లాకప్ డెత్, కస్టోడియల్ డెత్ వంటి ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా పోలీసులతో పాటు ప్రభుత్వానికి మాయని మచ్చలవుతున్నాయి. నార్త్‌జోన్ పరిధిలోని తుకారామ్‌గేట్ ఠాణాలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న చిరంజీవి ఉదంతం గ్రేటర్ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ పరిస్థితులకు సంస్థాగత లోపాలకు తోడు అనేక అంశాలు కారణంగా మారుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

నిర్బంధించకుంటే కష్టమే..

సాధారణంగా ఏదైనా కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న అనుమానితులను 24 గంటల్లో అరెస్టు చేయడమో, విడిచిపెట్టడమో చేయాల్సి ఉంటుంది. అనుమానితుడే నిందితుడిగా తేలితే అరెస్టు చేసిన 24 గంటల్లో కోర్టులో హాజరుపరచాలి. ఇతర ప్రాంతాల్లో పట్టుకున్నప్పుడు ప్రయాణ కాలం తదితరాలు వీటికి అదనం. చోరీ, దోపిడీ, బందిపోటు దొంగతనం వంటి సొత్తు సంబంధిత నేరాల్లో ఈ నిబంధన పక్కాగా అమలు కాదు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు ఉన్నతాధికారులు నిర్దేశించిన రికవరీ టార్గెట్లు చేరుకోవడానికి క్షేత్రస్థాయి సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో తప్పులు చేస్తుంటారు. అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచిన తర్వాత రికవరీలు సాధ్యం కాదన్నది పోలీసుల మాట. ఈ నేపథ్యంలో తమ పనితీరుకు ప్రామాణికంగా మారుతున్న రికవరీల కోసం అనుమానితులు, నిందితులను అక్రమంగా రోజుల తరబడి నిర్బంధిస్తారు. వారిని వివిధ రకాలుగా ఇంటరాగేషన్ చేస్తూ రికవరీలకు ప్రయత్నిస్తారు. ఇలాంటి సందర్భాల్లోనే అపశ్రుతులు చోటుచేసుకుంటున్నాయి.

'ఆసిఫ్‌నగర్' అధికారులే మంచి కేస్ స్టడీ..

అత్యధిక సందర్భాల్లో రికవరీల కోసం అక్రమంగా నిర్బంధిస్తుండగా... అనుమానితుడు నేరం అంగీకరించేలా చేయడానికి పోలీసులు తీసుకునే చర్యలు మరో ఎత్తు. సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు 'ఎవిడెన్స్ టు అక్యూజ్' అనే విధానం అవలంబిస్తాయి. అంటే.. ఏదైనా కేసు దర్యాప్తు ప్రారంభించిన తర్వాత పక్కా ఆధారాలు సేకరించి ఆ తర్వాతే నిందితులను అదుపులోకి తీసుకోవడం, అరెస్టు చేయడం వంటివి చేస్తాయి. పోలీసులు మాత్రం 'అక్యూజ్డ్ టు ఎవిడెన్స్' పంథాలో పని చేస్తారు. అనుమానితుడు/నిందితుడిని పట్టుకుని వారి నుంచే ఆధారాలు సేకరించాలని భావిస్తూ ఇబ్బందులు తెచ్చుకుంటారు. ఈ అంశంలో క్షేత్రస్థాయి క్రైమ్ అధికారులు పూర్తి స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవట్లేదు. ఆసిఫ్‌నగర్ డివిజన్ పోలీసులు గతేడాది అనుసరించిన విధానం ఓ బెస్ట్ కేస్ స్టడీగా చెప్పుకోవచ్చు. స్నాచింగ్ కేసుల్లో అనుమానితుడి పట్టుకున్నాక ఎలాంటి ఇంటరాగేషన్ లేకుండా నిజం రాబట్టారు. అతడి ఫోన్‌లోని గూగుల్ టైమ్‌లైన్ ఆధారంగా ఎక్కడ నేరాలు చేశారో గుర్తించి చూపించారు. అతడు నేరం అంగీకరించక తప్పలేదు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అవార్డును గెల్చుకున్న ఈ దర్యాప్తు ఈ తరం అధికారులకు ఉత్తమ కేస్ స్టడీగా నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మూస ధోరణిగా మారింది

ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఇంటరాగేషన్ తర్వాతే నేరం ఒప్పించడం, సాక్ష్యాధారాలు సేకరించడం, రికవరీలు చేయడం... పోలీసు విభాగంలో ఇదో మూస ధోరణిగా మారిపోయింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వినిపిస్తున్న ఫ్రెండ్లీ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అన్ని చోట్లా లేదు. ఉన్నతాధికారులు కూడా రికవరీలకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తూ సిబ్బంది, అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇవన్నీ వెరసీ 'డెత్'లకు కారణమై చివరకు వీళ్లే బలి పశువులుగా మారుతున్నారు. ఎందుకంటే... రికవరీ చేయమని చెప్పి అధికారిపై ఎలాంటి చర్యలు ఉండకపోయినా... చేయడానికి ప్రయత్నిస్తూ అపశ్రుతులకు కారణమైన వారిపై కచ్చితంగా ఉండటమే కారణం.

– ఆర్. ప్రతాప్ కుమార్, మాజీ డీఎస్పీ

క్లుప్తంగా...

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు క్యారం బోర్డును అందజేస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ పరిణితి సాధించాలని కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... చదువుతో పాటు చెస్, క్యారమ్స్ ఇతర క్రీడలు ఆడుతుంటే అన్ని విధాలా విద్యార్థులు చలాకీగా ఉంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింగ్‌గౌడ్, పవన్‌కుమార్, అక్షిత్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కంజర్ల మణెమ్మ యాదవ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్లు సదాశివయాదవ్, శ్రీనివాసయాదవ్

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ వ్యవస్థాపకురాలు కంజర్ల మణెమ్మ యాదవ్ వర్ధంతి వేడుకలను బుధవారం గోకుల్ థియేటర్ ప్రాంగణంలో మాజీ కార్పొరేటర్లు కంజర్ల సదాశివయాదవ్, కంజర్ల శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేతలు దయానంద్, ఆకుల మహేష్, నక్క శ్రీనివాసగౌడ్ క్రాంతికుమార్, సుమన్, సునీల్, రమణ, లక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రోహిణ్‌రెడ్డి

ఫిలింనగర్: వేసవిలో పాదచారులు, వాహనదారులు దాహంతో ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో తన తల్లి స్మారకార్థం సూర్యకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డి తెలిపారు. స్థానికులకు ఎల్లవేళలా మంచినీరు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను పరిరక్షించుకోవాలి

లిబర్టీ: పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కనకమామిడి శ్రీశైలంగౌడ్ కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. పోరాటం చేసి సాధించుకున్నామని ఆ చట్టాలను పరిశ్రమల అధిపతులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం మార్చేసిందని ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని మే 1న పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1వ తేదీన ఉదయం 9.30 గంటలకు బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్మిక హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

యువతి అదృశ్యం



నిఖిత

బంజారాహిల్స్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 74లోని ప్రశాసన్‌నగర్‌లో ఓ ఇంటికి శకుంతల, అశోక్ దంపతులు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే భార్యాభర్తలు పనులకు వెళ్లగా ఇంట్లో ఉన్న ఎ.నిఖిత అలియాస్ సుబ్బు(19) ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు అన్ని ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ దొరకలేదు. గతంలో కూడా ఇలాగే అనుమానాస్పదంగా అదృశ్యం కాగా పోలీసులు పట్టుకొని అప్పగించారని, మరోసారి అదృశ్యమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతి ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 91339 93129లో సంప్రదించాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

సందడిగా వేసవి శిక్షణ శిబిరాలు

- జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపుల ప్రారంభం
- తక్కువ ఫీజు.. అనుభవం ఉన్న వారితో శిక్షణ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



సమ్మర్ కోచింగ్ క్యాంపులో విద్యార్థుల విన్యాసాలు

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధి కిందకు వచ్చే ఖైరతాబాద్, సోమాజిగూడ, అమీర్‌పేట, సనత్‌నగర్, జూబ్లీహిల్స్ సర్కిల్–18 కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్లతోపాటు సర్కిల్–12, 13, 14 పరిధిలోకి వచ్చే అన్ని డివిజన్ల యువతీయువకులు, బాలబాలికలు ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపులను వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ సూచించారు.

> జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి మే 31 వరకు 37 రోజులపాటు సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహించనున్నారు. విక్టరీ ప్లే గ్రౌండ్‌తోపాటు వివిధ స్టేడియాలు, మైదానాల్లో సమ్మర్ కోచింగ్ క్యాంపు–2023ని విజయవంతం చేసే దిశలో జోనల్ పరిధిలోని అన్ని సర్కిళ్ల డీఎంసీలు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

44 రకాల క్రీడలు

క్యాంపులలో 44 రకాల క్రీడలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకోసం ప్రత్యేకంగా సెంటర్లను కేటాయించారు. ఉదయం 6.15 నుంచి 8.15 గంటల వరకు శిక్షణ ఇస్తారు. శిక్షణను 6 నుంచి 16 సంవత్సరాలలోపు బాలబాలికలను జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ ప్లే గ్రౌండ్‌లలో ఇవ్వనున్నారు. ఇందుకోసం 77 మంది పార్ట్‌టైం కోచ్‌లను, 712 మంది హానరోరియం కోచ్‌లను నియమించారు. స్పోర్ట్స్ కోచ్ క్యాంపులో రిజిస్ట్రేషన్ కోసం రూ. 50 ఫీజు చెల్లించాలి. షటిల్ బ్యాడ్మింటన్, రోలర్, స్కేటింగ్, క్రికెట్, టెన్నిస్ ఇతర ఆటలకు రూ. 10తో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఖైరతాబాద్ జోన్‌లో ఏడుగురు గేమ్స్ ఇన్‌స్పెక్టర్లు అందుబాటులో ఉన్నారు. క్రికెట్, బాస్కెట్ బాల్, కరాటే, స్కేటింగ్, హాకి, రెజ్లింగ్, తైక్వాండో, హ్యాండ్‌బాల్, స్కైమార్షల్, వాలీబాల్ తదితర ఆటలను ఇందులో ప్రవేశపెట్టారు.

మంచి అవకాశం

వేసవిలో విద్యార్థులు ఖాళీగా ఉండకుండా ఈ క్యాంపులను వినియోగించుకోవడం ద్వారా ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవడంతోపాటు సెలవులు వృథా పోకుండా సద్వినియోగం చేసుకున్న వారవుతారు. అతితక్కువ ఫీజుతో అనుభం ఉన్న కోచ్‌లతో క్రీడలు కొనసాగిస్తున్నారు. ఇది విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుంది. ప్రైవేట్ కోచ్‌ల వద్దకు వెళ్లి వేలాది రూపాయలు వృథా చేసుకోవడం కంటే జీహెచ్ఎంసీ సమ్మర్ క్యాంపులను ఉపయోగించుకోవడం ద్వారా డబ్బును ఆదా చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలో సుమారు 4 వేల నుంచి 5 వేల మందికి యువతీయువకులు, బాలబాలికలకు క్యాంపులు ఉపయోగపడనున్నాయి.



గురుకులాల ఏర్పాటులో తెలంగాణ టాప్

- మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్
- గురుకులాల ఆల్ ఇండియా ఓపెన్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నీ ప్రారంభం



జాతీయ చెస్ టోర్నీని ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్

వెంగళరావునగర్: దేశంలోనే ఎక్కడా లేని విధంగా వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేసి అగ్రస్థానంలో కొనసాగుతున్న ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ గురుకులాల ఆల్ ఇండియా ఓపెన్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌ను బుధవారం మంత్రులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గడచిన ఏడు దశాబ్దాల కాలంలో 270 మాత్రమే గురుకుల పాఠశాలలు ఉండగా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ వాటి సంఖ్యను వెయ్యికి పెంచారన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని గురుకులాల్లో క్వాలిఫైడ్ టీచర్లను ఏర్పాటు చేసి పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు, అత్యంత నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో ఈ గురుకులాల్లో చదివే వారు క్రీడలే కాకుండా అన్ని రంగాల్లో ముందుంటారని స్పష్టం చేశారు. గతంలో ఈ హాస్టల్స్‌లో అధిక శాతం సీట్లు ఖాళీలు ఉండేవి ప్రస్తుతం గురుకులాల్లో సీట్ల కోసం పెద్ద ఎత్తున సిఫార్సు చేస్తున్నారన్నారు. రికమెండేషన్స్ ద్వారా సీట్లు రావని చెబుతున్నా వినే పరిస్థితుల్లో తల్లిదండ్రులు లేరంటే అంతగా ఈ స్కూల్స్‌లో విద్య, ఆహారం అందిస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ... ఈ క్రీడలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 571 మంది క్రీడాకారులు హాజరయ్యారని, ఐదురోజుల పాటు 9 రౌండ్లలో పోటీలు ఉంటాయన్నారు. 103 ప్రైజులు, 105 ట్రోఫీలతోపాటు రూ. 5 లక్షల వరకు నగదు బహుమతిని చివరిరోజున విజేతలకు అందించనున్నామని స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌లక్ష్మణ్ వివరించారు. చీఫ్ ఆర్బిటర్ చంద్రమురళి, సోషల్ వెల్ఫేర్ ఓఎస్‌డీ చంద్రకాంత్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ శారద, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ధరణి పోర్టల్‌పై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం’



మాట్లాడుతున్న జట్సన్

పంజగుట్ట: ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న ఫిర్యాదులను నాలుగు వారాల్లో పరిష్కరించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకుడు బక్కా జట్సన్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ధరణి పోర్టల్ ప్రారంభించిన తర్వాత రెవెన్యూ కార్యాలయాల్లో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ధరణి పోర్టల్ లోపాలు, సీసీఎల్ఏ నిర్లక్ష్యంపై హైకోర్టుకు రోజూ 30 ఫిర్యాదులు వస్తున్నాయని న్యాయమూర్తి వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. చాలా దరఖాస్తులను ఎందుకు రిజెక్ట్ చేస్తున్నారో చెప్పడంలేదని కూడా న్యాయమూర్తి వ్యాఖ్యానించడం అభినందనీయమన్నారు. ఈడీ ఆధీనంలో ఉన్న సత్యం రామలింగరాజుకు చెందిన 500 ఎకరాల భూములను కూడా ధరణి ద్వారా కొందరు పెద్దలు అమ్ముకున్నారని... ఇదే విషయం తాను ఈడీకి, సీబీఐకి ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు. ఇప్పటికైనా ధరణి ద్వారా ఎవరు లాభపడ్డారు, ఎవరు ఎంత సంపాదించారో బయటకు తీయాలని, అవినీతి వెనుక ఉన్న ప్రతి అధికారిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు లక్ష్మణ్ యాదవ్, పాండురంగారెడ్డి, శషాంక్ తదితరులు పాల్గొన్నారు.

మూర్తి మహరాజ్ సేవలు చిరస్మణీయం



నివాళులర్పిస్తున్న నాయకులు

రహమత్‌నగర్: సంఘ సేవకుడిగా, ప్రతికా సంపాదకులుగా, మానవ హక్కుల సంఘం నాయకుడిగా మూర్తి మహరాజ్ అందించిన సేవలు ఎనలేనివని ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ నాయకులు కొనియాడారు. శ్రీరాంనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మూర్తి మహరాజ్ సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ మామిళ్ల నాగేష్ మాట్లాడుతూ... వయోభారాన్ని లెక్క చేయకుండా మానవ హక్కుల సంఘం మీడియా సెల్ కన్వీనర్ హోదాలో మూర్తి మహరాజ్ అనేక సేవలు అందించాలని గుర్తుచేశారు. స్వచ్ఛందగా సేవలందిస్తూ మూర్తి మహరాజ్ మానవ హక్కుల సంఘం జాతీయ నాయకులు మన్ననలు పొందారన్నారు. నగర అధ్యక్షుడు సయ్యద్ మేరాజ్ అలీ మాట్లాడుతూ... మూర్తి మహరాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సీనియర్ ఉర్దూ పాత్రికేయులు నసీర్ ఖాద్రీ, స్థానిక నాయకులు, మానవ హక్కుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రంలో మరోసారి బీజేపీకే అధికారం



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: కేంద్రంలో మరోసారి ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ అత్యధిక మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని, తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం వస్తుందని సెంట్రల్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిగూడలో మరోసారి మోదీ సర్కార్ పేరిట వాల్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నేతలు కీర్తిరెడ్డి, కృష్ణగౌడ్ ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, శాంతికుమార్, హరీష్‌యాదవ్, నవీన్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో టమాట కిలో రూ. 11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 23, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండ 15, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 21.

శబ్ద కాలుష్యంపై అవగాహన

పంజగుట్ట: అంతర్జాతీయ శబ్ద దినోత్సవం పురస్కరించుకుని పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు శబ్దకాలుష్యంపై అవగాహన కల్పించారు. ఈ మేరకు టీపీఎస్ఎల్‌పీఏ, యూనివర్సల్ అసోసియేషన్ ఆఫ్ క్లీనికల్ ఆడియాలజీ వారు నిత్యం రోడ్డుపై విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు ఇయర్ ప్లగ్‌లను అందించారు. శబ్ద కాలుష్యం చేయరాదని, అనవసరంగా వేరే సైలెన్సర్‌లు పెట్టుకుని బైక్ నడపరాదని, హారన్ అవసరమైనప్పుడే వాడాలని సూచించారు. పంజగుట్ట కూడలిలో ప్లకార్డులు పట్టుకుని వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసుదన్, సిబ్బంది ఆయా అసోసియేషన్‌ల ప్రతినిధులు డాక్టర్ నాగేందర్, డాక్టర్ ప్రేమనాథ్, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ గంగరాజు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



పంజగుట్ట కూడలిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయండి

లిబర్టీ: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, మున్సిపల్ కార్మికుల పట్ల పాలకులు అనుసరిస్తున్న విధానాలను చర్చించేందుకు మే 4వ తేదీన తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర సమావేశం నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎం.మార్టిన్ తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహిస్తామన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలనే అంశంపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

రైల్లో ప్రయాణికురాలి ఆభరణాల చోరీ

కాచిగూడ: మైసూర్ రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... బేగంపేట్‌కు చెందిన రమేష్‌రావు భార్య ప్రభాకర్‌రావు (74) బెంగుళూర్ నుంచి కాచిగూడకు రావడానికి మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణించింది. కాగా కాచిగూడ రైల్వేస్టేషన్‌లో దిగి బేగంపేట్‌లో ఉన్న తన ఇంటికి వెళ్లారు. అనంతరం ఇంటి వద్ద బ్యాగును చూసుకునేసరికి బ్యాగులో ఉన్న 10 తులాల 1గ్రాము బంగారు ఆభరణాలు, రూ.11వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. బుధవారం రాత్రి బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మృతదేహాన్ని మున్సిపాలిటీకి అప్పగించండి!

> అంత్యక్రియలు చేసేందుకు రాలేనంటూ పోలీసులను కోరిన కువైట్‌లో ఉన్న సోదరి



మరణించిన పవన్‌కుమార్ (ఫైల్)

బంజారాహిల్స్: చిత్తూరు జిల్లా తిరుపతిలోని క్రాంతి నగర్‌కు చెందిన పవన్‌కుమార్ మహానంది(37) కొంత కాలంగా బంజారాహిల్స్ రోడ్ నంబర్–14లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద ఫుట్‌పాత్‌పై జీవిస్తున్నాడు. దాతలు ఇచ్చే అన్నం తింటూ ఇక్కడి జీహెచ్ఎంసీ పునరావాస కేంద్రంలో ఉంటున్నాడు. మూడు రోజులుగా తీవ్రంగా కడుపునొప్పి రావడంతో జీహెచ్ఎంసీ షెల్టర్‌లోనే ఉంటూ అక్కడే పడుకుంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున ఇక్కడే కన్నుమూశాడు. బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి బ్యాగులో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా తిరుపతికి చెందిన పవన్‌కుమార్‌గా గుర్తించారు. తల్లిదండ్రుల గురించి ఆరా తీయగా ఎవరూ లేరని తేలింది. ఒక సోదరి ఉండగా ఆమె కువైట్‌లో ఉంది. ఇదే విషయాన్ని బంజారాహిల్స్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కువైట్‌లో ఉన్న మృతుడి సోదరితో మాట్లాడి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపర్చామని, తీసుకెళ్లడానికి ఎవరినైనా పంపాలని కోరారు. అయితే మృతుడు పవన్‌కు నాన్న వారు ఎవరూ లేరని, ఉన్న ఒక్క తోబుట్టువును కువైట్‌లో ఉంటున్నానని, అంత్యక్రియలు చేయడానికి ఎవరూ అందుబాటులో లేరని దయచేసి... మృతదేహాన్ని మున్సిపాలిటీకి అప్పగించాల్సిందిగా కోరింది. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునికత వైపు అడుగులు వేయరా?

పాత పద్ధతుల్లోనే మ్యాన్‌హోళ్ల శుభ్రం



నీటిని నాలాలోకి మళ్లిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: గాలి దుమారం, కుండపోత వర్షంతో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత వీధులు జలదిగ్బంధమై వరదనీరు నాలాల్లోకి చేరకుండా నిలిచిపోతూ పరిస్థితి అదుపుతప్పేలా చేస్తుంది. నిలిచిపోయిన వరద నీటిని కాలువల్లోకి చేర్చేలా జీహెచ్ఎంసీ సిబ్బంది వద్ద ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులో లేకపోవడంతో కర్రలు, చేతులనే వినియోగిస్తూ మ్యాన్‌హోళ్లలో తట్టుకొనే వ్యర్థాలను, వరద నీటి జాలీల్లో చిక్కుకున్న చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరద బీభత్సానికి కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు చోట్ల వరద నీరు నిలిచిపోయి వాహనాలతోపాటు పాదచారులు, వాకర్లు, స్థానికులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూశారు. బుధవారం మధ్యాహ్నానికి వరద నీరు నాలాల్లోకి వెళ్లకుండా రోడ్లపైనే తిష్టవేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ భవన్‌కు వస్తున్నారనే సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ అధికారులు ఆగమేఘాల మీద వరద నీరు వెళ్లే మార్గాలను శుభ్రం చేసే పనిలో పడ్డారు. వరద నీరు తోడేందుకు మోటార్లు లేకపోగా ఆధునిక పరికరాలు కూడా సిబ్బంది వద్ద కరువయ్యాయి.

అరగంటలో అపార నష్టం

- రహమత్‌నగర్‌లో ఈదురు గాలుల బీభత్సం
- మట్టి పెళ్లలు పడి చిన్నారి మృతి
- కూలిన వట వృక్షం
- నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- పలు ప్రాంతాల్లో విరిగిన చెట్ల కొమ్మలు
- నిలిచిన విద్యుత్ సరఫరా



కార్మికనగర్‌లో ఒరిగిన స్తంభాలు, విరిగిన చెట్లు

రహమత్‌నగర్: అకాల వర్షం, ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఊహించని ఈ సంఘటనలో ఓ చిన్నారి మృత్యువాతపడగా, పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. చెట్లు కూలిపోయాయి. నివాసాలు దెబ్బతిన్నాయి. ఓ ఆలయంలోని వట వృక్షం కూకటి వేళ్లతో సహా నేలకొరిగింది. ఇంత ఆపార నష్టం కేవలం అరగంట సమయంలో జరిగిపోవడం విశేషం. వివరాలు ఇలా ఉన్నాయి... రహమత్‌నగర్ డివిజన్‌లో మంగళవారం రాత్రి అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం ప్రారంభమైంది. వేగంగా వీచిన గాలులకు భయపడి జనం బయటికి రాలేదు. బ్రహ్మశంకర్‌నగర్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆవరణలో ఉన్నరావి చెట్టు ఈదరు గాలలకు కూకటి వేళ్లతో సహా కూలిపోయింది. దీంతో సమీప భవనాలు పాక్షికంగా దెబ్బతినగా, ఆలయ ప్రహరీ పూర్తిగా ధ్వంసమైంది. బస్తీ అధ్యక్షుడు ఓర్సు వసంత్‌కుమార్, ఓర్సు అడవయ్యలు కార్పొరేటర్ సీఎన్ రెడ్డికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కార్పొరేటర్ రాత్రంతా సహాయకచర్యలు చేపట్టారు. పక్కనే ఉన్న ఓంనగర్ పక్కనే నిర్మాణంలో ఉన్న ఓ నివాసం పిల్లర్ రేకులు ఇంటి పడటంతో గోడకూలి నిదురపోతున్న జీవనిక (8 నెలలు) పడటంతో తీవ్ర గాయాలైంది. సమీప ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో విశాదఛాయలు అలుముకున్నాయి. కార్మికనగర్ రహదారిపై చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాలయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో రాత్రి నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, భవానీశంకర్, బీజేపీ నాయకులు లంకాల దీపక్‌రెడ్డి, కీర్తి రెడ్డిలు ఓంనగర్ బస్తీలో పర్యటించి మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే దెబ్బతిన్న నివాసాలను పరిశీలించి, బాధితులను ఓదార్చారు.

కూలిన వృక్షం...

బ్రహ్మశంకర్‌నగర్ పోతులూరి బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలోని దాదాపు 50 ఏళ్ల క్రితం రావి చెట్టు మంగళవారం రాత్రి ఈదురు గాలులకు కూలిపోయింది. దీంతో బస్తీ వాసులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ భారీ వట వృక్షం ఆలయంలో పాటు చుట్టు పక్కలవారికి నీడ అందించేందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సభలు, సమావేశాలు ఈ చెట్టు కిందనే జరిగేవని గుర్తు చేసుకున్నారు. చెట్టు కూలిపోవడం తమను ఎంతో కలిచి వేసిందని ఆలయ ధర్మకర్త అడవయ్య వాపోయారు.



బ్రహ్మశంకర్ ఆలయంలో కూలిన రావి చెట్టు

రామోజీ డబుల్ రోల్

హెచ్‌యూఎఫ్ కర్తగా మార్గదర్శి డిపాజిట్లు స్వీకరణ

- ప్రొప్రయిటర్‌గా డిపాజిట్‌దారులకు చెల్లింపులు
- రామోజీరావు రెండు పాత్రలనూ బట్టబయలు చేసిన ఉండవల్లి
- అదనపు డాక్యుమెంట్‌లో సుప్రీంకోర్టుకు వివరాలు

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి ఫైనాన్షియర్స్ అధినేత రామోజీరావు ద్విపాత్రాభినయాన్ని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. డిపాజిట్‌దారుల నుంచి సేకరించిన మొత్తాన్ని వేర్వేరు సంస్థలకు మళ్లించే క్రమంలో రామోజీ పోషించిన కీలకపాత్రను బహిర్గతం చేశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో మాజీ ఎంపీ ఉండవల్లి సుప్రీంకోర్టులో తాజాగా అదనపు డాక్యుమెంట్‌ను దాఖలు చేశారు. డిపాజిట్లు స్వీకరించే క్రమంలో కర్త ఆఫ్ హెచ్‌యూఎఫ్‌గా, చెల్లించే సమయంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రొప్రయిటర్‌గా సంతకాలు చేసిన పత్రాలను కోర్టుకు సమర్పించారు. గత విచారణ సమయంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేబీ పార్డీవాలాలతో కూడిన ధర్మాసనం.. ఒక చోట హెచ్‌యూఎఫ్‌గా, మరో చోట ప్రొప్రయిటర్‌గా క్లెయిమ్ చేసుకున్నారేమిటి అని రామోజీరావు తరఫు న్యాయవాదుల్ని ప్రశ్నించిన విషయం విదితమే.

■ **అఫిడవిట్‌లో పేర్కొన్న విషయాలు ఇలా..**

1990 తొలినాళ్లలో నా కుటుంబ సభ్యులు, దగ్గర బంధువులు, స్నేహితులు వారు సంపాదించిన సొమ్మును మార్గదర్శి ఫైనాన్షియర్స్‌లో పెట్టుబడి పెట్టారు. బలమైన కాంగ్రెస్ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ నా కుటుంబ సభ్యులు రామోజీరావుకు చెందిన మార్గదర్శిలో ఇన్వెస్ట్ చేశారు. మీడియా, వ్యాపారం అనుసంధానం చేయబోరని భావించనందువల్లే ఇలా చేశారు. 16 సంవత్సరాలుగా మా కుటుంబ సభ్యులు డిపాజిట్లు రెన్యువల్ చేస్తూనే ఉన్నారు. అయితే, 2006లో మెచ్యూరిటీ తర్వాత డిపాజిట్లు రూ.లక్ష కన్నా తక్కువ ఉన్నాయని రెన్యువల్ చేయలేదు. దీనికి సంబంధించి మార్గదర్శి ఫైనాన్షియర్స్ జారీ చేసిన డిపాజిట్ బాండ్‌లలో హెచ్‌యూఎఫ్ కర్త హోదాలో, చెక్‌పైన మార్గదర్శి ఫైనాన్షియర్స్ తరఫున ప్రొప్రయిటర్‌గా రామోజీరావు సంతకం చేయడం గమనించాను. ఇదే విషయాన్ని సహచర న్యాయవాద స్నేహితులు, ఆడిటర్లతో చర్చించా. ఆర్‌బీఐ యాక్టు, 1934 సెక్షన్ 45ఎస్ ప్రకారం 1997 తర్వాత ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం చట్ట ప్రకారం శిక్షార్హమైనదని, మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిబంధనలు ఉల్లంఘించిందని వారు తెలిపారు. రామోజీరావు లాంటి వ్యక్తి అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నారంటే నమ్మలేకపోయా. ఆంధ్రప్రదేశ్‌లోని అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల అక్రమాలను బహిర్గతం చేయడంలో ఈనాడు సహా పలు పత్రికలు కీలకపాత్ర పోషించాయి. అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్‌లో రిజిస్టర్ అయ్యేవి. బ్యాంకింగ్ వ్యాపారానికి ఆర్‌బీఐ నుంచి లైసెన్సు పొందేవి. వాటిలో అక్రమాలపై ఈనాడు సహా పలుపత్రికలు కథనాలు ప్రచురించి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. 45 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల మొత్తం డిపాజిట్ల విలువ రూ.630 కోట్లు. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ది పూర్తిగా చట్ట విరుద్ధమైన వ్యాపారం. ఆర్‌బీఐలో రిజిస్టర్ కాలేదు. ఏపీ ప్రభుత్వంలో రిజిస్టర్ కాలేదు. దేశంలో ఎక్కడా రిజిస్టర్ కాలేదు. అన్ ఇన్‌కార్పొరేటెడ్ బాడీగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై 1997 నుంచి ఎవరి నుంచి డిపాజిట్లు స్వీకరించకుండా నిషేధం కూడా ఉంది. ఆ నిబంధనలు ఉల్లంఘించి డిపాజిట్లు స్వీకరించినందున రెండేళ్ల వరకు జైలు శిక్షకు అర్హులు. 45 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుల డిపాజిట్లు మొత్తం రూ.630 కోట్లు అయితే మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఒక్కటే చట్ట విరుద్ధంగా సుమారు 2.75 లక్షల మంది నుంచి రూ. 2,600 కోట్లు సేకరించింది. 2006 మార్చి 31 నాటికి రూ.1,400 కోట్లు నష్టం కాగా, ఏడాది తర్వాత రామోజీరావు హెచ్‌యూఎఫ్ మొత్తం నష్టం రూ.1,800 కోట్లకు చేరుకుంది. ఈ నష్టాలు కేవలం సాంకేతిక నష్టాలు మాత్రమేనని రామోజీరావు వివరించడానికి ప్రయత్నించారు. అయితే, చాలా మంది ఆర్థిక నిపుణులు సాంకేతిక నష్టాలు అంటే అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్థికస్థితి ఏ వార్తాపత్రికలోనూ ప్రచురించలేదు. లేదా డిపాజిటర్లు ఎవరికీ పంపిణీ చేయలేదు. వ్యాపారమంతా గుట్టుగా సాగిపోయింది. మార్గ దర్శి ఫైనాన్షియర్స్ పేరు వెబ్‌సైట్‌లో ఎప్పుడూ కనిపించలేదు. ఆశ్చర్యకరంగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు ఉద్దేశపూర్వకంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ లిమిటెడ్ విభాగం ద్వారా డిపాజిట్లు సేకరిస్తు న్నారనే అభిప్రాయం కలిగించడానికి సైన్ బోర్డులు కూడా ఉంచలేదు. ఈ విషయంపై 2006 నవంబరు 6న ఆర్థిక మంత్రికి ఫిర్యాదు చేశాను. డిపాజిటర్ల ప్రయోజనాల రీత్యా తగిన చర్యల కోసం ఆ కాపీని అప్పటి ఏపీ సీఎంకు పంపించాను. అయితే, రామోజీరావు తాను చేస్తున్న అక్రమ వ్యాపారానికి క్షమాపణ చెప్పడానికి బదులు పత్రికా స్వేచ్ఛ ముసుగులో బయట పడటానికి ప్రయత్నించారు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించే రాజకీయ నాయకులందరూ వాస్తవాలు, గణాంకాలు ధ్రువీకరించకుండానే రామోజీ రావుకు మద్దతు తెలిపారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారంటూ అసలు విషయం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు యత్నించారు. చట్టం నుంచి తప్పించుకొనేందుకు ఒకరికి సహకరిస్తున్నామని వారందరూ మర్చిపోయారు.

నా ఫిర్యాదు స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వం 2006 నవంబర్ 6న ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని నియమించింది. ఆ కమిటీకి రామోజీరావు సమాచారం ఇవ్వలేదు. పైగా, కమిటీ నియామకాన్ని సవాల్ చేశారు. హైకోర్టు మధ్యంతర స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కమిటీకి సహకరించడానికి రామోజీరావు నిరాకరిస్తున్నందున జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నిర్దిష్ట ఆదేశాలతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆవరణలో ప్రభుత్వం సోదాలు నిర్వహించింది. దురదృష్టవశాత్తు ఎల్‌కే అద్వానీ, నరేంద్రమోదీ, జయలలిత, ములాయం సింగ్ యాదవ్, కుల్దీప్ నయ్యర్, ఎడిటర్ ఎన్. రామ్ వంటి పెద్దలంతా ప్రభుత్వం చేస్తున్న సోదాలకు వ్యతిరేకంగా ప్రకటనలు ఇచ్చారు. ఎడిటోరియల్స్ కూడా రాశారు. పార్లమెంటులో, ఇతర ప్రాంతాల్లో నా సహచరులతో మాట్లాడుతు న్నప్పుడు సమస్యపై విస్తృత ప్రచారం జరిగినా సమాజంలో ఇంకా గందరగోళంగానే ఉన్న విష యాన్ని గ్రహించాను. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించడానికి వీలుగా అన్ని పత్రాలు కోర్టుకు సమర్పిస్తున్నాను'' అని ఉండవల్లి అరుణ్‌కుమార్ అదనపు డాక్యుమెంటులో పేర్కొన్నారు.

కోర్టుకు పలు పత్రాలు సమర్పించిన ఉండవల్లి

తన తల్లి వి. లక్ష్మీ సుబ్బారావు చేసిన డిపాజిట్లు, చెల్లింపు నిమిత్తం అందించిన చెక్కులను కూడా ఉండవల్లి అరుణ్‌కుమార్ పొందుపరిచారు. మార్గదర్శి రిజిస్టర్ హోల్డర్లయిన వి.లక్ష్మీ సుబ్బారావు.. మీ నుంచి రూ.84,324 డిపాజిట్‌గా స్వీకరిస్తున్నామని 2006 మార్చి 23న కర్త ఆఫ్ హెచ్‌యూఎఫ్‌గా రామోజీరావు సంతకం చేసిన పత్రం, వి.లక్ష్మీ సుబ్బారావు పేరిట 2006 నవంబర్ 3న మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రొప్రయిటర్‌గా రామోజీరావు సంతకం చేసిన హెచ్‌డీఎఫ్‌సీ చెక్కును కూడా అదనపు డాక్యుమెంటుతో పొందుపరిచారు. నాటి ఆర్థిక మంత్రి చిదంబరానికి రాసిన లేఖ, మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఏర్పాటు, వ్యాపారం తదితర వివరాలు, బ్యాలెన్స్ షీట్లు, డిపాజిట్లు సేకరించొద్దని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఆర్‌బీఐ ఆదేశించిన పత్రాలు కూడా కోర్టుకు సమర్పించారు.

నరహంతక ముసలిపులి

నమ్మితే..అంతే సంగతి

- వంచకులను, వెన్నుపోటుదారులను నమ్మొద్దని కోరుతున్నా
- నార్పల సభలో చంద్రబాబుపై ధ్వజమెత్తిన ముఖ్యమంత్రి జగన్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రతిపక్ష నేత చంద్రబాబు వచ్చీరాని ఇంగ్లిష్‌లో రిపబ్లిక్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూను చూస్తుంటే పంచతంత్ర కథ గుర్తుకొస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'పులి – బంగారు కడియం' కథలోని ముసలి పులి తరహాలోనే చంద్రబాబు తీరు ఉందన్నారు. బుధవారం అనంతపురం జిల్లా నార్పలలో నిర్వహించిన సభలో చంద్రబాబు వ్యవహార శైలిని ఎండగడుతూ సీఎం జగన్ పంచతంత్ర నీతి కథను ప్రస్తావించారు.

■ **ముసలి పులి.. మాయమాటలు**

'ఓ అడవిలో క్రమం తప్పకుండా నరమాంసం తినే పులి ఉండేది. అది ముసలిది కావడంతో వేటాడే శక్తి, పరుగెత్తే ఓపిక పోయింది. దీంతో ఉన్నచోటే కూర్చుని నాలుగు నక్కలను తోడేసుకుంది. బంగారు కడియం ఆశ చూపి మడుగులోకి మనుషులను దింపి చంపి తినేది. దీంతో ఎవరూ నమ్మకపోవడంతో ఈ అడవిలో సీనియర్ మోస్ట్ పులిని, నేను నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని మాయమాటలు చెప్పేది. గతంలో నరమాంసం తినేవాడ్ని.. ఇప్పుడు తినదలుచుకోలేదు.. మంచివాడిని అయిపోయా.. మంచి కార్యక్రమాలు చేస్తున్నానంటూ నమ్మించేది. పులి ముసలిది అయిపోయింది కదా అని నమ్మి బంగారు కడియాల కోసం మడుగులోకి వెళ్తే బురదలో కూరుకుపోయిన వారిని చంపి తినేసేది'

■ **ఓ ముసలాయన గుర్తొస్తారు..**

'పులి – బంగారు కడియం ఈ కథ వింటే మోసపూరిత వాగ్దానాలు, కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పే ఓ ముసలాయన గుర్తొస్తారు. ఆయన ఎవరో కాదు.. నారా చంద్రబాబు నాయుడు' అని సీఎం జగన్ పేర్కొన్నారు. అబద్ధాలు ఆడేవారిని, వంచకులను, వెన్నుపోటు పొడిచే వారిని, మాయమాటలు చెప్పేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదన్నదే ఈ కథలో నీతి అని చెప్పారు.

■ **మళ్లీ టేప్ రికార్డర్ ఆన్.. అవే డైలాగులు**

'జాబు రావాలంటే.. బాబు రావాలని లక్షల మంది నిరుద్యోగులను నాడు చంద్రబాబు నట్టేట ముంచాడు. ఇప్పుడు మళ్లీ అదే చెబుతున్నారు. ఈ మనిషికి ఇక ఎప్పుడూ బుద్ధి రాదు. ఒక్కసారి గతాన్ని గుర్తు చేసుకోవాలని ప్రజలను కోరుతున్నా. బ్యాంకుల్లో ఉన్న బంగారం తిరిగి రావాలంటే.. బాబు రావాలి, పిల్లలకు ఉద్యోగాలు రావాలంటే.. బాబు రావాలని ప్రకటనలు ఇచ్చారు. ప్రతి ఇంటికీ చంద్రబాబు సంతకాలతో లేఖలు పంపారు. ఉద్యోగం రాకుంటే నెలనెలా నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. రైతులకు రూ.87,612 కోట్ల రుణమాఫీ చేస్తానని చెప్పి నట్టేట ముంచారు. రుణమాఫీ సంగతి దేవుడెరుగు.. బ్యాంకుల్లో బంగారాన్ని వేలం వేశారు. రూ.14,200 కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేయలేదు సరికదా.. వారికి సున్నావడ్డీ పథకాన్ని కూడా రద్దు చేశాడు. జగన్‌ను తట్టుకోలేమని తెలిసి ఎన్నికలకు రెండు నెలల ముందు రూ.2 వేలకు పింఛన్ పెంచి మూడు లక్షల మందికి ఇచ్చి చేతులు దులుపుకొన్నాడు. ఇదే పెద్ద మనిషి మళ్లీ టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. అవే డైలాగులు చెబుతున్నారు' అని చెప్పారు.

మార్గదర్శి అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధం

- టీడీపీ నేత జీవీ రెడ్డి సవాల్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్
- రామోజీ ఫిలింసిటీలో రామోజీరావు సమక్షంలో చర్చ జరగాలి లేదంటే టీడీపీ ప్రధాన కార్యాలయంలోనైనా నిర్వహించాలి

రాజమహేంద్రవరం సిటీ: మార్గదర్శి అక్రమాలపై చర్చించేందుకు టీడీపీ అధికార ప్రతినిధి జీవీ రెడ్డి చేసిన సవాల్‌కు తాను సిద్ధమేనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను మార్గదర్శి అక్రమాలపై పోరాడుతుంటే.. టీడీపీ నేతలు మార్గదర్శి అక్రమాలను వెనకేసుకొస్తూ చర్చకు సవాల్ విసురుతున్నారని చెప్పారు. తాను బహిరంగ చర్చకు సిద్ధమేనని ప్రకటించారు. ఈ చర్చ రామోజీరావు సమక్షంలో రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించాలని కోరారు. రామోజీ ఫిల్మ్ సిటీలో అవకాశం లేని పక్షంలో.. టీడీపీ ప్రధాన కార్యాలయంలోనైనా ఏర్పాటు చేయాలని సూచించారు. మార్గదర్శి అక్రమాలను టీడీపీ వెనకేసుకొస్తున్న విషయం స్పష్టమయ్యిందన్నారు. జనసేన పార్టీ కూడా మార్గదర్శికే అనుకూలంగా వ్యవహరిస్తోందని చెప్పారు. మే 14వ తేదీన మార్గదర్శి అక్రమాలపై చర్చ జరిగే అవకాశం ఉందని చెప్పారు. మార్గదర్శిలో తప్పులు జరిగాయనే విషయాన్ని రామోజీ ఒప్పుకోకుండా అన్ని కోర్టులకూ వెళుతున్నారని చెప్పారు. తాను బీజేపీకి, రామోజీకి, చంద్రబాబుకు వ్యతిరేకం కాదన్నారు. మార్గదర్శిలో జరుగుతున్న అక్రమాలపై మాత్రమే పోరాటం చేస్తున్నానని తెలిపారు. తనకు రెండే పనులున్నాయని.. ఒకటి మార్గదర్శి, రెండోది రాష్ట్ర విభజన అంశమని చెప్పారు. తాను వైఎస్సార్‌సీపీకి అనుకూలమంటూ టీడీపీ ఆరోపిస్తోందని.. తాను ఆ పార్టీకి అనుకూలం కాదని స్పష్టం చేశారు.

కామాంధుడికి కఠిన శిక్ష

- టీడీపీ నేత వినోద్‌జైన్‌కు జీవిత ఖైదు విధించిన పోక్సో కోర్టు
- 13 ఏళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించి.. ఆమె ఆత్మహత్యకు కారణమైన వినోద్‌జైన్



విజయవాడ స్పోర్ట్స్ : బాలికను లైంగికంగా వేధించి.. ఆమె ఆత్మహత్యకు కారణమైన టీడీపీ నాయకుడు వినోద్‌జైన్(58)కు జీవిత ఖైదు విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజని తీర్పు చెప్పారు. విజయవాడ భవానీపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి ఉంటున్న 13 ఏళ్ల బాలిక అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అదే అపార్ట్‌మెంట్‌లో నాలుగో ఫ్లోర్‌లో ఉండే వినోద్‌జైన్ లైంగిక వేధింపులను తాళలేక ఆ బాలిక 2022 జనవరి 29వ తేదీ ఐదంతస్తుల అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కేసు విచారణ చేపట్టిన భవానీపురం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి బాలిక మృతికి కారణమైన వినోద్‌జైన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. బాధితురాలి తరఫున పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి వాదనలు వినిపించారు. సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు సమక్షంలో 20 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం వినోద్‌జైన్ నేరం చేసినట్టు గుర్తించింది. ఐపీసీ 305 సెక్షన్ కింద కఠిన కారాగార శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా, పోక్సో యాక్ట్ 9సీ, 10 కింద ఏడేళ్ల జైలు రూ.50 వేలు జరిమానా, పోక్సో యాక్ట్ 12 కింద మూడేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా, ఐసీపీ 354 సెక్షన్ కింద ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా, సెక్షన్ 589 కింద ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మొత్తం జరిమానా రూ.3 లక్షల్లో రూ.2.40 లక్షలను మృతురాలి తల్లికి అందజేయాలని, నిందితుడు జరిమానా చెల్లించకుంటే ఒక్కో సెక్షన్‌కు ఆరు నెలల చొప్పున అదనంగా జైలు శిక్ష అనుభవించాలని పేర్కొంది. ఘటన జరిగిన 15 నెలల్లో న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడటంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నగర వార్తలు

28 లోపు హజ్ యాత్రికులు రెండో విడత డబ్బు జమచేయాలి

- రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ సలీం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రం నుంచి 2023 హజ్ యాత్రకు ఎంపికైన వారు ప్రయాణ ఖర్చుల నిమిత్తం చెల్లించే రెండో విడుత డబ్బులు ఈ నెల 28వ తేదీ వరకు చెల్లించాలని రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ మహ్మద్ సలీం పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హజ్ యాత్రకు ఎంపికైన వారు ఇప్పటికే మొదటి విడతగా రూ. 82,800 చెల్లించారని రెండవ విడతగా రూ. 1.70 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగతా పూర్తి ఖర్చులు మూడవ విడతగా త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 5 వేల మంది హజ్ యాత్రకు ఎంపికయ్యారని, డబ్బులు చెల్లించని వారి స్థానంలో ఇతరులకు అవకాశం ఇస్తామన్నారు. డబ్బు చెల్లిస్తున్న యాత్రికులు తమ యాత్రకు కావాల్సిన ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు పాస్‌పోర్టు హజ్ కమిటీ కార్యాలయంలో జమచేయాలని తెలిపారు.

లక్షా యాభై వేల పోడుపట్టాలు తక్షణమే ఇవ్వాలి



వెంకన్న

కవాడిగూడ: పోడు రైతులకు లక్షా యాభై వేల పట్టాలు ఇస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ తొమ్మిదేళ్లు అవుతున్నా అమలు కాకపోవడం దురదృష్టకరమని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న విమర్శించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రైతుబంధు, రుణమాఫీ, పంట రుణాలు, బీమా పథకం అందించాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 24, 25 తేదీల్లో ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సూర్యపేటలో నిర్వహించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ తీర్మానాలను బుధవారం హైదరాబాద్‌లోని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు చట్టబద్ధత, మద్దతు ధర కల్పించాలని అటవీ సంరక్షణ నియమాలు 2022ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నూతన విద్యుత్ సవరణ బిల్లులు, ప్రశ్నపత్రాల లీకేజీని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులను శిక్షించాలని పేర్కొన్నారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేలు అందించాలని లేకుంటే మే 4,5వ తేదీల్లో మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

సైబర్ వలలో మహిళలు!



గృహిణులే లక్ష్యంగా మోసాలు

- ఇంట్లోనే ఉంటూ సంపాదన అంటూ ఎర
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: 'వేసవి సెలవులు వచ్చాయి..మా పిల్లలకు యోగా నేర్పించాలని అనుకుంటున్నాం' అంటూ గచ్చిబౌలికి చెందిన ఓ యోగా శిక్షకురాలికి ఫోన్ వచ్చింది. సరే అని ఆమె సమయం, ఫీజు తదితర వివరాలు తెలిపింది. అడ్వాన్స్ చెల్లిస్తామని శిక్షకురాలి బ్యాంకు ఖాతా, ఆధార్, పాన్ కార్డు వివరాలను సైబర్ నేరస్తులు తీసుకున్నారు. ఫోన్ పే ద్వారా తాము పంపిన లింక్‌కు రూ.10 చెల్లించండి, మీ ఖాతా అని నిర్ధారించుకున్న తర్వాత అడ్వాన్స్ పంపిస్తామని కేటుగాళ్లు సూచించారు. నిజమేనని నమ్మిన ఆమె నగదు బదిలీ చేయగానే క్షణాల్లో ఆమె ఖాతాలోని డబ్బు ఖాళీ అయిపోయింది.

లింక్‌లు పంపించి బురిడీ..

ఇంట్లోనూ ఉంటూ నెలకు రూ.లక్షల్లో సంపాదించుకోండి' అంటూ సైబర్ నేరస్తులు వల విసురుతున్నారు. నిజమేనని నమ్మి గృహిణులు చేతిలోని సొమ్ము, బ్యాంకు ఖాతాలో ఉన్న నగదునూ పోగొట్టుకుంటున్నారు. మహిళలు ఎక్కువగా ఉద్యోగం, వివాహం, ఆన్‌లైన్ ట్రేడింగ్ వంటి సైబర్ మోసాల బారిన పడుతున్నారని, సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లలో ఈ తరహా కేసులు పెరిగిపోతున్నాయని పోలీసులు చెబుతున్నారు. నగరంలో జీవన వ్యయం పెరిగింది. భార్యభర్తలిద్దరూ సంపాదిస్తే తప్ప గడవని పరిస్థితి. తమ చదువు, విజ్ఞానానికి అనుగుణంగా గృహిణులు టైలరింగ్, బ్యూటీషియన్, బేకింగ్ వంటి ఉపాధి అంశాలను ఎంచుకోవటం సాధారణం. ఆన్‌లైన్ లావాదేవీలు పెరిగాక ఈ రంగాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. ట్యూషన్లు, సంగీతం, యోగా, నృత్యం, డిజిటల్ ప్రకటనలు, పెట్టుబడులు తదితర అంశాలను నగర మహిళలు ఉపాధిగా మలుచుకుంటున్నారు. ప్రతి నెలా రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకూ సంపాదిస్తున్నారు. ఈ వెసులుబాటును సైబర్ నేరస్తులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు.

నకిలీ వెబ్‌సైట్లతో..

ప్రముఖ సంస్థల పేర్లతో నకిలీ వెబ్‌సైట్లు రూపొందించి గృహిణులను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. అదనపు సంపాదన కోసం మేమిచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటూ ఆశ చూపిస్తున్నారు. మాయగాళ్ల వలకు చిక్కి రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్నారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే లక్షల్లో లాభాలు వస్తాయని మోసగాళ్ల ప్రకటనను నమ్మిన ఓ యువతి ఒంటి మీద బంగారం అమ్మి మరీ పెట్టుబడి పెట్టడం ఇందుకు ఉదాహరణ. కుటుంబానికి అండగా నిలవాలన్న ఆలోచన మంచిదే కానీ.. ఆన్‌లైన్ ద్వారా వచ్చే సందేశాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రకటనలు తేలిగ్గా నమ్మకూడదు. వాటిలో ఎంత వరకు నిజమో నిర్ధారించుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

పరిశోధనలతోనే నూతన ఆవిష్కరణలు

పద్మభూషణ్ గ్రహీత ప్రొ.ఎంఎం శర్మ

ఉస్మానియా యూనివర్సిటీ: పరిశోధనలతోనే నూతన ఆవిష్కరణలని పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత ప్రొ.ఎంఎం శర్మ అన్నారు. బుధవారం ఓయూ క్యాంపస్ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్, ఫుడ్, టెక్స్‌టైల్స్ ఇంజినీరింగ్ విభాగాలతో టెక్నోస్మానియా–2023, ఫార్మసీ విభాగం టెన్సోఫార్మా–2023 రెండో రోజు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొ.ఎంఎం శర్మ పాల్గొని ప్రసంగించారు. పరిశోధనలతోనే నూతన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే నూతన పరిశోధనలు చేయాలని సూచించారు. కెమికల్ ఇంజినీర్ విభాగం హెడ్ ప్రొ.రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రొ.ఎంఎం శర్మకు ఓయూ, ఐఐసీటీతో విడదీయరాని అనుబంధం ఉందని ఆయన 27 ఏళ్ల వయస్సులోనే ప్రొఫెసర్ అయ్యారన్నారు. పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులతో పాటు రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ అవార్డు పొందిన మొదటి భారతీయ ఇంజినీర్ అని కొనియాడారు. వీసీ ప్రొ.రవీందర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ప్రొ.ఎంఎం శర్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టెక్నోస్మానియా కన్వీనర్ డా.జ్యోతి, కోకన్వీనర్లు డా.పరుశురాములు, డా.భాస్కర్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ అభిలాష్, అజిత్, వి.భాస్కర్, అయోధ్య కవిత, అరుణ, అనురాధ, విద్యార్థి కోఆర్డినేటర్లు కెమికల్ ఇంజినీరు తేజస్, గురుప్రసాద్, సహజా, మైత్రి, ఫుడ్ టెక్నాలజీ మహ్మద్ సక్విబ్ అహ్మద్ ఖాన్, రిషిత పాల్గొన్నారు.



ఎంఎం శర్మ సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

భద్రాద్రి తలంబ్రాలు అందించడంలో ద్వితీయస్థానం

- హెచ్‌సీయూ డిపో కార్గో విభాగానికి గుర్తింపు



రాయదుర్గం: భద్రాచలంలోని సీతారాముల కల్యాణ తలంబ్రాలు ప్రజలకు అందించడంలో గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ జోన్ పరిధిలో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో కార్గో విభాగానికి గుర్తింపు లభించింది. టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్(కార్గో, పార్సిల్స్ కొరియర్) విభాగం ద్వారా భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాల ప్యాకెట్లను కొరియర్ సర్వీస్ ద్వారా ప్రజల ఇంటికి చేరవేయడంలో హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో లాజిస్టిక్స్ విభాగం గ్రేటర్ హైదరాబాద్‌లో ద్వితీయ స్థానం పొందింది. డిపో ద్వారా 1871 తలంబ్రాల ప్యాకెట్ల కోసం ప్రజల నుంచి ఆర్డర్లు రాగా వాటిని వారి ఇంటికే చేర్చి ద్వితీయ స్థానం పొందడం విశేషం. ఉన్నతాధికారులు కార్గో సేవల విభాగానికి బహుమతిని డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పీ.విజేందర్ రెడ్డికి అందించారు.

మురళీధర్‌రావుకు ప్రముఖుల నివాళి



మురళీధర్‌రావు భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న బండి సంజయ్

రామంతాపూర్: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ తండ్రి ఎన్‌జే మురళీధర్ రావు అంత్యక్రియలు బుధవారం కాచిగూడలోని హిందూ శ్మశానవాటికలో జరిగాయి. రామంతాపూర్ నెహ్రూనగర్‌లోని వారి స్వగృహం నుంచి ప్రారంభమైన అంతిమయాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ కేంద్ర మంత్రి ఎస్.వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి. టి.వీరేందర్‌గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జి.మనోహర్‌రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొని నివాళులర్పించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ, తదితరులు ఫోన్‌లో ప్రభాకర్‌ను పరామర్శించారు.

తెలంగాణలో ఒక మైలురాయి 'బలగం'

దర్శకుడు నరసింగరావు

లక్డీకాపూల్: అస్థిత్వ పోరాటం, బలిదానాల ద్వారా సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 'బలగం' సినిమా ఒక గొప్ప మైలురాయిగా నిలిచిపోతుందని అలనాటి ప్రముఖ దర్శకుడు నరసింగరావు కొనియాడారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు, పల్లెల సౌందర్యాలకు, నిజజీవితాలకు అద్దం పట్టే ఇతివృత్తంతో మంచి సినిమా ఎలా తీయవచ్చో ఈ సినిమాలు నిరూపించిందన్నారు. బుధవారం జాతీయ ప్రజా సంబంధాల దినోత్సవాల్లో భాగంగా పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ (అకాడమిక్) ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అధ్యక్షతన జరిగిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. దర్శకుడు వేణు తన మొదటి చిత్రంలోనే తెలంగాణ వాస్తవిక జీవితాన్ని చిత్రీకరించేలా గ్రామీణ నేపథ్యంలోని ప్రతి అంశాన్ని నిశితంగా పట్టుకున్నాడు. తెలంగాణ సమాజానికి ఇలాంటి సినిమాలు మరెన్నో కావాలి కానీ.. అన్ని కూర్పులతో బలగం స్థాయిలో మరో సినిమా రావడం చాలా కష్టమే అన్నారు. ప్రొఫెసర్ చక్రపాణి మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మను యథాతథంగా ప్రతిబింబించడంలో బలగం విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత డాక్టర్ కె.శ్రీనివాస్, స్విట్జర్లాండ్‌కు చెందిన వ్యవసాయం, నీటి నిర్వహణపై అంతర్జాతీయ నిపుణుడు డాక్టర్ భిక్షంగుజ్జ, ఉద్యమకారిణి కవితపులి, యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ కమ్యూనికేషన్ నిపుణుడు ఎం.జయరాజ్, పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ రాము సూరవజ్జుల, జాతీయ సెక్రటరీ జనరల్ వై.బాబ్జీ, హైదరాబాద్ చాప్టర్ సెక్రటరీ యాదగిరి పాల్గొన్నారు.

కసిరెడ్డి వెంకట్‌రెడ్డికి 'ఆది శంకరాచార్య సాహితీ' పురస్కారం

చిక్కడపల్లి: జాతీయ సాహిత్యాన్ని విశేషంగా నేటి తరాలకు పరిచయం చేసిన ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి సాహితీ విశారదుడు అని విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి జంధ్యాల రాంబాబు అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో బుధవారం సుప్రసిద్ధి కవి పండితులు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డికి తొలిసారిగా ఆది శంకరాచార్య సాహితి పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. స్వామి చిన్మయానంద శిష్యులు స్వామి ప్రథమేశానంద మాట్లాడుతూ.. భజగోవిందం శ్లోకాలమాయలో పడి మానవుడు స్వార్థ, వ్యామోహంలో కొట్టుమిట్టాడుతున్నారని చివరికి మిగిలేది ఏమి ఉండదని బోధించి జ్ఞానం కలిగించారని వివరించారు. కసిరెడ్డి వెంకట్‌రెడ్డి తన రచనలతో యువతకు జ్ఞాన మార్గం చూపారని అభినందించారు. సంస్కారవంత రచనలు చేసిన వారిలో అగ్రేసరుడు కసిరెడ్డి అని డాక్టర్ త్రిపురనేని హనుమాన్ చౌదరి కొనియాడారు.



పురస్కారం అందుకుంటున్న కసిరెడ్డి వెంకట్‌రెడ్డి


విత్తనాల ప్రదర్శనలో రైతు మహిళలు

విత్తనం పరిరక్షణకు ‘చిరు’యత్నం

మహిళల ఘన విజయం

‘ఇంటర్నేషనల్ సీడ్ డే’... ఇలాంటి ఓ రోజు ఉందా!
ఉంది... అయితే ప్రచారమే పెద్దగా ఉండదు.
ఇది గ్లామర్ మార్కెట్ వస్తువు కాకపోవడమే కారణం.
ఈ రోజును రైతు మహిళలు నిర్వహించారు.
‘చిరు’సాగు చేసి కళ్లాల్లో రాశులు పోసిన చేతులవి.
విత్తనాన్ని కాపాడాలనే ముందుచూపున్న చేతలవి.

రాగి ముద్ద స్టార్ హోటల్ మెనూలో కనిపిస్తోంది. స్మార్ట్‌గా ఆర్డర్ చేస్తే అందమైన ప్యాక్‌తో ఇంటిముందు వాలుతోంది. అలాగే సజ్జ ఇడ్లీ, ఊదల దోసె, కొర్రల కర్డ్ మీల్, జొన్న రొట్టె, మిల్లెట్ చపాతీ, మిల్లెట్ పొంగలి... ఇలా బ్రేక్ ఫాస్ట్ సెంటర్‌లు కొత్త రూపుదిద్దుకున్నాయి. ఎక్కడో మారుమూల గ్రామాల్లో నీటి వసతి లేని నేలను నమ్ముకుని బతికే వాళ్ల ఆకలి తీర్చిన చిరుధాన్యాలు ఇప్పుడు బెంజ్‌కారులో బ్రేక్‌ఫాస్ట్‌కి వెళ్లే సంపన్నుల టేబుల్ మీదకు చేరాయి. ఒకప్పుడు చిన్న చూపుకు గురైన చిరుధాన్యాలు నేడు సిరిధాన్యాలుగా మన దైనందిన జీవితంలో ప్రధాన భూమికను పోషిస్తున్నాయి. వీటి వెనుక నిరుపేద మహిళల శ్రమ ఉంది. పాతికేళ్లుగా ఈ నిరుపేద మహిళలు చిరుధాన్యాలతోనే జీవించారు, చిరుధాన్యాల పరిరక్షణ కోసమే జీవించారు. సేంద్రియ సేద్యంతో చిరుధాన్యాల జీవాన్ని నిలిపారు. అంతర్జాతీయ విత్తన దినోత్సవం (ఏప్రిల్ 26) సందర్భంగా బుధవారం వీరంతా మెదక్ జిల్లా, జహీరాబాద్ మండలం, పస్తాపూర్‌లో తమ దగ్గరున్న పంటల విత్తనాలను సగర్వంగా ప్రదర్శించారు. హైబ్రీడ్ వంగడాల మాయలో పడకుండా మన విత్తనాలను మనం కాపాడుకోవాలని ఒట్టు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ బోర్డు సభ్యులు రుక్మిణీరావు సాక్షితో పంచుకున్న వివరాలివి.



చిరుధాన్యాలను పండించడంలో ముందడుగు వేసేశాం. ఇక మన ముందున్న బాధ్యత ఈ విత్తనాలను కాపాడుకోవడం. ఈ విత్తనాల మీద పూర్తి హక్కులు ఈ పేద రైతు మహిళలవే.
– రుక్మిణీరావు, బోర్డు సభ్యులు, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ


తాము పరిరక్షించిన విత్తనాలతో రైతు మహిళలు

ఈ నేల... ఈ విత్తనం... మన సొంతం

‘‘చిరుధాన్యాల పట్ల అవగాహన కోసం ఈ ఏడాదిని ‘ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్’ నిర్వహించుకుంటున్నాం. ఈ ఏడాది సీడ్ డే రోజున మేము చిరుధాన్యాల విత్తనాల పరిరక్షణ, ప్రదర్శన నిర్వహించాం. పస్తాపూర్ కేంద్రంగా జరిగిన ఈ కార్యక్రమంలో 26 పరిసర గ్రామాల నుంచి వందకు పైగా మహిళలు వారు పండించి, పరిరక్షించిన విత్తనాలను తీసుకు వచ్చారు. చిరుధాన్యాలతోపాటు పప్పుధాన్యాలు, నూనె గింజల విత్తనాలు మొత్తం యాభైకి పైగా పంటల విత్తనాలకు ఈ ప్రదర్శన వేదికైంది. ఇవన్నీ సేంద్రియ సేద్యంలో పండించినవే.

ఆహారం -ఆకలి!

ఆహారం మన ఆకలి తీర్చాలి, దేహానికి శక్తినివ్వాలి. ‘వరి అన్నం తిని పొలానికి వెళ్తే పని మొదలు పెట్టిన గంట సేపటికే మళ్లీ ఆకలవుతుంది. రొట్టె తిని వెళ్తే ఎక్కువ సేపు పని చేసుకోగలుగుతున్నాం. అందుకే మేము కొర్రలు, జొన్నలు తింటున్నాం’ అని ఈ మహిళలు చెప్పిన మాటలను తోసిపుచ్చలేదు సైంటిస్టులు. వారి అనుభవం నుంచి పరిశోధన మొదలు పెట్టారు. అందుకే మిల్లెట్స్‌లో దాగి ఉన్న శక్తిని ప్రపంచ వేదికల మీద ప్రదర్శించగలిగారు. అలాగే ఈ మహిళలు విదేశాల్లో రైతు సదస్సులకు హాజరై తమ అనుభవాలను వారితో పంచుకున్నారు. భూగోళం ఎదుర్కొంటున్న మరో విపత్తు క్లైమేట్ చేంజ్. ఈ పంటలైతే వాతావరణ ఒడిదొడుకులను ఎదుర్కొని పంటనిస్తాయి. పదిహేను రోజులు నీరు అందకపోయినప్పటికీ జీవాన్ని నిలుపుకుని ఉంటాయి. చిరుధాన్యాలకు గాను మన ముందున్న బాధ్యత ఈ విత్తనాలను కాపాడుకోవడం. ఎట్టి పరిస్థితుల్లోనూ వీటి మీద హక్కులను కార్పొరేట్ సంస్థలు తన్నుకుపోకుండా చూసుకోవాలి. అవసరమైతే ఉద్యమించాలి. ఇదే మనం డీడీఎస్ స్థాపకులు మిల్లెట్ మ్యాన్ పీవీ సతీశ్‌గారికి ఇచ్చే నివాళి’’ అన్నారు రుక్మిణీరావు.

– వాకా మంజులారెడ్డి

కోపం వస్తే కొందరు ఏంచేస్తారు? దగ్గర్లో ఉన్న వస్తువును నేలకేసి బాదుతారు.
మరింత ముందుకు వెళ్లి తమకు తాము హాని చేసుకుంటారు.
ప్రతికూలత ప్రతిధ్వనించే కోపాన్ని శక్తిగా మలుచుకుంటే అద్భుతాలు సాధించలేమా!
‘అప్నా క్లబ్’ కో-ఫౌండర్, సీయీవో శ్రుతి విజయగాథ ఈ విషయాన్ని చెప్పకనే చెబుతోంది...

గెలుపు బాట

సంకల్ప బలమే సబల విజయం

శ్రుతికి చిన్నప్పటి నుంచి కోపం ఎక్కువ. అయితే అది అకారణ కోపం మాత్రం కాదు.

‘నీకు ముగ్గురూ ఆడపిల్లలేనా. అయ్యో!’ అని తన తండ్రి దగ్గర ఎవరో వాగినప్పుడు...

‘ఈ అమ్మాయిలకు మ్యాథ్స్ బొత్తిగా రాదు’

‘కాలేజీలో సైన్స్ జోలికి వెళ్లవద్దు. ఏదైనా తేలికపాటి సబ్జెక్ట్ తీసుకోండి’ అని క్లాసు టీచర్ ఉచిత సలహాలు ఇచ్చినప్పుడు...

‘అలా గట్టిగా నవ్వుతావేమిటీ? ఆడపిల్లను అనే విషయం మరిచావా’ అని బంధువు ఒకరు అన్నప్పుడు...

ఆమెకు కట్టలు తెచ్చుకునేంత కోపం వచ్చేది. అయితే ఆ కోపాన్ని ఎలా అదుపులో పెట్టుకోవాలో తనకు తెలుసు.


శ్రుతి

‘ఆడపిల్లలకు మ్యాథ్స్ రాదు’ అని వెక్కిరింపు శ్రుతిలో పట్టుదలను పెంచి ఐఐటీ–దిల్లీ వరకు తీసుకెళ్లింది. అయితే అక్కడ కూడా లింగవివక్ష రకరకాల రూపాల్లో వెక్కిరించేది. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు ‘ఇక్కడ ఆడవాళ్లకు ఏం పని?’ ‘స్కోర్ జీరో బ్యాచ్’ ఇలా ఎన్నో వెక్కిరింపులు వినిపించేవి.

తన స్నేహితులతో కలిసి ఎన్నో కప్పులు గెలుచుకొని ఆ వెక్కిరింపులకు గట్టి సమాధానం చెప్పింది శ్రుతి.

చదువు పూర్తయిన తరువాత ఉద్యోగప్రస్థానం మొదలైంది. అయితే అక్కడ కూడా ఏదో రకమైన వివక్షత కనిపించేది.

ఆ తరువాత కాలంలో...

ఉద్యోగం వద్దనుకొని ఒక స్వచ్ఛంద సంస్థలో చేరింది శ్రుతి. అక్కడ మనసు ప్రశాంతంగా అనిపించింది. తన గురించి తాను తీరిగ్గా ఆలోచించుకునే అవకాశం వచ్చింది. ‘ప్రయాణించడానికి దారులు ఎన్నో ఉన్నాయి. సాధించాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి’ అనే ఎరుక ఆమెలో కలిగింది.

‘నువ్వు ఎంబీఏ చేస్తే రాణించగలవు’ అని అక్కడ ఒకరు సలహా ఇచ్చారు.

అలా హార్వర్డ్ బిజినెస్ స్కూల్ (హెచ్‌బీఎస్)లో చేరింది.

ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత ‘సైర్’ పేరుతో టూర్ అండ్ ట్రావెల్ స్టార్టప్‌ను ఆరంభించింది. ఈ స్టార్టప్ నష్టాలు మిగల్చడంతో పాటు విలువైన పాఠాలు నేర్పింది. ఆ పాఠాల వెలుగులో మరో ప్రయాణం మొదలుపెట్టింది శ్రుతి. చిన్న పట్టణాలలో ప్రజలు ఎఫ్‌ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) ప్రాడక్ట్స్ కొనడానికి ఆసక్తిగా ఉన్నారనే విషయం అర్థమైన తరువాత మనీష్ కుమార్‌తో కలిసి ‘అప్నాక్లబ్’ అనే ఎఫ్‌ఎంసీజీ ప్లాట్‌ఫామ్‌ను బెంగళూరు కేంద్రంగా స్టార్ట్ చేసింది.

ఈ ప్లాట్‌ఫామ్ ఒక రేంజ్‌లో సక్సెస్ అయింది. శ్రుతిలో ఎంటర్‌ప్రెన్యూర్ స్కిల్స్ ప్రపంచానికి తెలిసాయి.

‘అప్నాక్లబ్’ బ్యాకర్స్ జాబితాలో టైగర్ గ్లోబల్, ట్రూ స్కేల్ క్యాపిటల్, వైట్‌బోర్డ్ క్యాపిటల్... మొదలైన సంస్థలు ఉన్నాయి.

‘శ్రుతి గొప్ప సంకల్పబలం ఉన్న వ్యక్తి’ అని ప్రశంసిస్తున్నారు వైట్‌బోర్డ్ క్యాపిటల్ పార్ట్‌నర్ అన్షు ప్రషర్.

నిజమే కదా...

‘ఆడపిల్లలకు లెక్కలు రావు’ అనే వెక్కిరింపును సవాలుగా తీసుకొని సంకల్పబలంతో గణితంలో ప్రతిభ ప్రదర్శించింది.

హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో చదువుకునే రోజుల్లో అదృశ్య వివక్షను ఖాతరు చేయకుండా ముందడుగు వేయడానికి ఆ సంకల్పబలమే ఉపయోగపడింది.

స్టార్టప్ యాత్రలో కూడా కామెంట్స్ రూపంలో లింగవివక్షత కనిపించినా, ధైర్యం కోల్పోకుండా ఉండడానికి ఆ సంకల్పబలమే ఉపయోగపడింది. ఎక్కడో మొదలైన సంకల్పబలం ‘అప్నా క్లబ్’ వరకు తనతోనే ఉంది. చీకటి కమ్ముతున్నప్పుడు వెలుగును ఆయుధంగా ఇచ్చింది. ఓటమి వెక్కిరించినప్పుడు గెలుపును ఆయుధంగా ఇచ్చింది.

‘కోపం ఉన్న ఆడవాళ్లను జనాలు అసౌకర్యంగా చూస్తారు. మగవాళ్ల విషయానికి వస్తే యాంగ్రీ యంగ్‌మెన్ అని మురిసిపోతారు’ అంటూ నవ్వుతుంది శ్రుతి.

తనను ‘ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్’గా పిలిపించుకోవడం కంటే ‘ఎంటర్‌ప్రెన్యూర్’గా పిలిపించుకోవడానికే శ్రుతి ఇష్టపడుతుంది.

చిన్నప్పుడు తండ్రి ఒకరోజు అడిగాడు...

‘మ్యాథ్స్‌లో ఎన్ని మార్కులు స్కోర్ చేయాలో తెలుసా?’

‘నన్ను నమ్మండి’ అన్నది శ్రుతి.

అప్పటినుండి తనపై తనకు ఉన్న నమ్మకాన్ని, ఇతరులకు తనపై ఉన్న నమ్మకాన్ని ఎప్పుడూ కోల్పోలేదు శ్రుతి.

సైబర్ టాక్

లోన్ యాప్స్‌తో జాగ్రత్త!!

అదో విషవలయం

అస్తమానం ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్న కొడుకు సుధీర్ (పేరుమార్చడమైనది)ను మందలించింది సుమ (పేరు మార్చడమైనది). తల్లి అరిచేసరికి బయటకు వెళ్లిపోయాడు. ఏంటో ఈ పిల్లలు ఎప్పుడూ ఫోన్‌లోనే ఉంటారు, ఎవరితోనూ ఏమీ మాట్లాడకుండా అనుకుంటూ తిరిగి తన పనిలో పడిపోయింది. కాలేజీ ఫీజు, బుక్స్ అని ఇటీవల డబ్బులు కూడా ఎక్కువే అడుగుతున్నాడు. కొడుకు ఫ్రెండ్‌ను కలిస్తే, ఇటీవల సుధీర్ ప్రవర్తన గురించి, పెరుగుతున్న ఖర్చుల గురించి మాట్లాడింది. సుధీర్ యాప్ లోన్స్ తీసుకొని, ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నాడనే విషయం తెలిసి షాక్ అయ్యింది. వాటివల్ల జరిగే అనర్థాలు ఇటీవల వార్తల్లో విపరీతంగా వినిపిస్తున్నాయి. ఇలాంటప్పుడు ఏం చేయాలో తోచక తలపట్టుకుంది.

•••

విద్యార్థులను, గృహిణులను టార్గెట్ చేస్తూ నకిలీ లోన్ యాప్‌లు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. స్టూడెంట్స్ బలహీనతలను క్యాష్ చేసుకోవడానికి ఫోన్, ఆధార్ నెంబర్లు తీసుకొని ఆకర్షణీయమైన లోన్లతో అట్రాక్ట్ చేస్తూ, ఎక్కువ వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నాయి. తీసుకున్నది వడ్డీతో సహా పూర్తిగా చెల్లించినా తిరిగి తాము కోరిన మొత్తం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. అదనపు మొత్తాన్ని గుంజడానికి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న లోన్ యాప్స్ నుంచి సేఫ్‌గా ఉండటం ఎలాగో ఈ నవతరానికి తప్పక తెలియాలి. కాలేజీ చదువులు చదువుతున్న పిల్లల ద్వారా వచ్చే ఈ లోన్ యాప్ సమస్యలతో తల్లిదండ్రులు విపరీతంగా ఇబ్బంది పడుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి యేటా వందలాది నకిలీ లోన్ యాప్స్ పుట్టుకు రావడం, వాటి నుంచి అనాలోచితంగా డబ్బులు తీసుకుంటూ వేల రూపాయల నుంచి లక్షల రూపాయల దాకా మోసపోతున్నవారిలో యువతరమే కాదు గృహిణులు కూడా ఉంటున్నారు.

అధిక డబ్బు కోసం..

ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం అంటూ లోన్ యాప్ ద్వారా మనీని ఇస్తామనే ప్రకటనలు వస్తుంటాయి. ఉదాహరణకు.. రూ.5000 లోను తీసుకుంటే దానికి ఛార్జీలు, వడ్డీ కట్ చేసుకొని రూ.3000 ఇస్తారు. వీటికి ప్రతిరోజూ వడ్డీ కలిపి, పది రోజుల్లో అంతే మొత్తం కట్టమని బెదిరింపులు వస్తుంటాయి. ఆన్‌లైన్ బెట్టింగ్ లేదా గేమ్‌లో ఎక్కువ మొత్తం వస్తుందనో లేక ఫ్రెండ్స్‌కు పార్టీ ఇవ్వడానికనో అనాలోచితంగా యువతరం చేసే పని ఇలా ఉంటే, గృహిణులు ఇంట్లో ఉండి ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు కదా అని ఆన్‌లైన్ సేవింగ్స్ అంటూ ఈ మార్గాన్ని ఎంచుకుంటూ ఉంటారు. పది రూపాయల నుంచి పది లక్షల వరకు పెట్టుబడిగా పెట్టి, మోసపోయినవారున్నారు.

అవగాహనే పరిష్కారం

సాధారణంగా యాప్ స్టోర్, ప్లే స్టోర్ నుంచి ఈ లోన్ యాప్స్ డౌన్‌లోడ్ చేయం. సోషల్ మీడియాలో, మెసేజ్‌ల ద్వారా వచ్చే షార్ట్ లింక్స్ ద్వారా వీటికి మన వివరాలను అందించడం, మోసపోవడం జరుగుతుంటుంది. సైబర్ క్రైమ్ దృష్టికి తీసుకెళ్లినా అధికారికంగా లేని ఈ యాప్స్‌పై ఎలా కేస్ వేయాలో కూడా తెలియదు. దీనికి అవగాహనే పరిష్కారం తప్ప మరో మార్గం లేదు. టాస్క్ బేస్డ్ ఫ్రాడ్ పేరుతో ఇటీవల సోషల్ మీడియా లైక్‌లకు, కామెంట్స్‌కు, షేర్ చేస్తే డబ్బులు ఇస్తామనే నకిలీ యాప్స్ కూడా పుట్టుకు వస్తున్నాయి. ఈ యాప్స్‌లో ముందస్తుగా కొంత డబ్బు కట్టమని చెబుతారు, సులువైన ప్రక్రియ కదా అని కొంత మొత్తం కట్టి, లాగిన్ అయ్యి మోసపోయేవారుంటున్నారు.

లోన్ ఇచ్చే నెపంతో ఎర

మన దేశంలో చట్టబద్ధమైన మొబైల్ రుణాలు బాగా పెరుగుతున్నాయి. ఇది స్కామర్ల యాప్‌లకు ఒక వరంలా మారింది. ప్లే స్టోర్‌లో చేరిన 200 యాప్స్‌కి పైగా రెండేళ్ల క్రితమే తీసేశారు. కానీ, సోషల్ మీడియా, మెసేజ్ ప్లాట్‌ఫారమ్‌లలో అవే యాప్స్ పేరుతో కొత్తవి ప్రత్యక్షమవుతున్నాయి. లోన్ తీసుకున్నవారు షరతుల ప్రకారం తిరిగి చెల్లిస్తున్నప్పటికీ పరువు తీయడం, వేధింపులు కారణంగా 20కి పైగా ఆత్మహత్య కేసులను చూశాం.

ఇవి ఎలా ఉంటాయంటే..

- బాధితులు తమకు వచ్చిన మెసేజ్‌లు లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో క్లిక్ చేసి, లోన్ కోసం అప్లై చేస్తారు.
- DMZ/APK ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసి, స్కామ్ లోన్‌యాప్‌లను ఇన్‌స్టాల్ చేస్తారు.
- ఈ స్కామ్ యాప్‌లు లోన్ ఇవ్వడానికి రుణగ్రహీత పరిచయాలు, గ్యాలరీ, జీపీఎస్ ప్లేస్ యాక్సెస్ అనుమతులను కోరుతాయి.
- యాక్సెస్ ఓకే చేసిన తర్వాత అన్ని వ్యక్తిగత వివరాలు వారి సర్వర్‌లో అప్‌లోడ్ చేయబడతాయి.
- బాధితులు డాక్యుమెంట్లతో సహా అన్ని వివరాలను అప్‌లోడ్ చేస్తారు. తమ స్మార్ట్ ఫోన్‌లకు యాక్సెస్ చేస్తారు. లోన్ రీ పేమెంట్ వ్యవధి ఏడు నుంచి 15 రోజుల మధ్య ఉంటుంది.
- ప్రాసెసింగ్, జీఎస్టీ, ఇతర ఛార్జీలతో సగానికి పైగా ముందస్తు కోతలు ఉంటాయి.


ప్రతీకాత్మక చిత్రం

మోసాలను గుర్తించండి ఇలా..

- రుణదాతలుగా ఉన్న యాప్స్ ఆర్‌బిఐ వద్ద అధికారికంగా నమోదు చేసి ఉండవు.
- ఈ రుణదాతలు కేవలం రెండు క్లిక్‌లతో రుణాలను అందిస్తారు. మన క్రెడిట్ స్కోర్ కూడా చెక్ చేయరు.
- ఫోన్‌లో అందుబాటులో ఉన్న అన్ని వ్యక్తిగత వివరాలకు, సంప్రదింపు వివరాలకు యాక్సెస్ రిక్వెస్ట్‌పై దృష్టి పెడతారు.
- యాప్ లేదా వెబ్‌సైట్ చిరునామా లేదా సంప్రదించాల్సిన కాంటాక్ట్ నంబర్ లాంటివి ఏమీ ఉండవు.
- కొంతమంది రుణదాతలు ప్రాసెసింగ్ ఫీజు లేదా జీఎస్టీ సాకుతో ముందస్తు చెల్లింపును కూడా డిమాండ్ చేస్తారు.
- రుణ ఆఫర్ త్వరలో ముగుస్తుందని, వెంటనే నిర్ణయం తీసుకోమని అప్లై చేసుకునే వ్యక్తిని తొందర పెడతారు.
- మీ సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రుణాన్ని అందిస్తారు.

- నిర్ణీత సమయంలో రుణం చెల్లించకపోతే వేధింపులు, హెచ్చరికలు మొదలవుతాయి.
- ఫ్రెండ్స్, కుటుంబ సభ్యుల వాట్సప్ గ్రూపులకు పరువు నష్టం కలిగించే సందేశాలను పంపుతారు.
- నకిలీ పోలీసులు ఫోర్జరీ, కోర్టు సమన్లు లాంటివి వాట్సప్ ద్వారా పంపుతుంటారు.
- బాధితులు షరతులకు లోబడి లోను ఎమౌంట్ చెల్లిస్తారు.
- లేదంటే స్కామర్లు ప్రత్యామ్నాయ స్కామ్ యాప్‌ల నుండి రుణం తీసుకునేలా ప్రోత్సహిస్తారు. దీంతో బాధితుడు తెలియకుండా ఒక విష వలయంలో చిక్కుకుంటాడు.

ఎలా రక్షించుకోవాలంటే..

- రుణం తీసుకునే సంస్థ చిరునామాను వెరిఫై చేయండి.
- రుణం కోసం అప్లై చేయడానికి ముందు వెబ్‌సైట్, యాప్ (యాప్ స్టోర్ / ప్లే స్టోర్) చెక్ చేయండి.
- వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా లేదా మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి DMZ లేదా APK ఫైల్స్ ను ఎప్పుడూ డౌన్‌లోడ్ చేయద్దు. యాప్ స్టోర్ లేదా ప్లే స్టోర్ నుండి మాత్రమే డౌన్ లోడ్ చేయాలి.
- సురక్షిత చెల్లింపు కోసం (https://URL with a Pad Lock Symbol) సింబల్‌తో కూడిన యుఆర్‌ఎల్ మాత్రమే చూడాలి.
- OTP/PIN నంబర్లను కొనుగోలుదారు లేదా విక్రేతతో ఏ రూపంలోనూ షేర్ చేయద్దు.
- ఫోన్ మాట్లాడుతున్నప్పుడు ఎలాంటి చెల్లింపు లావాదేవీని చేయకూడదు.
- స్కామర్ అందించిన గూగుల్ ఫారమ్ లింక్‌లను పూరించవద్దు.
- QR కోడ్‌ను ఎప్పుడూ స్కాన్ చేయవద్దు. స్కాన్ చేస్తే, మీ అకౌంట్ నుంచి డబ్బు డెబిట్ అవుతుంది.
- అధికారికంగా రుణం ఇచ్చేవారు ఎప్పుడూ ముందుస్తు ఫీజ్ వసూలు చేయరు. బదులుగా ప్రాసెసింగ్ ఫీ తీసుకుంటారు కానీ, అదీ లోన్ మొత్తం నుంచి బ్యాంకు నిబంధనల ప్రకారం ఛార్జ్ చేస్తారు.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్



- రెండు టేబుల్ స్పూన్ల గోధుమ పిండి, టీ స్పూన్ అవకాడో గుజ్జు, రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి మిశ్రమం తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో మర్దనా చేస్తూ, తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- యాపిల్, ద్రాక్ష గుజ్జు రెండూ సమపాళ్లలో తీసుకొని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. మచ్చలు తగ్గి నిగారింపు పెరుగుతుంది.
- బాగా పండిన ఆపిల్ ఒకటి, ఒక టీ స్పూన్ తేనె, ఒక టీ స్పూన్ ఓట్ మీల్, అర టీ స్పూన్ దాల్చినచెక్క పొడి తీసుకోవాలి. ఆపిల్ గుజ్జులో మిగిలినవన్నీ కలుపుకోవాలి. అవసరమైతే మిక్సీలో బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు ప్యాక్ వేసి పది నిమిషాల తర్వాత చన్నీటితో కడగాలి. ఇది అన్ని రకాల చర్మతత్వాలకు పని చేస్తుంది.

మల్టీ టాలెంట్

బహుముఖ దృశ్యం

‘మా తనిమాకు బోలెడు విద్యలు వచ్చు’ అని మురిసిపోయేవారు తల్లిదండ్రులు.
చిన్నారి తనిమాకు మ్యూజిక్ నుంచి మ్యాజిక్ వరకు ఎన్నో విద్యల్లో ప్రవేశం ఉండేది.
అయితే ఆ బహుముఖ ప్రజ్ఞ బాల్య మధుర జ్ఞాపకంగానే మిగిలిపోలేదు.
ఫొటోగ్రాఫర్, క్రియేటివ్ డైరెక్టర్, రైటర్, ప్రొడ్యూసర్‌గా ఇప్పుడు మంచి పేరు తెచ్చుకుంది...

చిన్న వయసులోనే తల్లిదండ్రులతో పాటు ఇండియా నుంచి ఫ్లోరిడాకు వెళ్లింది తనిమా మెహ్రోత్ర. ఆటపాటల్లోనే కాదు చదువుల్లోను చురుగ్గా ఉండేది. చదువులు పూర్తయిన తరువాత ఒక కార్పొరేట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగంలో చేరింది.

‘గుడ్ శాలరీ. సేఫ్ జాబ్‌కు మించినది ఏం ఉంటుంది?’ అని అనుకుంటాంగానీ తనిమ అనుకోలేదు.

‘దీనికి మించి ఏదో ఉంది!’ అని గట్టిగా అనుకొని ఉద్యోగానికి గుడ్‌బై చెప్పింది.

చేతిలో కెమెరా తీసుకుంది.

ఈ విశాల ప్రపంచాన్ని అందులో నుంచి చూసింది. తనదైన శైలిలో ఎన్నో ఫొటోలు తీసి ప్రశంసలు అందుకుంది.

ఎన్నో ప్రసిద్ధ పత్రికలను ఆమె తీసిన ఫొటోలు అలంకరించాయి.

‘‘గుర్తింపు కోసం కార్పొరేట్ రంగాన్ని వదిలి క్రియేటివ్ ఫీల్డ్‌కి రాలేదు. ‘నా ఆనందం ఎక్కడ ఉంది?’ అని వెదుక్కుంటూ మాత్రమే వచ్చాను. సృజనాత్మకమైన పనులలో అలసట ఉండదు. అలుపెరుగని ఆనందం ఉంటుంది’’ అంటుంది తనిమా మెహ్రోత్ర.


తనిమా మెహ్రోత్ర



ప్రపంచకప్ ఫైనల్స్ టోర్నీకి జ్యోతి సురేఖ అర్హత

ఆర్చరీ సీజన్ ముగింపు టోర్నీ ప్రపంచకప్ ఫైనల్స్‌కు భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ అర్హత సాధించింది. ఈ మెగా టోర్నీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో మెక్సికోలో జరుగుతుంది. తుర్కియేలో గతవారం జరిగిన ప్రపంచకప్ స్టేజ్–1 టోర్నీలో జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకాలు సాధించింది. ఈ ప్రదర్శనతో సురేఖకు మరో మూడు ప్రపంచకప్‌లు మిగిలి ఉండగానే ఫైనల్స్‌కు బెర్త్ దక్కింది. ప్రపంచకప్ స్టేజ్–2 టోర్నీ కొలంబియాలో జూన్ 13 నుంచి 18 వరకు జరుగుతుంది.

సూర్యకుమార్ 'టాప్' ర్యాంక్ పదిలం



భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టి20 ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. గత ఏడాది నవంబర్ 2న సూర్య టాప్ ర్యాంక్‌లోకి దూసుకొచ్చాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సూర్య 906 రేటింగ్ పాయింట్లతో అగ్ర స్థానంలోనే ఉన్నాడు. రిజ్వాన్ (811 పాయింట్లు) రెండో ర్యాంక్‌లో, బాబర్ ఆజమ్ (756 పాయింట్లు) మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

కోల్‌కతా గెలుపు బాట...

- నాలుగు పరాజయాల తర్వాత మళ్లీ విజయం
- బెంగళూరుపై 21 పరుగులతో గెలుపు
- మెరిసిన జేసన్ రాయ్, నితీశ్ రాణా
- రాణించిన వరుణ్ చక్రవర్తి, సుయశ్


జేసన్ రాయ్


'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' వరుణ్ చక్రవర్తి

బెంగళూరు: చిన్నస్వామి స్టేడియం కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మరోసారి కలిసొచ్చింది. నాలుగు వరుస పరాజయాలతో డీలా పడిన జట్టుకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. సమష్టి ప్రదర్శనతో చెలరేగిన కోల్‌కతా మళ్లీ గెలుపు బాట పట్టింది. ఈ మైదానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో జరిగిన గత 11 మ్యాచ్‌ల్లో ఏడుసార్లు నెగ్గిన కోల్‌కతా ఈసారీ తమ ఆధిపత్యాన్ని చాటుకొని 21 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 20 ఓవర్లలో 5 వికెట్లకు 200 పరుగులు సాధించింది. జేసన్ రాయ్ (29 బంతుల్లో 56; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ నితీశ్ రాణా (21 బంతుల్లో 48; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అదరగొట్టారు. చివర్లో రింకూ సింగ్ (10 బంతుల్లో 18 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ వీస్ (3 బంతుల్లో 12 నాటౌట్; 2 సిక్స్‌లు) మెరిశారు. 201 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 179 పరుగులు చేసి ఓడిపోయింది. డుప్లెసిస్ (17; 1 ఫోర్, 2 సిక్స్‌లు), మ్యాక్స్‌వెల్ (5; 1 ఫోర్) తక్కువ స్కోరుకే వెనుదిరగ్గా.. కోహ్లి (37 బంతుల్లో 54; 6 ఫోర్లు), మహిపాల్ (18 బంతుల్లో 34; 1 ఫోర్, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా కీలకదశలో అవుటవ్వడంతో బెంగళూరుకు ఓటమి తప్పలేదు. కోల్‌కతా బౌలర్లు వరుణ్ చక్రవర్తి (3/27), సుయశ్ శర్మ (2/30), రసెల్ (2/29) బెంగళూరును దెబ్బ కొట్టారు.

ధనాధన్ ఆరంభం...

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాకు ఓపెనర్లు జేసన్ రాయ్, జగదీశన్ మెరుపు ఆరంభాన్నిచ్చారు. సిరాజ్ వేసిన తొలి ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన రాయ్.. షహబాజ్ వేసిన ఆరో ఓవర్లో ఏకంగా నాలుగు సిక్స్‌లతో అలరించాడు. తొమ్మిది ఓవర్లకు 82/0తో దూసుకుపోతున్న కోల్‌కతాకు వైశాక్ బ్రేక్ వేశాడు. పదో ఓవర్లో జగదీశన్ (29 బంతుల్లో 27; 4 ఫోర్లు), జేసన్ రాయ్‌లను వైశాక్ అవుట్ చేశాడు.

రెండు క్యాచ్‌లు వదిలేసి...

ఒకే ఓవర్లో రెండు వికెట్లు కోల్పోయినా కోల్‌కతా అదే దూకుడు కొనసాగించింది. కోల్‌కతాకు బెంగళూరు ఫీల్డర్ల నిర్లక్ష్యం కూడా కలిసొచ్చింది. నితీశ్ రాణా వ్యక్తిగత స్కోరు 5 వద్ద సిరాజ్.. నితీశ్ రాణా వ్యక్తిగత స్కోరు 19 వద్ద హర్షల్ పటేల్ క్యాచ్‌లు జారవిడిచారు. ఈ రెండు అవకాశాలను సద్వినియోగం చేసుకున్న రాణా కదంతొక్కాడు. హర్షల్ పటేల్ వేసిన 16వ ఓవర్‌లోని చివరి రెండు బంతులను సిక్స్‌లుగా మలిచిన రాణా... వైశాక్ వేసిన 17వ ఓవర్‌లోని చివరి మూడు బంతుల్లో 4,4,6తో మెరిశాడు. 17 ఓవర్లు ముగిసేసరికి కోల్‌కతా 167/2తో నిలిచింది. అయితే 18వ ఓవర్లో హసరంగ స్పిన్‌కు నితీశ్ రాణా, వెంకటేశ్ అయ్యర్ (26 బంతుల్లో 31; 3 ఫోర్లు) పెవిలియన్ చేరారు. ఈ ఓవర్లో హసరంగ 3 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. అయితే సిరాజ్ వేసిన 19వ ఓవర్ తొలి మూడు బంతుల్లో రింకూ సింగ్ 6,4,4 కొట్టగా... ఐదో బంతికి రసెల్‌ను సిరాజ్ బౌల్డ్ చేశాడు. హర్షల్ పటేల్ వేసిన చివరి ఓవర్లో వీస్ రెండు సిక్స్‌లు కొట్టడంతో కోల్‌కతా స్కోరు 200కు చేరింది.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (బి) వైశాక్ 56; జగదీశన్ (సి) విల్లీ (బి) వైశాక్ 27; వెంకటేశ్ అయ్యర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) హసరంగ 31; నితీశ్ రాణా (సి) వైశాక్ (బి) హసరంగ 48; రసెల్ (బి) సిరాజ్ 1; రింకూ సింగ్ (నాటౌట్) 18; డేవిడ్ వీస్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (20 ఓవర్లలో 5 వికెట్లకు) 200. **వికెట్ల పతనం:** 1–83, 2–88, 3–168, 4–169, 5–185. **బౌలింగ్:** సిరాజ్ 4–0–33–1, విల్లీ 3–0–31–0, హసరంగ 4–0–24–2, షహబాజ్ అహ్మద్ 1–0–25–0, వైశాక్ 4–0–41–2, హర్షల్ పటేల్ 4–0–44–0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) వెంకటేశ్ అయ్యర్ (బి) రసెల్ 54; డుప్లెసిస్ (సి) రింకూ సింగ్ (బి) సుయశ్ శర్మ 17; షహబాజ్ అహ్మద్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సుయశ్ శర్మ 2; మ్యాక్స్‌వెల్ (సి) నితీశ్ రాణా (బి) వరుణ్ 5; మహిపాల్ (సి) రసెల్ (బి) వరుణ్ 34; దినేశ్ కార్తీక్ (సి) రింకూ సింగ్ (బి) వరుణ్ 22; ప్రభుదేశాయ్ (రనౌట్) 10; హసరంగ (సి) అనుకూల్ రాయ్ (సబ్) (బి) రసెల్ 5; విల్లీ (నాటౌట్) 11; వైశాక్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 179. **వికెట్ల పతనం:** 1–31, 2–51, 3–58, 4–113, 5–115, 6–137, 7–152, 8–154. **బౌలింగ్:** వైభవ్ అరోరా 2–0–22–0, ఉమేశ్ యాదవ్ 1–0–19–0, సుయశ్ శర్మ 4–0–30–2, వరుణ్ చక్రవర్తి 4–0–27–3, రసెల్ 4–0–29–2, సునీల్ నరైన్ 4–0–41–0, నితీశ్ రాణా 1–0–8–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	0.662
గుజరాత్	7	5	2	10	0.580
రాజస్తాన్	7	4	3	8	0.844
లక్నో	7	4	3	8	0.547
బెంగళూరు	8	4	4	8	-0.139
పంజాబ్	7	4	3	8	-0.162
కోల్‌కతా	8	3	5	6	-0.027
ముంబై	7	3	4	6	-0.620
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

మా 'మన్‌కీ బాత్' వినండి!

- ప్రధానికి రెజ్లర్ల విజ్ఞప్తి
- కొనసాగుతున్న నిరసన
- రోడ్డుపైనే ప్రాక్టీస్ ప్రారంభం


బజరంగ్ పూనియా, సంగీత ఫొగాట్, వినేశ్ ఫొగాట్

న్యూఢిల్లీ: తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధానిలో నిరసన కొనసాగిస్తున్న భారత రెజ్లర్లు ఇప్పుడు ఈ విషయంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. తాము విజయం సాధించినప్పుడు ఫోటోలు దిగి ఉత్సాహపరచిన ప్రధాని తమ గోడును పట్టించుకోకపోవడంపై వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రధాని రేడియో కార్యక్రమం 'మన్‌కీ బాత్' (మనసులో మాట)ను ఉద్దేశించి రెజ్లర్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని బేటీ బచావో, బేటీ పడావో గురించి మాట్లాడుతారు. అందరి మనసులో మాటను వింటారు. కానీ మా 'మన్‌కీ బాత్'ను ఆయన వినలేరా. మేం విజయాలు సాధించినప్పుడు ఇంటికి పిలిచి గౌరవించడంతో పాటు మమ్మల్ని తన బిడ్డలంటూ చెప్పుకున్నారు. ఈ రోజు మా బాధ వినాలని ఆయనను అభ్యర్థిస్తున్నాం' అని 2016 రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్ వ్యాఖ్యానించింది. నాలుగు రోజులుగా తాము రోడ్లపై పడుకుంటున్నా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కనీసం పట్టించుకోవడం లేదని సాక్షి విమర్శించింది. 'బహుశా నిజం ఏమిటో ప్రధానికి తెలియకపోవచ్చు. అందుకే వ్యక్తిగతంగా కలిసి సమస్యను చెప్పాలని కోరుకుంటున్నాం. అయితే ఆయనను కలిసే మార్గం ఏమిటో మాకు తెలియడం లేదు' అని వినేశ్ ఫొగాట్ చెప్పింది. నిరసన కొనసాగిస్తున్న రెజ్లర్లు బుధవారం రోడ్డుపైనే తమ ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. కోచ్ సుజీత్ మాన్ నేతృత్వంలో అక్కడే సాధన చేసిన వారు... తమకు మరో గత్యంతరం లేదని పేర్కొన్నారు. మరోవైపు బీజింగ్ ఒలింపిక్స్ స్వర్ణపతక విజేత, షూటర్ అభినవ్ బింద్రా సోషల్ మీడియా ద్వారా రెజ్లర్లకు తన మద్దతు ప్రకటించాడు. దేశానికే ప్రాతినిధ్యం వహించేందుకు ఎంతో కష్టపడే ఆటగాళ్లు ఇలా రోడ్లపై రావాల్సి రావడం చాలా బాధగా ఉందని అతను అన్నాడు.

శ్రీలంక దీటైన జవాబు

కరుణరత్నే, మదుష్కా సెంచరీలు



గాలె: ఐర్లాండ్ జట్టుతో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక జట్టు దీటైన జవాబు ఇచ్చింది. వర్షం కారణంగా మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 357 పరుగులు సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 81/0 ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 59 ఓవర్లలో 276 పరుగులు చేసింది. ఓపెనర్లు దిముత్ కరుణరత్నే (133 బంతుల్లో 115; 15 ఫోర్లు), నిషాన్ మదుష్కా (234 బంతుల్లో 149 బ్యాటింగ్; 18 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో కదంతొక్కారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 228 పరుగులు జోడించారు. నిషాన్‌తో కలిసి ప్రస్తుతం కుశాల్ మెండిస్ (96 బంతుల్లో 83 బ్యాటింగ్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) క్రీజులో ఉన్నాడు. ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 492కు శ్రీలంక మరో 135 పరుగుల దూరంలో ఉంది.

సింధు శుభారంభం

- శ్రీకాంత్, ప్రణయ్ కూడా ముందంజ
- తొలి రౌండ్‌లోనే లక్ష్య సేన్ ఓటమి



దుబాయ్: స్వర్ణ పతకమే లక్ష్యంగా ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు 21–15, 22–20తో ప్రపంచ 17వ ర్యాంకర్ వెన్ చి సు (చైనీస్ తైపీ)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. 46 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో సింధు 11–14తో వెనుకబడింది. ఈ దశలో సింధు ఒక్కసారిగా చెలరేగి వరుసగా తొమ్మిది పాయింట్లు గెలిచి 20–14తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఒక పాయింట్ కోల్పోయిన సింధు వెంటనే మరో పాయింట్ నెగ్గి గేమ్ దక్కించుకుంది. రెండో గేమ్ హోరాహోరీగా సాగినా కీలకదశలో సింధు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో తొమ్మిదో ర్యాంకర్ హాన్ యువె (చైనా)తో సింధు ఆడుతుంది.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కిడాంబి శ్రీకాంత్ 21–13, 21–8తో అద్నాన్ ఇబ్రహీం (బహ్రెయిన్)పై, ప్రణయ్ 21–14, 21–9తో ఫోన్ ప్యాయె నైంగ్ (మయన్మార్)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరారు. లక్ష్య సేన్ 7–21, 21–23తో లో కీన్ యెవ్ (సింగపూర్) చేతిలో ఓటమి చవిచూశాడు.

సిక్కి–రోహన్ జోడీ విజయం

మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జోడీ 21–12, 21–16తో చాన్ పెంగ్ సూన్–చె యి సీ (మలేసియా) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం 17–21, 21–17, 21–18తో లానీ ట్రియ మాయసరి–రిబ్కా సుగియార్తో (ఇండోనేసియా) జోడీపై నెగ్గింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 21–14, 21–17తో టాన్ కియాన్ మెంగ్–టాన్ వీ కియాంగ్ (మలేసియా) జోడీపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

సినిమా

ఎన్టీఆర్‌తో సినిమా చేయాలనుంది

– దర్శకుడు జేమ్స్ గన్


● ఎన్టీఆర్


● జేమ్స్ గన్

'ఆర్ఆర్ఆర్' సినిమా ఆస్కార్ అవార్డు సాధించిన నేపథ్యంలో హాలీవుడ్‌వారి దృష్టి ముఖ్యంగా ఈ చిత్రంలో నటించిన ఎన్టీఆర్, రామ్‌చరణ్‌పై పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌తో ఓ సినిమా చేయాలని ఉందని హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు ('గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ' ఫ్రాంచైజీ ఫేమ్) జేమ్స్ గన్ పేర్కొన్నారు ''మీ 'గార్డియన్ ఆఫ్ గెలాక్సీ' తదుపరి భాగాల్లోకి ఏ ఇండియన్ యాక్టర్‌ని ఆహ్వానించాలనుకుంటున్నారు? అన్న ప్రశ్నకు సమాధానంగా ఎన్టీఆర్ పేరును ప్రస్తావించారు జేమ్స్. ''ఆర్ఆర్ఆర్'లో ఎన్టీఆర్ నటన బాగుంది. ముఖ్యంగా ఇంట్రవెల్ సీన్‌లో తన నటన అద్భుతం'' అన్నారు జేమ్స్. మరి... ఈ హాలీవుడ్ దర్శకుడు, టాలీవుడ్ హీరో కాంబినేషన్‌లో సినిమా సెట్టవుతుందా అంటే... కాలమే చెప్పాలి.

మర్డర్ మిస్టరీ

కార్తీక్ రత్నం, గోల్డీ నిస్సీ జంటగా, రవిబాబు, సత్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఛాంగురే బంగారు రాజా'. సతీష్ వర్మ దర్శకుడు. హీరో రవితేజ ఆర్ టీ టీమ్‌వర్క్స్, ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్ పతాకాలపై శ్వేత కాకర్లపూడి, షాలిని నంబు ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్స్‌గా వర్క్ చేశారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా టీజర్‌ను బుధవారం రవితేజ విడుదల చేశారు. సునీల్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమయ్యే ఈ టీజర్‌లో 'నా చేతిలో డబ్బులు పడితే కానీ మీ జీపుపై నేను చేతులు పెట్టను', 'ఆ మర్డర్ చేసింది నేను కాదు' అనే డైలాగ్స్ ఉన్నాయి. ఓ కుక్క, ముగ్గురు వ్యక్తులు ఓ హత్య కేసును ఛేదించడంలో ఎలా భాగస్వాములయ్యారు? అసలు హంతకుడు ఎవరు? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా టీజర్ సాగుతుంది. ఈ సినిమాకు సంగీతం: కృష్ణ సౌరభ్, కెమెరా: సుందర్ ఎన్‌సి.


● కార్తీక్ రామ్, గోల్డీ, రవితేజ


● సమంత

ఆస్కార్ నైన్టీసిక్స్‌కి డేట్ ఫిక్స్



95వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరిగి నెలన్నర (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13) అవుతోంది. అప్పుడే 96వ ఆస్కార్ అవార్డులకు సంబంధించిన ప్లాన్ మొదలుపెట్టింది కమిటీ. వచ్చే ఏడాది మార్చి 10న ఆస్కార్ వేడుక జరపనున్నట్లు ప్రకటించి, ఇందుకు సంబంధించిన కొన్ని కీలకమైన తేదీలను కూడా వెల్లడించారు నిర్వాహకులు. 96వ ఆస్కార్ అవార్డుల షార్ట్ లిస్ట్‌ను ఈ ఏడాది డిసెంబరు 21న ప్రకటిస్తారు. నామినేషన్స్‌ను వచ్చే ఏడాది జనవరి 23న వెల్లడిస్తారు. ఆస్కార్ విజేతల ఎంపికకు ఫిబ్రవరి 22న ఓటింగ్ ఆరంభించి, 27 వరకూ కొనసాగిస్తారు. అవార్డుల ప్రదానోత్సవం మార్చి 10న జరుగుతుంది. ఇక జనరల్ ఎంట్రీ కేటగిరీలో అవార్డుల దరఖాస్తుల స్వీకరణకు నవంబరు 15 చివరి తేదీగా పేర్కొంది కమిటీ. మొత్తం 23 విభాగాల్లో ఆస్కార్ అవార్డులను అందిస్తారు.

పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

– గోపీచంద్


● వివేక్ కూచిభొట్ల, గోపీచంద్, డింపుల్ హయతి, శ్రీవాస్

''శ్రీవాస్‌గారితో 'లక్ష్యం, లౌక్యం' సినిమాలు చేశాను. మూడో సినిమాగా 'రామబాణం' చేద్దామనుకున్నప్పుడు ఆ రెండు సినిమాల్లా పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేయాలనుకున్నాం. అలాగే చేశాం. 'రామబాణం' వంటి మంచి సినిమా తీసిన విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్లగార్లకు థ్యాంక్స్. అందరికీ మా సినిమా తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని హీరో గోపీచంద్ అన్నారు. శ్రీవాస్ దర్శకత్వంలో గోపీచంద్, డింపుల్ హయతి జంటగా నటించిన చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో శ్రీవాస్ మాట్లాడుతూ– ''రామబాణం' ఔట్‌పుట్ చూశాక నమ్మకంగా ఉన్నాం. ఇంటర్వెల్, క్లయిమాక్స్ హైలెట్ అవుతాయి. సెకండ్ హాఫ్‌లోని భావోద్వేగ సన్నివేశాలు కుటుంబ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయి'' అన్నారు. ''ఈ వేసవిలో ప్రతి ఫ్యామిలీ చూడదగ్గ సినిమా ఇది'' అన్నారు సహనిర్మాత వివేక్ కూచిభొట్ల.

ముప్పై ఏళ్లు వెనక్కి...

విశ్వక్ సేన్ హీరోగా నటించనున్న కొత్త చిత్రం బుధవారం ఆరంభమైంది. తొలి సీన్‌కి నిర్మాత సుధాకర్ చెరుకూరి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ ఇచ్చారు. నిర్మాత వెంకట్ బోయనపల్లి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకులు వెంకీ అట్లూరి, నిర్మాత రామ్ ఆచంట స్క్రిప్ట్‌ను చిత్ర యూనిట్‌కు అందించారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న చిత్రం ఇది. ''1990వ దశకంలో రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జరిగిన కథతో ఈ చిత్రం ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, కెమెరా: అనిత్ మధాది.


● విశ్వక్ సేన్, 'దిల్' రాజు

సమంతపై అభిమానంతో...


● సమంత విగ్రహం

అభిమాన తారల కోసం కొందరు ఫ్యాన్స్ గుడి కూడా కట్టేస్తారు. అలా ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చుండూరు మండలం ఆలపాడుకు చెందిన సమంత ఫ్యాన్ సందీప్ ఆమె కోసం గుడి కడుతున్నారు. ప్రత్యూష ఫౌండేషన్ ద్వారా చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్స్ చేయిస్తూ, ఆ చిన్నారులకు పునర్జన్మను ప్రసాదించేందుకు సమంత చూపిన చొరవే తన అభిమానానికి కారణమన్నట్లుగా సందీప్ పేర్కొన్నారు. అలాగే సమంత మయోసైటిస్ వ్యాధి నుంచి కోలుకోవాలని తిరుపతి, నాగపట్నం, చెన్నైలకు మొక్కుబడి యాత్రలు చేశారట సందీప్. ఈ నెల 28న సమంత బర్త్ డే సందర్భంగా ఈ గుడిని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని సమాచారం.

డైరెక్షన్ ఆలోచన ఉంది

– నిర్మాత అనిల్ సుంకర



''ఏజెంట్' ఒక యాక్షన్ ఫిల్మ్. ముగ్గురు ఏజెంట్స్ మధ్య జరిగే కథ ఇది. కథ భిన్నంగా ఉంటుంది. భావోద్వేగాలు కూడా బలంగా ఉంటాయి. అఖిల్ కెరీర్‌లో 'ఏజెంట్'కి ముందు, 'ఏజెంట్'కి తర్వాత అనేలా ఉంటుంది. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉంటాయి. ప్రేక్షకులకు గొప్ప అనుభూతి ఇచ్చే చిత్రం ఇది'' అని నిర్మాత అనిల్ సుంకర అన్నారు. అఖిల్ అక్కినేని, సాక్షీ వైద్య జంటగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏజెంట్'. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనిల్ సుంకర మాట్లాడుతూ– ''ఇప్పుడు యంగ్ హీరోలు డూప్ లేకుండా చేయడానికి ఇష్టపడుతున్నారు. అయితే ఒక నిర్మాతగా సేఫ్టీ చూసుకోమని యాక్షన్ కొరియోగ్రాఫర్‌కి చెప్తాను. ఈ మధ్య విజయవాడలో జరిగిన ప్రమోషనల్ ఈవెంట్‌లో అఖిల్ దాదాపు 170 అడుగుల ఎత్తు నుంచి దూకాడు. రోప్స్ కట్టినప్పటికీ రిస్క్ ఎందుకని నేను వద్దన్నాను. అయితే అఖిల్ చేస్తానన్నాడు. క్రెడిట్ అంతా తనకే దక్కుతుంది. 'ఏజెంట్'లో ప్రేక్షకులు ఇలాంటి సాహసాలు చాలా చూస్తారు. ఇది భారీ స్పాన్ ఉన్న సినిమా. ఇందులో గంటన్నర కంప్యూటర్ గ్రాఫిక్స్ ఉంటాయి. అందుకే చాలా సమయం పట్టింది. 'ఏజెంట్'ని ముందు తెలుగులో రిలీజ్ చేసి, రెండో వారం నుంచి ఇతర భాషల్లో విడుదల చేసే ఆలోచనలో ఉన్నాం. హిందీలో ఇప్పటికే డబ్బింగ్ పూర్తయింది. నాకు దర్శకత్వం చేసే ఆలోచన ఉంది. నా డైరెక్షన్‌లో స్పై జోనర్‌లో సినిమా ఉంటుంది. మా 14 రీల్స్ బ్యానర్‌లో ఈ ఏడాది బిగ్గెస్ట్ అనౌన్స్‌మెంట్స్ ఉంటాయి. ప్రస్తుతం చిరంజీవిగారితో నిర్మిస్తున్న 'భోళా శంకర్' సినిమా యాక్షన్ సీన్స్ జరుగుతున్నాయి. ఆగస్ట్ 11న ఈ సినిమా విడుదలకి డేట్ ఫిక్స్ చేశాం'' అన్నారు.

నిర్మాతలను మించిన నటులు లేరు

– బెక్కెం వేణుగోపాల్



''ప్రస్తుతం తెలుగులో కథ కంటే కాంబినేషన్‌ని నమ్ముకుని ఎక్కువగా సినిమాలు చేస్తున్నారు నిర్మాతలు. దానివల్ల సినిమా సూపర్ హిట్టయినా లాభాలు రావడం లేదు. కాంబినేషన్‌ని నమ్ముకుని పారితోషికాలు పెంచడం వల్ల బడ్జెట్ ఊహించని స్థాయికి చేరుకుంటోంది'' అన్నారు నిర్మాత బెక్కెం వేణుగోపాల్. నేడు బెక్కెం వేణుగోపాల్ బర్త్ డే. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''2006 అక్టోబర్ 12న నిర్మాతగా నా తొలి చిత్రం 'టాటా బిర్లా మధ్యలో లైలా' విడుదలైంది. మొదటి చిత్రంతోనే హిట్ అందుకున్నాను. ఈ 16 ఏళ్లల్లో సొంతంగా 12 సినిమాలు, వేరే బ్యానర్లతో కలిసి 4 సినిమాలు నిర్మించాను. స్టార్ హీరోలతో, భారీ బడ్జెట్ సినిమాలు తీసేందుకు రెండు కథలు సిద్ధంగా ఉన్నాయి. ఇక నిర్మాతలను మించిన నటులు ఎవరూ ఉండరు. అప్పుడప్పుడు లోపల అగ్నిపర్వతం బద్దలవుతున్నా బయటికి మాత్రం శాంతంగా ఉండాల్సిన పరిస్థితి. భవిష్యత్‌లో చిన్న చిన్న పాత్రల్లో నటించాలనుంది. కానీ, దర్శకత్వ ఆలోచన లేదు. ప్రస్తుతం కొత్తవాళ్లతో 'రోటి కపడా రొమాన్స్', సుడిగాలి సుధీర్‌తో నరేష్ దర్శకత్వంలో నిర్మాత చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మరో మూవీ చేస్తున్నాను. అవికా గోర్ ప్రధాన పాత్రలో స్వరూప్ దర్శకత్వంలో ఓటీటీ కోసం ఓ మూవీ నిర్మిస్తున్నాను'' అన్నారు.

మంచి ప్రేమకథ

రోషన్ .జెడ్, ముస్తఫా అస్కరి, శ్రీనివాస్ ప్రభన్, అనిరుధ్ .టి, లయ, ఇందు, శ్రీవల్లి, విజయ, సాయిశ్రీ, జబర్దస్త్ సత్తిపండు కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అరంగేట్రం'. శ్రీనివాస్ ప్రభన్ దర్శకత్వంలో మహేశ్వరి .కె నిర్మించిన ఈ సినిమా మే 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకలో శ్రీనివాస్ ప్రభన్ మాట్లాడుతూ– ''పక్కా కమర్షియల్ మూవీ 'అరంగేట్రం'. సైకో, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌తో పాటు మంచి ప్రేమ కథ ఉంటుంది. ఆరుగురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిల మధ్య ప్రధానంగా సాగే సినిమా ఇది'' అన్నారు. ''మా 'అరంగేట్రం' చాలా బాగా వచ్చింది'' అన్నారు మహేశ్వరి. ''మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమాను నిర్మించాం'' అన్నారు సహనిర్మాత విజయలక్ష్మి.


● విజయలక్ష్మి, మహేశ్వరి, రోషన్, శ్రీనివాస్ ప్రభన్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	170	60,301
నిఫ్టీ ▲	44	17,814

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	11,917	▲ 118
డోజోన్స్	33,475	▽ 56
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,853	▽ 38
డాక్స్	15,796	▽ 76
షాంఘై	3,264	▽ 1
నికాయ్	28,416	▽ 204

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) – ముంబై

బంగారం (24 క్యారెట్)	60,431	▲ 353
బంగారం (22 క్యారెట్)	60,189	▲ 352
వెండి (కేజీ)	74,200	▲ 125

మారుతీ లాభం జూమ్

- క్యూ4లో రూ. 2,671 కోట్లు; 42 శాతం హైజంప్
- అమ్మకాలు: రూ. 32,060 కోట్లు
- షేరుకి రికార్డ్ డివిడెండ్ రూ. 90

న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 42 శాతం జంప్‌చేసి రూ. 2,671 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది (2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 1,876 కోట్లు ఆర్జించింది. వాహన అమ్మకాలతోపాటు, ధరలు మెరుగుపడటం, ఫారెక్స్ సానుకూలతలు అధిక లాభాలకు దోహదం చేశాయి. మొత్తం అమ్మకాలు సైతం రూ. 26,749 కోట్ల నుంచి రూ. 32,060 కోట్లకు ఎగశాయి. కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా ఒక్కో షేరుకీ రూ. 90 చొప్పున వాటాదారులకు డివిడెండును ప్రకటించింది. క్యూ4లో 5 శాతంపైగా వృద్ధితో 5,14,927 వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీయంగా 4,50,208 యూనిట్లు విక్రయించింది. ఇది 7 శాతం వృద్ధి. అయితే ఎగుమతులు 68,454 యూనిట్ల నుంచి 64,719కు తగ్గాయి.

పూర్తి ఏడాదిలోనూ..

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మారుతీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 8,211 కోట్లకు దూసుకెళ్లింది. 2021–22లో రూ. 3,879 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర అమ్మకాలు రూ. 88,330 కోట్ల నుంచి రూ. 1,17,571 కోట్లకు జంప్ చేశాయి. ఈ కాలంలో 19 శాతం అధికంగా 19,66,164 వాహనాలను విక్రయించింది.



ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు స్వల్ప లాభంతో రూ. 8,503వద్ద ముగిసింది.

కొత్త ప్లాంట్‌కు ఓకే...

ఎగుమతులతో సహా దేశీ మార్కెట్లో డిమాండుకు అనుగుణంగా ఏడాదికి 10 లక్షల కార్ల వరకూ తయారు చేయగల అదనపు ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు మారుతీ తెలియజేసింది. ఇందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించింది. ప్రస్తుత ఏడాది (2023–24)లో రూ. 8,000 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు పేర్కొంది. గతేడాది రూ. 6,300 కోట్లు కేటాయించింది. కంపెనీ చేతిలో మార్చికల్లా రూ. 45,000 కోట్ల నగదు నిల్వలున్నాయి. హర్యానాలోని సోనిపట్‌లో రూ. 11,000 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేస్తున్న 2.5 లక్షల యూనిట్ల (తొలిదశ) వార్షిక సామర్థ్య ప్లాంటు 2025లో ప్రారంభంకావచ్చని మారుతీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు.

రూ.8 లక్షలకే ఎలక్ట్రిక్ కారు!

భారత మార్కెట్లో ఎంజీ కామెట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ ఎంజీ మోటార్ ఇండియా దేశీయ మార్కెట్లో చౌకైన ఎలక్ట్రిక్ వెహికిల్ కామెట్‌ను ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.7.98 లక్షలు.



ఒకసారి చార్జింగ్‌తో 230 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 17.3 కిలోవాట్ అవర్ లిథియం అయాన్ బ్యాటరీ పొందుపరిచారు. ఏడు గంటల్లో చార్జింగ్ పూర్తి అవుతుంది. రెండు డోర్లు, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, రెండు ఎయిర్‌బ్యాగ్స్, రివర్స్ పార్కింగ్ కెమెరా వంటి హంగులు ఉన్నాయి. ఎలక్ట్రిక్ విభాగంలో ఎంజీ ఇప్పటికే భారత్‌లో జడ్‌ఎస్ ఈవీ మోడల్‌ను విక్రయిస్తోంది. గుజరాత్‌లోని హలోల్ ప్లాంటులో కామెట్ కార్లను తయారు చేస్తున్నారు.

ద్రవరూప డీఏపీ, యూరియా వాడండి

- ఖర్చు తక్కువ, దిగుబడి ఎక్కువ
- రైతులకు కేంద్ర మంత్రి అమిత్‌షా సూచన
- వాణిజ్య విక్రయాలు ప్రారంభం

న్యూఢిల్లీ: రైతులు సాగులో ద్రవరూప నానో డీఏపీ, యూరియాను వినియోగించాలని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా సూచించారు. ఈ ఉత్పత్తులను విరివిగా ఉపయోగించడం ద్వారా ఎరువుల తయారీలో దేశాన్ని స్వావలంబన భారత్‌గా మార్చాలని రైతులకు పిలుపునిచ్చారు. దీని వల్ల దిగుమతులపై ఆధారపడడం తగ్గుతుందన్నారు. ఇఫ్కో నానో (ద్రవరూప) డీఏపీ వాణిజ్య విక్రయాలను మంత్రి బుధవారం ఢిల్లీలో ప్రారంభించి, మాట్లాడారు. ఇఫ్కో ద్రవరూప నానో డీఏపీ 500 ఎంఎల్ బాటిల్‌ను రూ.600కు విక్రయించనున్నారు. అదే సంప్రదాయ 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ.1,350గా ఉంది. సాగులో ద్రవరూప ఉత్పత్తులను వినియోగించడం వల్ల నాణ్యతతోపాటు దిగుబడి కూడా పెరుగుతుందని మంత్రి అమిత్‌షా అన్నారు. భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. ద్రవరూప డీఏపీతో సాగు ఖర్చులు 6 శాతం నుంచి 20 శాతం వరకు తగ్గుతాయని చెప్పారు. అలాగే ద్రవరూప ఎరువుల రవాణా, నిల్వ కూడా సులభం. ద్రవరూప ఎరువులు భారత్‌ను స్వావలంబన దిశగా నడిపిస్తాయన్నారు. 2021–22లో 91.36 లక్షల టన్నుల యూరియా, 54.62 లక్షల టన్నుల డీఏపీ, 24.60 లక్షల టన్నుల ఎంవోపీ, 11.70 లక్షల టన్నుల ఎన్‌పీకే ఎరువులను దిగుమతి చేసుకున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇఫ్కో తయారు చేసిన నానో డీఏపీకి 20 ఏళ్ల కాలానికి పేటెంట్ వచ్చినట్టు మంత్రి అమిత్‌షా తెలిపారు.



నానో డీఏపీని విడుదల చేస్తున్న అమిత్‌షా

ప్రపంచ వ్యాప్తంగా జోస్ అలుక్కాస్ భారీ విస్తరణ

100 కొత్త షోరూమ్‌ల ఏర్పాటు లక్ష్యం



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ రిటైల్ చైన్ జోస్ అలుక్కాస్ రూ.5,500 కోట్లతో ప్రపంచ వ్యాప్తంగా భారీ విస్తరణ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ప్రపంచ వ్యాప్తంగా 100 కొత్త షోరూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. దేశంలోని ఒక జ్యువెల్లరీ రిటైల్ బ్రాండ్ రానున్న 8 సంవత్సరాల్లో చేపడుతున్న భారీ విస్తరణ కార్యక్రమం ఇదని వివరించింది. నిధులు, రియల్టీ సమకూరితే 4 సంవత్సరాల్లోనే తమ విస్తరణ కార్యక్రమం పూర్తవుతుందని వివరించింది. సంస్థ విస్తరణ ప్రణాళికకు సంబంధించి చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో జోస్ అలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు జాన్ అలుక్కా, వర్గీస్ అలుక్కా, చైర్మన్ జోస్ అలుక్కా, నటుడు ఆర్ మాధవన్, కంపెనీ ఎండీ పాల్ అలుక్కా పాల్గొన్నారు. (చిత్రంలో ఎడమ నుంచి). ప్రస్తుతం 50 స్టోర్లను కలిగిన జ్యువెల్లరీ గ్రూప్ గ్లోబల్ అంబాసిడర్‌గా నటుడు మాధవన్ ఉన్నారు. నటి కీర్తి సురేశ్‌ను కూడా సంస్థ ప్రచారకర్తగా నియమించుకుంది.

5 ఏళ్లు.. 50 బిలియన్ డాలర్లు!

- వైద్య పరికరాల రంగానికి ప్రత్యేక విధానం
- నేషనల్ మెడికల్ డివైజెస్ పాలసీ 2023కి కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- దేశీయంగా తయారీకి మరింత ఊతం

న్యూఢిల్లీ: వైద్య రంగంలో ఉపయోగించే పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడకుండా దేశీయంగానే తయారీకి ఊతమివ్వడంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా నేషనల్ మెడికల్ డివైజెస్ పాలసీ 2023కి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. వైద్య పరికరాల రంగం వచ్చే అయిదేళ్లలో 50 బిలియన్ డాలర్ల స్థాయికి (దాదాపు రూ. 4.1 లక్షల కోట్లు) చేరేందుకు ఇది తోడ్పడనుంది. భారత్‌లో వైద్య పరికరాలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతుండటంతో వీటిని దేశీయంగానే ఉత్పత్తి చేయడాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని క్యాబినెట్ సమావేశం అనంతరం కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మీడియాకు తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో దిగుమతులు కూడా ఉంటాయని, అయితే సాధ్యమైనంత మేరకు స్థానిక అవసరాలకు అనుగుణంగా దేశీయంగానే ఉత్పత్తిని పెంచుకోవడమే కొత్త విధానం లక్ష్యమని వివరించారు.



ఆరు వ్యూహాలు..: నేషనల్ మెడికల్ డివైజెస్ పాలసీలో ఆరు వ్యూహాలను నిర్దేశించుకున్నారు. నియంత్రణ విధానాలను క్రమబద్ధీకరించడం, మౌలిక సదుపాయాల కల్పన, పరిశోధన.. అభివృద్ధి.. ఆవిష్కరణలకు తోడ్పాటు అందించడం, పరిశ్రమలోకి పెట్టుబడులను ఆకర్షించడం, మానవ వనరుల అభివృద్ధి, మన పరిశ్రమకు బ్రాండింగ్ సాధించడం .. అవగాహన కల్పించడం వంటివి ఈ వ్యూహాల్లో ఉన్నాయి. ఇటు భారత్, అటు ప్రపంచ హెల్త్‌కేర్ అవసరాలను తీర్చే దిశగా దేశీయంగా వైద్య పరికరాల రంగం స్వయం సమృద్ధి సాధించేలా, ఒడుదుడుకులను సమర్థంగా ఎదుర్కొంటూ పటిష్టమైన పరిశ్రమగా ఎదిగేలా అవసరమైన మద్దతు కల్పించి, దిశా నిర్దేశం చేసేందుకు ఈ పాలసీ ఉపయోగపడనుంది. ప్రధానంగా పేషంట్లను దృష్టిలో ఉంచుకుని, వారి అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను తయారు చేస్తూ వైద్య పరికరాల రంగం వేగవంతంగా వృద్ధి చెందేలా ఊతమివ్వాలని ఇందులో నిర్దేశించుకున్నారు.

11 బిలియన్ డాలర్ల పరిశ్రమ..

దేశీయంగా వైద్య పరికరాల మార్కెట్ 2020లో 11 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 90,000 కోట్లు) స్థాయిలో ఉందని అంచనా. అంతర్జాతీయంగా మెడికల్ డివైజ్‌ల మార్కెట్లో మన వాటా దాదాపు 1.5% వైద్య పరికరాల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా కేంద్రం ఇప్పటికే ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్‌ఐ) పథకాన్ని అమలు చేస్తోంది. హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, తమిళనాడు, ఉత్తర్ ప్రదేశ్‌లో 4 మెడికల్ డివైజ్ పార్క్‌ల ఏర్పాటు కోసం తోడ్పాటు అందిస్తోంది. ఈ స్కీము కింద ఇప్పటివరకు రూ. 1,206 కోట్ల విలువ చేసే పెట్టుబడులతో 26 ప్రాజెక్టులు ఆమోదం పొందాయి. 37 ఉత్పత్తులను తయారు చేసే 14 ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు వివరించింది. వీటిలో లీనియర్ యాక్సిలరేటర్, ఎంఆర్‌ఐ స్కాన్, సీటీ–స్కాన్, మామోగ్రామ్, సీ–ఆర్మ్, ఎంఆర్‌ఐ కాయిల్స్, అధునాతన ఎక్స్–రే ట్యూబ్స్ మొదలైనవి ఉత్పత్తి చేస్తున్నారు.

మార్కెట్లు మళ్లీ ముందుకే..

- మూడో రోజూ కొనుగోళ్ల హవా
- సెన్సెక్స్ 170 పాయింట్లు అప్

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభపడ్డాయి. అయితే మరోసారి నేలచూపులతో మొదలైనప్పటికీ వెనువెంటనే పరుగందుకున్నాయి. ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 170 పాయింట్లు జమ చేసుకుని 60,301 వద్ద నిలిచింది. నిఫ్టీ 44 పాయింట్లు ఎగసి 17,814 వద్ద స్థిరపడింది. రెండు రోజులుగా ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటున్న బ్యాంక్ కౌంటర్లకు డిమాండ్ కొనసాగింది. క్యూ4(జనవరి–మార్చి)లో ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, బ్యాంకింగ్ తదితర రంగాల దిగ్గజాలు ప్రోత్సాహకర ఫలితాలు ప్రకటిస్తుండటంతో సెంటిమెంటు బలపడినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దీంతో గురువారం ఏప్రిల్ డెరివేటివ్ సిరీస్ ముగియనున్నప్పటికీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 59,955 వద్ద కనిష్టాన్ని, 60,363 వద్ద గరిష్టాన్ని తాకింది. ఈ బాటలో నిఫ్టీ 17,711–17,828 పాయింట్ల మధ్య ఆటుపోట్లకు లోనయ్యింది. ఇటీవల విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యత ఇవ్వడం, ఏప్రిల్ ఎఫ్అండ్‌వో కాంట్రాక్టుల గడువు తీరనుండటం వంటి అంశాలు మార్కెట్లను కొంతమేర ఊగిసలాటకు గురిచేస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.



రూపాయి 21 పైసలు అప్

డాలర్ మారకంలో రూపాయి మారకపు విలువ బుధవారం 21 పైసలు బలపడి 81.74కు బలపడింది. విదేశీ మార్కెట్‌లో అమెరికా కరెన్సీ బలహీనత, ఆసియన్ కరెన్సీల లాభదాయకత దీనికి కారణం.

మెటల్ డౌన్...

ఎన్‌ఎస్‌ఈలో రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, ఆటో, ప్రభుత్వ, ప్రయివేట్ బ్యాంక్స్ 1.4–0.5% మధ్య బలపడగా.. మెటల్ 0.5% తగ్గింది. నిఫ్టీలో పవర్ గ్రిడ్, టాటా కన్స్యూమర్, నెస్లే, ఇండస్‌ఇండ్, ఎస్‌బీఐ లైఫ్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌యూఎల్, ఎస్‌బీఐ, యాక్సిస్, టాటా మోటార్స్, ఐషర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఎంఅండ్ఎం 2.6–0.5% లాభపడ్డాయి. అయితే హిండాల్కో, అదానీ పోర్ట్స్, బజాజ్ ఆటో, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ, ఆర్‌ఐఎల్, దివీస్ 1.2–0.5 శాతం మధ్య క్షీణించాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

బార్క్, ముంబైలో 4374 పోస్టులు

ముంబై ట్రాంబేలోని భారత అణుశక్తి విభాగానికి చెందిన బాబా అణు పరిశోధనా కేంద్రం(బార్క్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/ట్రైనింగ్ స్కీమ్ ద్వారా డీఏఈ విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 4374

ఖాళీల వివరాలు

» డైరెక్ట్ రిక్రూట్‌మెంట్: టెక్నికల్ ఆఫీసర్/సి–181, సైంటిఫిక్ అసిస్టెంట్/బి–07, టెక్నీషియన్/బి–24.
» ప్రారంభ వేతనం: నెలకు టీవో ఖాళీలకు రూ.56,100, ఎస్ఏకు రూ.35,400, టెక్నీషియన్ పోస్టులకు రూ.21,700 చెల్లిస్తారు.
» ట్రైనింగ్ స్కీమ్(స్టైపెండరీ ట్రైనీ): 4162(కేటగిరీ 1–1216, కేటగిరీ2–2946)
» స్టైపెండ్: నెలకు కేటగిరీ1కు రూ.24,000 నుంచి రూ.26,000, కేటగిరీ 2కు రూ.20,000 నుంచి రూ.22,000 వరకు ఉంటుంది.
» విభాగాలు: బయోసైన్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఆర్కిటెక్చర్, కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్,మెకానికల్, మెటలర్జీ, మైనింగ్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 22.05.2023 నాటికి టెక్నికల్ ఆఫీసర్‌కు 18–35 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 18–30 ఏళ్లు, టెక్నీషియన్‌కు 18–25 ఏళ్లు, స్టైపెండరీ ట్రైనీ కేటగిరీ1కు 19–24 ఏళ్లు, స్టైపెండరీ ట్రైనీ కేటగిరీ2కు 18–22 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్,అడ్వాన్స్‌డ్ టెస్ట్,స్కిల్ టెస్ట్,ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అమరావతి, గుంటూరు, హైదరాబాద్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:24.04.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:22.05.2023.
» వెబ్‌సైట్: www.barc.gov.in

ఈఎస్ఐసీ, హైదరాబాద్‌లో 40 మెడికల్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ).. మెడికల్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 40
» పోస్టుల వివరాలు: సూపర్ స్పెషలిస్ట్, సీనియర్ కన్సల్టెంట్, సీనియర్ రెసిడెంట్ తదితరాలు.
» విభాగాలు: రేడియాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంబీబీఎస్/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 45 నుంచి 69 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.67,700 నుంచి రూ.2.4 లక్షలు చెల్లిస్తారు. » ఎంపిక విధానం: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఇంటర్వ్యూ వేదిక: చాంబర్ ఆఫ్ మెడికల్ సూపరింటెండెంట్, ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సనత్‌నగర్, హైదరాబాద్.
» ఇంటర్వ్యూ తేది: 25.04.2023 నుంచి 28.04.2023
» వెబ్‌సైట్: www.esic.gov.in

బీఈఎంఎల్, బెంగళూరులో 69 ఉద్యోగాలు

బెంగళూరులోని బీఈఎంఎల్ లిమిటెడ్.. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 69
» పోస్టుల వివరాలు: హెడ్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్–01, స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ గ్రూప్ ఏ, గ్రూప్ బీ, గ్రూప్ సీ–68.
» దరఖాస్తు ప్రారంభతేది: 14.04.2023 నుంచి
» వెబ్‌సైట్: www.bemlindia.in

నిఫ్ట్, హైదరాబాద్‌లో 11 గ్రూప్ సీ పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్).. శాశ్వత ప్రాతిపదికన గ్రూప్ సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 11
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ వార్డెన్(మహిళ)–02, నర్సు(మహిళ)–01, అసిస్టెంట్(ఫైనాన్షియల్ అండ్ అకౌంట్స్)–02, జూనియర్ అసిస్టెంట్–02, ల్యాబ్ అసిస్టెంట్–03, లైబ్రరీ అసిస్టెంట్–01.
» అర్హత: పోస్టును అనుసరించి 10+2/డిప్లొమా/ఐటీఐ/బీఎస్సీ/బ్యాచిలర్స్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» పని అనుభవం: కనీసం 6 నెలలు నుంచి 5 ఏళ్లు పని అనుభవం ఉండాలి.
» వయసు: 27 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ప్రాక్టికల్ టెస్ట్/స్కిల్ టెస్ట్, రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తులకు చివరితేది: 30.04.2023.
» వెబ్‌సైట్: www.nift.ac.in

టీఎస్ ఎన్‌పీడీసీఎల్‌లో కొలువులు

» జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు
» 100 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల

వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్)లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. రెగ్యులర్ ప్రాతిపదికన రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నారు. ఆ వివరాలు..

ఈ సర్కిళ్లలోనే పోస్టుల భర్తీ

వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ విద్యుత్ సర్కిళ్లలో 100 పోస్టులను భర్తీ చేయనున్నారు.

అర్హతలు: బీఏ/బీఎస్సీ/బీకామ్‌తోపాటు కంప్యూటర్ అప్లికేషన్/ఆఫీస్ ఆటోమేషన్(ఎంఎస్ ఆఫీస్) సర్టిఫికేట్ కోర్సు ఉత్తీర్ణులైన వారు ఈ పోస్టులకు అర్హులు.

వయసు: 01.01.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ట వయసులో ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు, ఎక్స్–సర్వీస్‌మెన్‌లకు 3ఏళ్ల సడలింపు ఉంటుంది. ఇప్పటికే టీఎస్ ట్రాన్స్‌కో /టీఎస్ఎస్‌పీడీసీఎల్/టీఎస్ఎన్‌పీడీసీఎల్ పనిచేస్తున్న ఉద్యోగులూ దరఖాస్తు చేసుకోవచ్చు. వీరి విషయంలో ఉద్యోగంలో చేరినప్పటి వయసును పరిగణనలోకి తీసుకుంటారు. వీరు నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

ఎంపిక ఇలా: రాత పరీక్షలో సాధించిన మార్కులు, అనుభవం, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష ఇలా: ఓఎంఆర్‌షీట్ పద్ధతిలో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షను నిర్వహిస్తారు. దీంట్లో మొత్తం మూడు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్–ఎలో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, సెక్షన్–బిలో కంప్యూటర్ అవేర్‌నెస్‌కు చెందిన 20 ప్రశ్నలు–20 మార్కులు, సెక్షన్–సిలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ అండ్ జనరల్ నాలెడ్జ్ 20 ప్రశ్నలు–20 మార్కులుంటాయి. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు.

కనీస మార్కులు: బీసీలకు 35శాతం,ఎస్సీ/ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు 30% రావాలి. రాత పరీక్షను హైదరాబాద్ జీహెచ్ఎంసీ,వరంగల్ జీడబ్ల్యూఎంసీ పరిధిలోని వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తారు.

సిలబస్ అంశాలు

సెక్షన్–ఎ: న్యూమరికల్ ఎబిలిటీలోని.. ఇండిసెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, ప్రాఫిట్ అండ్ లాస్, మెన్సురేషన్, ఆల్జీబ్రా, జామెట్రీ అండ్ స్టాటిస్టిక్స్ ఉంటాయి. ఇవేకాకుండా లాజికల్ రీజనింగ్ అండ్ డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

సెక్షన్–బి: కంప్యూటర్ అవేర్‌నెస్‌లో.. ఎంఎస్–ఆఫీస్, బేసిక్ కాన్సెప్ట్ ఆఫ్ కంప్యూటర్స్ , కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ స్కిల్స్, అకౌంట్స్ రిలేటెడ్ సాఫ్ట్‌వేర్ అంశాలు ఉంటాయి.



సెక్షన్–సి: ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ, కాంప్రహెన్షన్ పాసేజెస్ అండ్ రీ అరెంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్, సినానిమ్స్ అండ్ యాంటనిమ్స్ ఉంటాయి.

జనరల్ నాలెడ్జ్: ఈ విభాగానికి సంబంధించి కరెంట్ అఫైర్స్, కన్స్యూమర్ రిలేషన్స్, జనరల్ సైన్స్ ఇన్ ఎవ్రీడే లైఫ్, ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ ఆఫ్ ఇండియా, తెలంగాణ చరిత్ర, ఉద్యమం, తెలంగాణ సమాజం, సంస్కృతి, వారసత్వ సంపద, కళలు, సాహిత్యం తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

వెయిటేజీ ఇలా: ప్రశ్నపత్రం 80 మార్కులకు, ఇన్ సర్వీస్ వెయిటేజీ మార్కులు 20 ఉంటాయి. ఉద్యోగ ప్రకటన జారీ నాటికి టీఎస్ ట్రాన్స్‌కో/టీఎస్ఎస్‌పీడీసీఎల్/ టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో పనిచేస్తున్నవారికి వెయిటేజీ మార్కులు ఉంటాయి. ఆరు నెలలకు ఒక మార్కు చొప్పున ఇస్తారు. రాత పరీక్షలో సాధించిన మార్కులకు వీటిని కలుపుతారు. ఆరు నెలల కంటే తక్కువ సర్వీస్ ఉన్నవారికి వెయిటేజీ మార్కుల నిబంధన వర్తించదు. వివిధ కేటగిరిలకు చెందిన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం–రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈడబ్ల్యూఎస్‌లకు 10శాతం, బీసీలకు–25 శాతం,ఎస్సీలకు 15 శాతం,ఎస్టీలకు 10శాతం, పీహెచ్‌లకు 4శాతం, ఎక్స్–సర్వీస్‌మెన్‌కు 2 శాతం, మహిళలకు 33 1/3 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ప్రొబేషన్: ఎంపికైన అభ్యర్థులకు రెండేళ్ల కాలానికి ట్రైనింగ్ కమ్ ప్రొబేషన్ ఉంటుంది. విధుల్లో చేరే సమయంలో ఎస్ఎస్‌సీ, డిగ్రీ, క్యాస్ట్ అండ్ స్టడీ /రెసిడెన్స్ ఒరిజినల్ సర్టిఫికేట్లను సమర్పించాల్సి ఉంటుంది. ఉద్యోగంలో చేరే సమయంలో ఐదేళ్లకు (ప్రొబేషన్‌కు అదనంగా) బాండ్ రాయాలి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 29.04.2023
- దరఖాస్తు సవరణ తేదీలు: 2023. మే 02 –05 తేదీ వరకు
- వెబ్‌సైట్: https://tsnpdcl.cgg.gov.in

ఎయిమ్స్‌లో నర్సింగ్ ఆఫీసర్

» 3055 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

నర్సింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు దేశంలోని ప్రముఖ వైద్యసంస్థలైన ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)ల్లో సువర్ణ అవకాశం. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో భాగంగా మొత్తం 3055 నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా నియామకాలు ఉంటాయి. ఎయిమ్స్‌ల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల వివరాలు..

- మొత్తం పోస్టులు: నర్సింగ్ ఆఫీసర్ 3055

సంస్థల వారీగా ఖాళీల వివరాలు

ఎయిమ్స్ భటిండా–142, ఎయిమ్స్ భోపాల్–51, ఎయిమ్స్ భువనేశ్వర్–169, ఎయిమ్స్ బీబీనగర్–150, ఎయిమ్స్ బిలాస్‌పూర్–178, ఎయిమ్స్ దేవ్‌ఘర్–100, ఎయిమ్స్ గోరఖ్‌పూర్–121, ఎయిమ్స్ జోధ్‌పూర్–300, ఎయిమ్స్ కల్యాణి–24, ఎయిమ్స్ మంగళగిరి–117, ఎయిమ్స్ నాగ్‌పూర్–87, ఎయిమ్స్ రాయ్ బరేలీ–77, ఎయిమ్స్ న్యూఢిల్లీ–620, ఎయిమ్స్ పట్నా–200, ఎయిమ్స్ రాయ్‌పూర్–150, ఎయిమ్స్ రాజ్‌కోట్–100, ఎయిమ్స్ రిషికేష్–289, ఎయిమ్స్ విజయ్‌పూర్–180.

అర్హత: డిప్లొమా(జీఎన్ఎం)తోపాటు రెండేళ్ల పని అనుభవం లేదా బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్ /బీఎస్సీ నర్సింగ్/బీఎస్సీ(పోస్ట్ సర్టిఫికేట్)/పోస్ట్–బేసిక్ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సులుగా రిజిస్టరై ఉండాలి.

వయసు: వయసు 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు, ఎక్స్–సర్వీస్‌మెన్‌లకు అయిదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. **వేతనం:** నర్సింగ్ ఆఫీసర్ కొలువుకు ఎంపికైన వారికి పేస్కేల్ లెవల్ 7 ప్రకారం–వేతనాలు చెల్లిస్తారు. వీరు ప్రతి నెల రూ.44,900 మూల వేతనంగా పొందుతారు.దీనికి డీఏ,హెచ్‌ఆర్‌ఏ అదనంగా ఉంటాయి.

ఎంపిక ఇలా

నర్సింగ్ ఆఫీసర్స్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్టు(ఎన్ఓఆర్‌సెట్)లో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఆయా పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ పరీక్షలో సాధించిన స్కోరు ఆరు నెలలు లేదా తర్వాత పరీక్ష వరకు చెల్లుబాటు అవుతుంది. ఈ వ్యవధిలో కొత్తగా ఖాళీలు ఏర్పడితే ఈ స్కోరు ఆధారంగానే భర్తీ చేస్తారు. మొత్తం ఖాళీల్లో 80 శాతం మహిళలకు, 20 శాతం పురుషులకు కేటాయించారు. ఎన్ఓఆర్‌సెట్ అర్హత సాధించిన వారికి సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించి అనంతరం మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం పోస్టులను భర్తీచేస్తారు. ఇలా కొలువులో చేరిన వారిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తారు.

పరీక్ష విధానం

ఎన్ఓఆర్‌సెట్‌ను ఆబ్జెక్టివ్ విధానంలో 200 ప్రశ్నలకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం ప్రశ్నల్లో 180 సబ్జెక్టుకు సంబంధించినవి కాగా, మిగిలిన 20 ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్, ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి వస్తాయి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు కేటాయిస్తారు. అలాగే తప్పు సమాధానానికి మార్కులో మూడోవంతు తగ్గిస్తారు. ఈ పరీక్షలో కనీస అర్హత మార్కులు సాధించడం తప్పనిసరి.



అర్హత మార్కులు: జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 50శాతం, ఓబీసీలు–45 శాతం, ఎస్సీ/ఎస్టీలు 40శాతం అర్హత మార్కులుగా సాధించాలి. దివ్యాంగులకు వారి కేటగిరిని అనుసరించి 5 శాతం మార్కుల సడలింపు లభిస్తుంది.

సిలబస్: ఈ పరీక్షలో సబ్జెక్టు విభాగంలో అడిగే ప్రశ్నలు బీఎస్సీ నర్సింగ్ సిలబస్ నుంచే ఉంటాయి.కాబట్టి అభ్యర్థులు నాలుగేళ్ల బీఎస్సీ సిలబస్‌ను క్షుణ్నంగా చదవాలి. అలాగే గతంలో నిర్వహించిన పరీక్ష పత్రాలను,ఎమ్మెస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 05.05.2023
- సీబీటీ పరీక్ష తేదీ: 03.06.2023
- వెబ్‌సైట్: https://norcet4.aiimsexams.ac.in

కొత్త సచివాలయంలో బ్యాటరీ వాహనాలు

సాక్షి, హైదరాబాద్: కొత్త సచివాలయంలో బ్యాటరీ వాహనాలు సందడి చేస్తున్నాయి. బుధవారం నాలుగు కొత్త బ్యాటరీ వాహనాలు అక్కడికి చేరుకున్నాయి. వాటిని సచివాలయ ప్రారంభోత్సవం రోజు వీఐపీల కోసం వినియోగిస్తారని సమాచారం. ఆ తర్వాత కూడా వాటిని కొనసాగిస్తారని, లోపలికి సాధారణ ప్రజల వాహనాలకు అనుమతి లేనందున గేటు వద్ద నుంచి భవనం వరకు బ్యాటరీ వాహనంలో సందర్శకులు వెళ్లేందుకు వినియోగిస్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే కేవలం ప్రారంభోత్సవం కోసం మాత్రమే తెప్పించారని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. బుధవారం రాత్రి మంత్రి ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, జీఏడీ కార్యదర్శి శేషాద్రి తదితరులు వాటిని పరిశీలించారు. కాగా, ఈనెల 30న సచివాలయ భవనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ రోజు ఉదయం సుదర్శనయాగం నిర్వహించనున్న ప్రాంతంలో నిర్మించిన యాగశాల, సభా ప్రాంగణం, వీఐపీల వాహనాల పార్కింగ్ ప్రాంతాలను మంత్రి ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, ఈఎన్‌సీ గణపతి రెడ్డి, ఈఈ శశిధర్, నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పరిశీలించారు. భవనానికి రంగురంగుల లైటింగ్, ఫౌంటెయిన్లు, పూల మొక్కల ఏర్పాటు తదితరాలపై అధికారులకు సూచనలు చేశారు.

అమెరికాకు చెందిన సానెన్ జాతి మేకలు



'చీజ్' బడీపై మస్త్ మస్త్!

పాలమూరులో అమెరికా, దక్షిణాఫ్రికా మేకలు

సానెన్, బోయర్ జాతి రకాలు పెంచుతున్న సాలార్‌నగర్ వాసి

- కూలీగా జీవితాన్ని మొదలుపెట్టి వ్యాపారవేత్తగా ఎదిగిన తీరు..
- చీజ్, ఔషధాల తయారీలో ఈ పాల వినియోగం.. చీజ్ యూనిట్ కోసం 1,000 లీటర్ల పాలు ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు..
- ప్లాంట్ ఏర్పాటుపై ఇజ్రాయెల్ కంపెనీ ఆసక్తి
- ఈ తరహా ప్రత్యేక మేకల షెడ్డు తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిది

అతనో మారుమూల పల్లె వాసి.. బతుకుతెరువు కోసం పొట్ట చేతబట్టుకుని ముంబైకి వలస వెళ్లాడు. కూలీగా మొదలుపెట్టి కాంట్రాక్టు పనులు చేసే స్థాయికి ఎదిగాడు. సుమారు 35 ఏళ్లుగా అక్కడే జీవిస్తున్న ఆయన.. సొంత గ్రామానికి క్రమం తప్పకుండా రాకపోకలు కొనసాగిస్తున్నాడు. తనకు పుట్టిన కుమారుడు అక్కడే పెరిగి పెద్దయినా మానుకోలేదు. తండ్రి పేరును నిలబెట్టాలనే ఉద్దేశంతో సొంతూరులో ఏదైనా వ్యాపారం పెట్టాలని సంకల్పించాడు. వినూత్న ఆలోచనతో అమెరికా, దక్షిణ ఆఫ్రికా మేకల పెంపకానికి శ్రీకారం చుట్టాడు. మూడేళ్లలో చీజ్ ఉత్పత్తి లక్ష్య సాధన దిశగా ముందుకు దూసుకెళ్తున్నాడు. ఇది..మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం సాలార్‌నగర్ గ్రామానికి చెందిన జగదీశ్ ఖలాల్ సక్సెస్ స్టోరీ.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

30 నుంచి 300కు పైగా..

మేకలు పెంచాలన్న ఆలోచన రాగానే సాలార్‌నగర్‌లో తనకున్న ఏడు ఎకరాల వ్యవసాయ భూమిలో ఖలాల్ మొదట మామిడి, టేకు వంటి వివిధ రకాల మొక్కలు నాటాడు. ఆ తర్వాత మేకల ఉత్పత్తికి ప్రత్యేక షెడ్డు వేశాడు. అత్యధిక మాంసంతో పాటు పాలు ఇచ్చే అమెరికాకు చెందిన సానెన్, దక్షిణాఫ్రికాకు చెందిన బోయర్ జాతి మేకలను దిగుమతి చేసుకున్నాడు. 30 మేకలు, ఒక పొట్టేలుతో షెడ్డు ప్రారంభించాడు. మూడేళ్లలోనే జీవాల సంఖ్య 300కు పైగా పెరిగింది. పాలు అధికంగా ఇచ్చే సానెన్ రకానికి చెందిన మేక ఒక ఈతలో రెండు నుంచి మూడు పిల్లలకు జన్మనిస్తుంది. పిల్ల మేక మూడు నెలల్లోనే 30 కేజీల వరకు బరువు పెరుగుతుంది. ఒక్కో మేక మూడు నుంచి నాలుగు లీటర్ల పాలు ఇస్తుంది. అత్యధికంగా మాంసాన్ని ఇచ్చే బోయర్ రకానికి చెందిన మేక కొంచెం పొట్టిగా ఉండి వెడల్పుగా పెరుగుతుంది. ఇది 14 నెలల్లో రెండు ఈతల్లో రెండు చొప్పున నాలుగు పిల్లలకు జన్మనిస్తుంది. ఒక్కో మేక రోజుకు రెండు లీటర్ల వరకు పాలు ఇస్తుంది.

ప్రత్యేక షెడ్.. దాణా..

మేకల కోసం ప్రత్యేకంగా షెడ్ ఏర్పాటు చేశారు. మేకలకు ఏ విధమైన హానీ జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నేలపై పెంచకుండా మూడు, నాలుగు గడుగుల ఎత్తులో రంధ్రాలతో కూడిన ఫ్లోర్‌ను ఏర్పాటు చేశారు. రోగాలు సోకకుండా అత్యంత శుభ్రమైన వాతావరణం ఉండేలా చూస్తున్నారు. హైదరాబాద్ నుంచి వెటర్నరీ వైద్యుల బృందం క్రమం తప్పకుండా వాటిని పర్యవేక్షిస్తోంది. దాణా కోసం మొక్కజొన్న పచ్చిమేతను టన్నుల లెక్కన బిహార్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ప్రతిరోజూ ఉదయం అన్ని రకాల పోషకాలతో కూడిన దాణాను ఆహారంగా ఇస్తున్నారు. శుభ్రమైన నీటిని అందిస్తున్నారు. మధ్యాహ్నం సొంతంగా తయారుచేసిన జొన్న, మొక్కజొన్న కుడితి లాంటిది ఇస్తున్నారు. ఇలా రోజుకు మూడు పూటలు.. ఒక్కో మేకకు మొత్తంగా నాలుగు నుంచి ఆరు కిలోల దాణాను అందిస్తున్నారు. ఒక్క ఆవు పోషకంతో ఇలాంటి 10 మేకలను పెంచుకోవచ్చని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

బోయర్ విత్తన మేకపోతు రూ.3 లక్షలు

బోయర్ జాతి మేక సుమారు 70 కిలోల నుంచి క్వింటా వరకు మాంసాన్ని ఇస్తుంది. అదే మేకపోతు అయితే 1.5 క్వింటా వరకు మాంసం ఇస్తుందని అంచనా. బోయర్ విత్తన మేకపోతు ధర రూ.3 లక్షల వరకు ఉన్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

వెయ్యి లీటర్ల పాల ఉత్పత్తే లక్ష్యంగా..

మొత్తం వెయ్యి లీటర్ల పాలు ఉత్పత్తి చేస్తే.. అక్కడే చీజ్ మేకింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఇజ్రాయెల్‌కు చెందిన కంపెనీలు ముందుకొస్తున్నాయి. ఆ షెడ్డును కంపెనీయే తీసుకుని చీజ్ మేకింగ్ యూనిట్ నెలకొల్పేందుకు సిద్ధంగా ఉందని జగదీశ్ ఖలాల్ తెలిపాడు. ఈ లెక్కన మేకల సంఖ్య కనీసం వెయ్యికి పెరగాల్సి ఉంటుందని, దీంతో వచ్చే మూడేళ్లలో వెయ్యి మేకల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పాడు. వెయ్యి మేకలకు సరిపడా అన్ని రకాల ఏర్పాట్లతో షెడ్ నిర్మాణం చేస్తున్నామని, ఇలాంటిది రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేదని పేర్కొన్నాడు.



సానెన్ మేక పాలతో నాణ్యమైన చీజ్..

ఈ మేకల పాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. వీటి పాలను చీజ్ తయారు చేసేందుకు, ఔషధాల్లో వినియోగిస్తున్నారు. ప్రధానంగా సానెన్ రకానికి చెందిన మేకల పాలతో అత్యంత నాణ్యమైన చీజ్ తయారుచేసే అవకాశం ఉండడంతో ఇటీవలి కాలంలో ఈ జాతి పెంపకంపై దృష్టి పెరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఒక్కో మేక రెండు లీటర్ల చొప్పున పాలు ఇస్తున్నాయి. ఈ పాలను హైదరాబాద్‌కు తరలిస్తే లీటర్‌కు రూ.200 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. కానీ ప్రస్తుతం పాలు పెద్ద మొత్తంలో లేకపోవడంతో స్థానిక పాలకేంద్రాల్లో లీటర్‌కు రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్లు షెడ్డు కాపలాదారు ఆంజనేయులు చెప్పాడు.



విత్తన మేకపోతు



దక్షిణాఫ్రికాకు చెందిన బోయర్ జాతి మేకలు

యాదాద్రి ప్రధానాలయంలో మరోసారి లీకేజీలు

అష్టభుజి, బ్రహ్మోత్సవ, వేంచేపు మండపాల్లో కారుతున్న వర్షపు నీరు



క్యూకాంప్లెక్స్ మూడో అంతస్తులోని బీమ్ నుంచి కారుతున్న వర్షపు నీరు




ప్రథమ ప్రాకారంలో లీకేజీలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయంలో మరోసారి లీకేజీలు బయటపడ్డాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆలయ మండపాల స్లాబ్‌పై నీళ్లు నిలిచాయి. దీంతో అష్టభుజి ప్రాకార మండపం, బ్రహ్మోత్సవ మండపం, వేంచేపు మండపం, ప్రధానాలయ ముఖమండపంలోని అండాళ్ అమ్మవారి ఆలయం వెనుకున్న గోడ, ఆంజనేయస్వామి ఆలయం వెనక భాగాల్లోని గోడ నుంచి వర్షపు నీరు కారుతోంది. గతంలో వర్షం కురిసిన సమయాల్లో లీకేజీలు ఏర్పడ్డ చోట మరమ్మతులు చేపట్టినా లీకేజీలు అవుతున్నాయి. ఇక మాడ వీధుల్లో అక్కడక్కడా వర్షపు నీరు నిలిచింది. క్యూకాంప్లెక్స్ మూడో అంతస్తులో స్లాబ్ బీమ్ నుంచి వర్షపు నీరు చుక్కలుగా పడుతున్నాయి. కొండపైన ప్రొటోకాల్ కార్యాలయం నుంచి ప్రధానాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న మట్టి రోడ్డు సైతం కోతకు గురైంది.

సైబర్ నేరాలు అరికట్టడంలో తెలంగాణ ముందంజ

డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాలను అరికట్టడంలో దేశంలోనే తెలంగాణ పోలీస్ ముందంజలో ఉందని డీజీపీ అంజనీకుమార్ పేర్కొన్నారు. న్యూఢిల్లీ నుంచి గ్లోబల్ కౌంటర్ టెర్రరిజం కౌన్సిల్, డిజిటల్ ఇండియా సంయుక్తంగా 'సైబర్ సెక్యూరిటీ–2023'అంశంపై బుధవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన సదస్సులో అంజనీకుమార్ పాల్గొని మాట్లాడారు. సైబర్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేసిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరిగాయని, నేరాల నియంత్రణ కోసం ఇప్పటికే తెలంగాణ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ (టీ4సీ) కీలకపాత్ర వహిస్తోందన్నారు. సైబర్ సెక్యూరిటీలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరోను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ టీంలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1930, 100ల ద్వారా సైబర్ నేరాల ఫిర్యాదులను స్వీకరిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 800 పోలీసు స్టేషన్లలో సైబర్ క్రైంలను ఎదుర్కొనేందుకు పోలీసు ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సైబర్ వారియర్లుగా తయారు చేశామని తెలిపారు. తెలంగాణలో 2019లో 2,691 సైబర్ నేర కేసులు నమోదు కాగా, 2020లో 5,024, 2021లో 10,303, 2022లో 15,217 నమోదు అయ్యాయని వివరించారు.

ఫింగర్ ప్రింట్స్ కోసం సీఐడీకి అధునాతన కిట్లు

ఆరు జోన్లలోని అధికారులకు అందజేసిన సీఐడీ అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్



సాక్షి, హైదరాబాద్: నేరాలు జరిగినప్పుడు వాటిని ఛేదించేందుకు ఫింగర్ ప్రింట్స్ కీలక భూమిక పోషిస్తాయి. అలాంటి ఫింగర్ ప్రింట్స్ సేకరణ, తరువాత వాటిని విశ్లేషించడానికి అవసరమైన అధునాతన కిట్స్‌ను రాష్ట్ర సీఐడీ విభాగం సమకూర్చుకుంది. రూ.1.33 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన ఫింగర్ ప్రింట్ కిట్స్‌ను సీఐడీ అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్ బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆరు జోన్లలోని అధికారులకు అందజేశారు. ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్‌లోని ఎల్‌బీ నగర్ జోన్, సైబరాబాద్‌లోని శంషాబాద్ జోన్, హైదరాబాద్ నగరంలోని సౌత్, నార్త్, వెస్ట్, సెంట్రల్ జోన్‌లకు ఈ కిట్లను అందించారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని ఫింగర్ ప్రింట్ యూనిట్లకు వీటిని అందచేయనున్నట్లు మహేశ్‌భగవత్ చెప్పారు. సీఐడీలోని ఫింగర్ ప్రింట్ బ్యూరో డైరెక్టర్ తాతా రావు మాట్లాడుతూ ఒక్కో కిట్‌లో మొత్తం తొమ్మిది రకాల వస్తువులు ఉంటాయని తెలిపారు. మాస్టర్ ఎక్స్‌పర్ట్ లేటెంట్ ప్రింట్ కిట్, ఫింగర్ ప్రింట్ కెమికల్ ప్రాసెసింగ్ కిట్, లెటెంట్ బ్రషెస్, మాగ్నటిక్ పౌడర్ అప్లికేటర్, పోస్టు మార్టమ్ ఇంక్ టూల్, ఇంక్డ్ స్ట్రిప్స్, మాగ్నటిక్ పౌడర్స్, లెటెంట్ ప్రింట్ బేసిక్ పౌడర్స్, పోర్టబుల్ మల్టీబాండ్ లైట్‌సోర్స్ ఉంటాయి. కార్యక్రమంలో సీఐడీ అధికారులు ఎం.నారాయణ(అడ్మిన్), ఆర్ వెంకటేశ్వర్లు(ఎస్‌సీఆర్‌బీ) రవీందర్(నార్కొటిక్స్), డీఎస్పీ నందుకుమార్(ఎఫ్‌పీబీ) పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.